www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం | 17-8-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 123 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, శుక్లపక్షం; తిథి: ద్వాదశి ఉ. 8.06, త్రయోదశి తె. 5.51 వరకు; నక్షత్రం: పూర్వాషాఢ ఉ. 11.49 తదుపరి ఉత్తరాషాఢ; వర్జ్యం: రా. 7.17-8.47; దుర్ముహూర్తం: ఉ. 6.02-7.42; అమృతఘడియలు: ఉ. 7.12-8.44, తె. 4.16-5.54; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 6.02; సూర్యాస్తమయం: 6.35 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

స్పోర్ట్స్

విజయవాడ ● శనివారం 17 ఆగస్టు 2024



కరాటే, భరతనాట్యం ప్రాక్టీస్ చేస్తా

మను భాకర్

న్యూఢిల్లీ: ఒలింపిక్స్‌లో రెండు పతకాలతో రికార్డు సృష్టించిన స్టార్ షూటర్ మను భాకర్ ఇప్పుడు కరాటే, భరతనాట్యంలో రాటుదేలేందుకు సిద్ధమవుతోందట. అదేంటి.. ఇక షూటింగ్‌కు వీడ్కోలు పలికినట్టేనా? అనే ఆందోళన అవసరం లేదు. ఎందుకంటే.. బిజీ షెడ్యూల్‌తో అలసిపోయిన మను కొన్ని నెలలు షూటింగ్‌కు దూరంగా ఉండాలనుకుంటోంది. 'ఇప్పుడు నాకు తగినంత సమయం లభించింది. ఇక వ్యక్తిగత అభిరుచులపై దృష్టి సారిస్తా. కరాటేలో సాధనను తిరిగి ఆరంభిస్తా. అలాగే భరతనాట్యం కూడా నేర్చుకుంటున్నా. ఒలింపిక్స్ కారణంగా క్లాసులకు హాజరుకాలేదు. వయోలిన్ వచ్చు. గుర్రపు స్వారీ, స్కేటింగ్ కూడా ఎంతో ఇష్టం' అని ఓ ఇంటర్వ్యూలో మను భాకర్ వెల్లడించింది. అయితే మను గుర్రపు స్వారీ చేయవద్దని, పడిపోతే కష్టమని పక్కనే ఉన్న కోచ్ రాణా చెప్పడంతో... అలాంటిదేమీ లేదని, తనకు స్వారీ బాగా వచ్చని మను సమాధానమిచ్చింది.

సుమిత్ వచ్చేశాడు

స్వీడన్‌తో డేవిస్‌కప్‌కు భారత జట్టు



న్యూఢిల్లీ: భారత టెన్నిస్ సింగిల్స్ టాప్ ఆటగాడు సుమిత్ నగల్ డేవిస్ కప్ జట్టులోకి తిరిగొచ్చాడు. వచ్చేనెల 14, 15వ తేదీల్లో స్వీడన్‌తో భారత్ తలపడే వరల్డ్ గ్రూప్ 1 పోరుకు శుక్రవారం ప్రకటించిన జట్టులో నగల్ చోటు దక్కించుకున్నాడు. ఇటీవల ఇస్లామాబాద్ వేదికగా పాకిస్థాన్‌తో భారత్ ఆడిన డేవిస్ కప్ పోరుకు నగల్ దూరమైన సంగతి తెలిసిందే. ఇక, స్వీడన్‌తో పోరుకు సుమిత్‌తో పాటు రామ్‌కుమార్ రామనాథన్, శ్రీరామ్ బాలాజీ, నికీ పొనాచా, సిద్దార్థ్ విశ్వకర్మ భారత్ జట్టులో ఉన్నారు. ఆర్యన్ షాను రిజర్వ్ ఆటగాడిగా ఎంపికచేశారు. కాగా, డబుల్స్ స్పెషలిస్టు యుకీ భాంబ్రీ ఈ పోరు నుంచి తప్పుకొన్నాడు. దీంతో శ్రీరామ్ బాలాజీకి తోడుగా రామ్‌కుమార్‌ను డబుల్స్‌లో ఆడించే చాన్సుంది. సింగిల్స్‌లో కూడా రామ్‌కుమార్ తలపడతాడు. ఇక, జీషన్ అలీ స్థానంలో మాజీ ఆటగాడు అశుతోష్ సింగ్ కొత్త కోచ్‌గా వ్యవహరించనున్నాడు.

మనసు మార్చుకుందా?

కెరీర్ కొనసాగింపుపై వినేశ్ పరోక్ష సంకేతం



న్యూఢిల్లీ: కేవలం 100 గ్రాములు అధిక బరువుందనే కారణంతో పారిస్ ఒలింపిక్స్ మహిళల 50 కిలోల విభాగం ఫైనల్‌కు స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగట్‌ను అనర్హురాలిగా ప్రకటించడంతో దేశం యావత్తు నివ్వెరపోయింది. క్రీడల నిర్వాహకుల నిర్ణయాన్ని జీర్ణించుకోలేకపోయింది. మనకే ఇంత బాధ ఉంటే రెజ్లర్ వినేశ్‌కు ఇంకా ఎంత వేదన ఉంటుందో కదా! అందివచ్చిన ఒలింపిక్ పతకం చేజారడంతో మనసు వికలమైన ఫొగట్ అనూహ్యంగా తన కెరీర్‌కు వీడ్కోలు పలికింది. తన నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని ఫ్యాన్స్, సహచర క్రీడాకారులు వినేశ్‌ను కోరారు కూడా. పైగా..తన అనర్హతను సవాలు చేస్తూ..క్రీడా మధ్యవర్తిత్వ న్యాయస్థానా (కాస్)న్ని ఆశ్రయించిన వినేశ్‌కు అక్కడా ఊరట లభించలేదు. ఈ నేపథ్యంలో పోరాటానికి మారుపేరైన 29 ఏళ్ల ఫొగట్ తన మనసు మార్చుకున్నట్టే కనిపిస్తోంది. మరో రెండు ఒలింపిక్స్‌లో తలపడాలనే ఆకాంక్షను పరోక్షంగా వ్యక్తీకరించింది. ఈమేరకు సోషల్‌మీడియాలో ఆమె శుక్రవారం ఉద్వేగంతో కూడిన సుదీర్ఘ పోస్టు చేసింది. 'విభిన్న పరిస్థితుల నేపథ్యంలో 2032 వరకు నేను ఆడగలననే అనిపిస్తోంది. నాలో పోరాటం, నాలో రెజ్లింగ్ ఎప్పుడూ ఉంటుంది. నా భవిష్యత్ ఎలా ఉంటుందో, ఆ ప్రయాణంలో ఏమి జరుగుతుందో చెప్పలేను. కానీ నేను నమ్మిన, నాకు సరైనదే అనిపించిన దానికోసం పోరాటాన్ని ఎప్పుడూ ఆపను' అని తెల్చి చెప్పింది. 'మనుగడ కోసం పోరాటం ఎన్నో పాఠాలు నేర్పింది. నాన్నను చిన్నతనంలోనే కోల్పోయా. అమ్మ కేన్సర్ బారిన పడింది. అయినా ఆమె ఎప్పుడూ జీవన పోరాటం ఆపలేదు. పోరాడేతత్వం అమ్మనుంచే అలవడింది' అని కష్టాలమయమైన తన బాల్యాన్ని గుర్తు చేసుకుంది. చిన్నతనంలో.. పొడవైన జుత్తు కోసం ఎన్నో కలలు కన్నానని చెప్పింది. తన కెరీర్ ఎదుగుదలకు ఎంతో తోడ్పడిన కోచ్‌లు, ట్రెయినర్, డాక్టర్ పార్దీవాలాకు ఎప్పటికీ రుణపడి ఉంటానని పేర్కొంది. భర్త సోమ్‌వీర్ తనకు నిరంతరం రక్షణ కవచంలా నిలిచాడని తెలిపింది.

చనిపోతుందేమోనని భయపడ్డాం..

వినేశ్ కోచ్ వోలర్

న్యూఢిల్లీ: ఒలింపిక్స్ 50 కిలోల ఫ్రీస్టయిల్ విభాగం ఫైనల్ బరిలో నిలిచేందుకు రెజ్లర్ వినేశ్ ఫొగట్ కష్టపడిన తీరును కోచ్ వోలర్ ఎకోస్ వివరించాడు. ఓ దశలో ఆమె చనిపోతుందేమోనని భయపడినట్టు ఆందోళన వ్యక్తం చేశాడు. ఫైనల్‌కు ముందు నిర్ణీత బరువుకన్నా 100 గ్రాములు అధికంగా ఉండడంతో వినేశ్‌పై అనర్హత వేటు పడిన విషయం తెలిసిందే. 'సెమీస్ తర్వాత వినేశ్ 2.7 కేజీల అధిక బరువుంది. వెంటనే గంటా 20 నిమిషాలు వ్యాయామం చేయించాం. అయినా 1.5 కేజీ అలాగే ఉంది. ఆ తర్వాత 50 నిమిషాల ఆవిరి సెషన్ తర్వాత ఒక చుక్క చెమట కూడా కనిపించలేదు. దీంతో అర్ధరాత్రి నుంచి ఉదయం 5.30 వరకు రకరకాల వ్యాయామాలను చేయించాం. మధ్యలో రెండు మూడు నిమిషాలపాటు విశ్రాంతి మాత్రమే ఉండేది. ఓ దశలో తను కుప్పకూలిపోయేది. తిరిగి లేపి గంటపాటు ఆవిరి సెషన్ కోసం పంపేవాళ్లం. ఈ క్రమంలో ఆమె చనిపోతుందేమో అనిపించేది' అని గురువారం ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేసిన కోచ్ వోలర్ ఆ తర్వాత దాన్ని తొలగించాడు.



విజయీభవ

పారాలింపిక్స్‌కు భారత బృందం పయనం

న్యూఢిల్లీ: పారిస్‌లో ఒలింపిక్స్ ఇటీవలే ముగిశాయి. ఆ విశ్వక్రీడల్లో మనోళ్లు ఆరు పతకాలతో మెరిశారు. ఇప్పుడిక పారా అథ్లెట్ల వంతు. పారిస్ వేదికగానే ఈనెల 28 నుంచి వచ్చేనెల 8వ తేదీ వరకు పారాలింపిక్స్ జరగనున్నాయి. ఈ ప్రతిష్ఠాత్మక క్రీడల్లో సత్తా చాటేందుకు భారత అథ్లెట్లు సిద్ధమయ్యారు. పారాలింపిక్స్‌లో తలపడుతున్న 84 మందితో కూడిన భారత బృందం శుక్రవారం పారిస్‌కు పయనమైంది. వీరికి భారత పారాలింపిక్ కమిటీ (పీసీఐ), భారత క్రీడా ప్రాధికార సంస్థ (సాయ్) ఘనంగా వీడ్కోలు పలికాయి. 'మన పారా అథ్లెట్లు అడ్డంకులను అధిగమించి, సవాళ్లను అవకాశాలుగా మలచుకోవడంలో అద్భుత సామర్థ్యాలు కలిగి ఉన్నారు. పారిస్ సన్నాహకాల్లో వారు ఎక్కడలేని పట్టుదల ప్రదర్శించారు. పారాలింపిక్స్‌కు బయలుదేరుతున్న వేళ దేశమంతా మీకు అండగా ఉంటోంది. ఈ క్రీడల్లో మీరు దేశానికి ఎంతో కీర్తి ప్రతిష్ఠలు తీసుకొస్తారనే నమ్మకముంది. విశ్వవేదికపై తలపడుతున్న వారికి శుభాకాంక్షలు' అని పారా అథ్లెట్ల కోసం ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో పాల్గొన్న కేంద్ర క్రీడాశాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవ్య అన్నారు.

ఈమారు పారాలింపిక్స్‌లో 12 అంశాల్లో మన క్రీడాకారులు అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఇక గత టోక్యో పారా ఒలింపిక్స్‌లో భారత్ 19 పతకాలు సాధించింది. ఈసారి మరింత మెరుగ్గా రాణించి పతకాల సంఖ్యను పెంచుకుంటామనే ధీమాను భారత పారాలింపిక్ కమిటీ చీఫ్ దేవేంద్ర జఝారియా వ్యక్తంజేశాడు.

పతాకధారులుగా సుమిత్, భాగ్యశ్రీ

పారిస్ పారాలింపిక్స్ ప్రారంభ వేడుకల్లో భారత జట్టును సుమిత్ అంటిల్, భాగ్యశ్రీ జాధవ్‌లు ముందుండి నడిపించనున్నారు. ఈ మేరకు వీరిద్దరు వేడుకల్లో మన జట్టు పతాకధారులుగా వ్యవహరిస్తారని పీసీఐ చీఫ్ దేవేంద్ర జఝారియా శుక్రవారం తెలిపాడు. జావెలిన్ త్రోయరైన సుమిత్ అంటిల్ గత టోక్యో పారాలింపిక్స్‌లో బంగారు పతకం సాధించి అదరగొట్టాడు. ఇక, షాట్‌పుట్ ఈవెంట్‌లో భాగ్యశ్రీ గత ఆసియా పారా క్రీడల్లో రజత పతకంతో మెరిసింది.

వినేశ్ వీర పుత్రిక

ప్రధాని ప్రశంస

న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్ మహిళల 50 కిలోల ఫైనల్ నుంచి అనూహ్యంగా అనర్హతకు గురైన రెజ్లర్ వినేశ్ ఫొగట్‌పై ప్రధాని మోదీ ప్రశంసలు కురిపించారు. ఆమెను 'వీర పుత్రిక'గా అభివర్ణించారు. విశ్వక్రీడల్లో పాల్గొన్న భారత క్రీడాకారులు స్వాతంత్ర్య దినోత్సవాన మోదీని కలిసిన విషయం విదితమే. ఈమేరకు..అథ్లెట్లతో తన భేటీకి సంబంధించిన వివరాలను మోదీ ఎక్స్‌లో శుక్రవారం పోస్ట్ చేశారు.

నన్ను తిట్టింది ఎవరు?

అథ్లెట్లతో మోదీ సరదా వ్యాఖ్యలు

ఒలింపిక్స్ సమయంలో పారిస్‌లో ఎండలు మండిపోయాయి. సూర్యుడి భగభగలకు అథ్లెట్లు అల్లాడిపోయారు. విశ్వ క్రీడలను పర్యావరణ సహితంగా నిర్వహించాలని నిర్ణయించిన నేపథ్యంలో క్రీడా గ్రామంలోని ఏ గదిలోనూ ఎయిర్ కండిషనర్లు ఏర్పాటు చేయలేదు. ఎండకు మన క్రీడాకారులు తట్టుకోలేకపోవడంతో పారిస్‌లోని భారత రాయబార కార్యాలయ అధికారులు హుటాహుటిన 40 పోర్టబుల్ ఏసీలను ఏర్పాటు చేశారు. ఈ విషయాన్ని ప్రస్తావించిన ప్రధాని..అథ్లెట్లతో జోక్ చేశారు. 'నిజం చెప్పండి. మోదీ బాగా మాటలు చెబుతారు. కానీ గేమ్స్ విలేజ్ రూములలో ఏసీ ఏర్పాటు చేయలేదు. ఇప్పుడు ఏం చేయాలని మీలో ఎవరు నన్ను తిట్టుకున్నారు' అని ప్రధాని నవ్వుతూ ప్రశ్నించారు.

అజిత్, అర్జున్ జిగేల్

ముగిసిన ప్రొ. కబడ్డీ వేలం

ముంబై: ప్రొ. కబడ్డీ సీజన్-11 ఆటగాళ్ల వేలం ముగిసింది. మొత్తం 118 మంది ఆటగాళ్లను ఫ్రాంచైజీలు కొనుగోలు చేశాయి. తొలిరోజైన గురువారం సచిన్ తన్వర్, మహ్మద్‌రెజాలపై కోట్లు కుమ్మరించిన ఫ్రాంచైజీలు.. రెండోరోజైన శుక్రవారం జరిగిన వేలంలో అజిత్, జై భవాన్, అర్జున్‌లను లక్షాధికారులను చేశాయి. అజిత్‌ను పుణెరి పల్టన్ జట్టు రూ.66 లక్షలకు, భగవాన్‌ను బెంగళూరు బుల్స్ రూ. 63 లక్షలకు, అర్జున్‌ను బెంగాల్ వారియర్స్ రూ.41 లక్షలకు సొంతం చేసుకున్నాయి.

డబ్ల్యూఎఫ్ఐకి మళ్లీ అడ్‌హాక్ కమిటీ

ఢిల్లీ హైకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) రోజువారీ వ్యవహారాల ను పర్యవేక్షించే బాధ్యతను భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) ఆధ్వర్యంలోని అడ్‌హాక్ కమిటీకి మళ్లీ అప్పగిస్తూ ఢిల్లీ హైకోర్టు శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. రెజ్లింగ్ సమాఖ్య ప్రస్తుత కార్యవర్గం ఎలాంటి కార్యకలాపాలు చేపట్టకుండా స్టే విధించాలని స్టార్ రెజ్లర్లు బజ్‌రంగ్, వినేశ్ ఫొగట్, సాక్షి మాలిక్ గతంలో ఈ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన జస్టిస్ సచిన్ దత్తా.. మధ్యంతర ఆదేశాలు జారీ చేశారు. గతంలో ఏర్పాటు చేసిన అడ్‌హాక్ కమిటీని ఐఓఏ పునరుద్ధరించాలని సూచించారు. అందులో ప్రముఖ క్రీడాకారులు ఉండాలని ఆదేశించారు. డబ్ల్యూఎఫ్ఐ కార్యకలాపాల నిర్వహణకు గతేడాది డిసెంబరు 27 అడ్‌హాక్ కమిటీని ఐఓఏ ఏర్పాటు చేసింది. భారత రెజ్లింగ్ సమాఖ్యకు ఎన్నికలు జరిగిన నేపథ్యంలో..ఈ ఏడాది ఫిబ్రవరి 13న డబ్ల్యూఎఫ్ఐపై విధించిన నిషేధాన్ని యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ (యూడబ్ల్యూడబ్ల్యూ) ఎత్తివేసింది. దాంతో గత ఏప్రిల్ 4న అడ్‌హాక్ కమిటీని ఐఓఏ రద్దు చేసింది. కాగా, ఈ ఆదేశాలను డివిజన్ బెంచిలో సవాలు చేయనున్నట్టు డబ్ల్యూఎఫ్ఐ వెల్లడించింది. రెజ్లింగ్ సమాఖ్య వ్యవహారాల్లో ఇతరుల జోక్యాన్ని యూడబ్ల్యూడబ్ల్యూ అంగీకరించ దని డబ్ల్యూఎఫ్ఐ చీఫ్ సంజయ్ సింగ్ అన్నారు. సమాఖ్యలో ఇతరులు జోక్యం చేసుకుంటే.. రాబోయే వరల్డ్ చాంపియన్‌షిప్‌లో మన రెజ్లర్లు ఆడకుండా నిషేధం విధించే ప్రమాదముందని ఆయన హెచ్చరించారు.

అంతా ఏకగ్రీవమే!

ముగిసిన ఏసీఏ నామినేషన్ల ప్రక్రియ

విశాఖపట్నం (స్పోర్ట్స్): ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) నూతన కార్యవర్గం ఎన్నిక ఎలాంటి పోటీ లేకుండా లాంఛనంగా ముగిసింది. శుక్రవారం పోతినమల్లయ్యపాలెంలోని ఏసీఏ కార్యాలయంలో అపెక్స్ కౌన్సిల్‌లోని ఆరు పదవులకు కేవలం ఆరు నామినేషన్లే దాఖలయ్యాయి. దీంతో ఈ ఎన్నిక లాంఛనం ఏకగ్రీవంగా పూర్తయినట్టయింది. అధికారిక ప్రకటన మాత్రమే మిగిలుంది. ఏసీఏ అధ్యక్షుడిగా విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఉపాధ్యక్షుడిగా పి.వెంకట ప్రశాంత్, కార్యదర్శిగా సానా సతీష్ బాబు, సంయుక్త కార్యదర్శిగా పి. విష్ణుకుమార్‌రాజు (విశాఖపట్నం నార్త్ ఎమ్మెల్యే), కోశాధికారిగా దండుమూడి శ్రీనివాస్, కౌన్సిలర్‌గా డి. గౌరు విష్ణుతేజ పేరిట నామినేషన్లు దాఖలయ్యాయి. వీళ్లకు పోటీగా మరెవరూ నామినేషన్లు దాఖలు చేయలేదు. సోమవారం నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగుస్తుంది. ఆ వెంటనే ఈ ఆరుగురు ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు అధికారికంగా ప్రకటించనున్నారు.

బిజినెస్

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	90	విజయవాడ	98
వరంగల్	90	గుంటూరు	98
కరీంనగర్	90	ఒంగోలు	98
మహబూబ్‌నగర్	90	చిత్తూరు	106
కర్నూలు	90	నెల్లూరు	106
విశాఖపట్నం	94	అనంతపురం	98
గోదావరి	98		

రూ.7.30 లక్షల కోట్ల లాభం

మార్కెట్ సంపదలో భారీ వృద్ధి
సెన్సెక్స్ 1,330 పాయింట్లు అప్
24,500 ఎగువ స్థాయికి నిఫ్టీ



ముంబై: వారాంతం ట్రేడింగ్‌లో దేశీయ స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు భారీగా లాభపడ్డాయి. శుక్రవారం సెన్సెక్స్ ఒక దశలో 1,412 పాయింట్ల వరకు పెరిగి 80,518 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి 1,330.96 పాయింట్ల (1.68 శాతం) లాభంతో 80,436.84 వద్ద స్థిరపడింది. గత రెండు వారాలకు పైగా సమయంలో సూచీకిదే అతిపెద్ద ఒక్కరోజు లాభం. రెండు వారాల గరిష్ఠ ముగింపు స్థాయి కూడా. నిఫ్టీ విషయానికొస్తే, 397.40 పాయింట్ల (1.65 శాతం) వృద్ధితో 2 వారాల గరిష్ఠ స్థాయి 24,541.15 వద్ద ముగిసింది. అమెరికా ఆర్థిక మాంద్యం భయాలు తగ్గుముఖం పట్టడంతో పాటు వచ్చే నెలలో ఫెడ్ రేట్ల తగ్గింపు ప్రారంభం కావచ్చన్న అంచనాలు ఊపందుకోవడంతో గ్లోబల్ మార్కెట్లతో పాటు దేశీయ సూచీలూ ర్యాలీ తీశాయి. ఐటీ, ఆటో, బ్యాంకింగ్, మెటల్, రియల్టీ రంగ షేర్లలో భారీగా కొనుగోళ్లు జరిగాయి. దాంతో ఈక్విటీ ఇన్వెస్టర్ల సంపదగా పరిగణించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ ఒక్కరోజే రూ.7.30 లక్షల కోట్లు పెరిగి రూ.451.59 లక్షల కోట్లకు (5.38 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది. మరిన్ని ముఖ్యాంశాలు..

● సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీలూ పాజిటివ్‌గా ముగిశాయి. టెక్ మహీంద్రా షేరు 4.02 శాతం ఎగబాకి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. టాటా మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు 3 శాతానికి పైగా పుంజుకోగా.. టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్, ఇన్ఫోసిస్, అల్ట్రాటెక్, టాటా స్టీల్, అదానీ పోర్ట్స్, ఐటీసీ, నెస్లే, బజాజ్ ఫైనాన్స్ షేర్లు రెండు శాతానికి పైగా రాణించాయి.

● ఈ మధ్యనే స్టాక్ మార్కెట్లో లిస్టయిన ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ షేరు మరో 20 శాతం వృద్ధితో అప్పర్ సర్క్యూట్ స్థాయి రూ.132.76కు చేరుకుంది. దాంతో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.58,558 కోట్లకు ఎగబాకింది. కంపెనీ ఐపీఓ ధర రూ.76తో పోలిస్తే షేరు ఇప్పటివరకు 75 శాతం పుంజుకుంది.

● ఈ నెల 9తో ముగిసిన వారంలో విదేశీ మారకం (ఫారెక్స్) నిల్వలు 480 కోట్ల డాలర్ల తగ్గుదలతో 67,011 కోట్ల డాలర్లకు పడిపోయాయని ఆర్‌బీఐ వెల్లడించింది. అంతక్రితం వారంలో నిల్వలు ఏకంగా 753 కోట్ల డాలర్ల వృద్ధితో సరికొత్త జీవితకాల రికార్డు స్థాయి 67,491.9 కోట్ల డాలర్లకు చేరుకున్నాయి.

ఎలక్ట్రానిక్స్ మార్ట్‌లో 7.8% వాటా విక్రయం

హైదరాబాద్‌కు చెందిన ఎలక్ట్రానిక్స్ మార్ట్ ఇండియా లిమిటెడ్ (ఈఎంఐఎల్, బజాజ్ ఎలక్ట్రానిక్స్) ప్రమోటర్లైన పవన్ కుమార్ బజాజ్, కరణ్ బజాజ్.. కంపెనీలో తమకు చెందిన 7.8% వాటాను ఓపెన్ మార్కెట్ ద్వారా రూ.689 కోట్లకు విక్రయించారు.పవన్ బజాజ్, కరణ్ బజాజ్ తమ వాటా నుంచి 1.50 కోట్ల షేర్ల చొప్పున విక్రయించగా.. ఎస్‌బీఐ ఎంఎఫ్ 3.92% వాటాకు సమానమైన 1.51 కోట్ల షేర్లను, నార్వే ఫండ్, ఫ్రాంక్లిన్ టెంపుల్టన్ ఎంఎఫ్ 99.41 లక్షల షేర్లను దక్కించుకున్నాయి. రూ.229.75-229.77 ధర శ్రేణిలో ఈ షేర్లు కొనుగోలు చేశాయి. ఈ లావాదేవీ అనంతరం కంపెనీలో ప్రమోటర్లు, ప్రమోటర్ గ్రూప్ సంస్థల వాటా 72.97 శాతం నుంచి 65.17 శాతానికి తగ్గింది.

జేఎస్‌డబ్ల్యూ సిమెంట్ రూ.4,000 కోట్ల ఐపీఓ

సజ్జన్ జిందాల్‌కు చెందిన జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ కంపెనీ జేఎస్‌డబ్ల్యూ సిమెంట్ పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కు రాబోతోంది. ఐపీఓ ద్వారా రూ.4,000 కోట్ల సమీకరణకు అనుమతి కోరుతూ సెబీకి శుక్రవారం ప్రాథమిక ముసాయిదా పత్రాలు (డీఆర్‌హెచ్‌పీ) సమర్పించింది. పబ్లిక్ ఆఫర్‌లో భాగంగా కంపెనీ రూ.2,000 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రస్తుత వాటాదారులకు చెందిన రూ.2,000 కోట్ల విలువైన షేర్లను అమ్మకానికి పెట్టనుంది.

● లాజిస్టిక్ సేవల కంపెనీ ఈ-కామ్ ఎక్స్‌ప్రెస్ లిమిటెడ్ సైతం ఐపీఓ ద్వారా రూ.2,600 కోట్ల వరకు సేకరించేందుకు అనుమతి కోరుతూ సెబీకి డీఆర్‌హెచ్‌పీ సమర్పించింది. ఐపీఓలో భాగంగా కంపెనీ రూ.1,284.50 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రస్తుత ప్రమోటర్లు, వాటాదారులకు చెంది రూ.1,315.50 కోట్ల విలువైన షేర్లను ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిన విక్రయించనుంది.

● స్మార్ట్‌వర్క్స్ కోవర్కింగ్ స్పేసెస్ లిమిటెడ్ కూడా సెబీ వద్ద డీఆర్‌హెచ్‌పీ దాఖలు చేసింది. ఐపీఓ ద్వారా రూ.550 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రమోటర్లకు చెందిన 67.59 లక్షల షేర్లను విక్రయించనున్నట్లు తెలిపింది.

● ఐటీ సొల్యూషన్స్ ప్రొవైడర్ ఓరియంట్ టెక్నాలజీస్ ఐపీఓ ఈ నెల 21న ప్రారంభమై 23న ముగియనుంది. ఐపీఓ ధరల శ్రేణిని కంపెనీ రూ.195-206గా నిర్ణయించింది. గరిష్ఠ ధర ప్రకారంగా కంపెనీ రూ.215 కోట్లు సమీకరించే అవకాశం ఉంది.

2024-25లో రూ.20,000 కోట్ల ఆర్డర్లు

ఎన్‌సీసీ లిమిటెడ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో మరిన్ని ఆర్డర్లు లభించే అవకాశం ఉందని హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే నిర్మాణ రంగ కంపెనీ ఎన్‌సీసీ లిమిటెడ్ భావిస్తోంది. ఇవి ఎంత లేదన్నా కనీసం రూ.20,000 కోట్ల వరకు ఉండే అవకాశం ఉందని కంపెనీ తన 2023-24 వార్షిక నివేదికలో పేర్కొంది. ఇందులో ఎక్కువ భాగం భవన నిర్మాణం, రవాణా, నీటిపారుదల, విద్యుత్ రంగాల నుంచి లభించే అవకాశం ఉందని భావిస్తోంది. ఈ ఏడాది మార్చి చివరి నాటికి కంపెనీ చేతిలో రూ.57,536 కోట్ల ఆర్డర్లు ఉన్నాయి. గత నెల కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రకటించిన కొత్త విమానాశ్రయాల నిర్మాణం, ఉడాన్ పథకం ఇందుకు కలిసివస్తాయని భావిస్తోంది. కాగా గత ఆర్థిక సంవత్సరానికి ఎన్‌సీసీ లిమిటెడ్ రూ.20,971 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ.711 కోట్ల నికర లాభం ఆర్జించింది. అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే ఆదాయం 34 శాతం పెరగడం కంపెనీకి బాగా కలిసొచ్చింది.

పీ2పీ రుణాలపై ఆర్‌బీఐ ఆంక్షలు

ముంబై: నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ (ఎన్‌బీఎఫ్‌సీ)ల పీర్ టు పీర్ (పీ2పీ) రుణాల ప్లాట్‌ఫామ్స్‌పై భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) కొరడా ఝుళిపించింది. ఈ సంస్థలు నిర్ణీత కాలపరిమితి, కనీస రాబడులకు హామీ, లిక్విడిటీ ఆప్షన్ల వంటి సదుపాయాలతో కూడిన ఎలాంటి పెట్టుబడి పథకాలను ప్రమోట్ చేయకూడదని ఆంక్షలు విధించింది. అలాగే రుణ పరిమితి పెంపు, పరపతి హామీల పేరుతో ఎలాంటి ఇన్సూరెన్స్ పథకాలనూ క్రాస్ సెల్ చేయకూడదని స్పష్టం చేసింది. పీ2పీ రుణదాతల డైరెక్టర్ల బోర్డు ఆమోదిత విధానాలకు అనుగుణంగా ఉంటేనే రుణ గ్రహీతకు రుణాలు పంపిణీ చేయాలని కోరింది. కొన్ని పీ2పీ ప్లాట్‌ఫామ్స్ రుణాలు మంజూరు చేసేటప్పుడు 2017లో జారీ చేసిన ఆదేశాలను అతిక్రమిస్తున్నందున ఈ సరికొత్త ఆదేశాలు జారీ చేసినట్టు ఆర్‌బీఐ తెలిపింది.

అరబిందో యూనిట్‌కు ఎఫ్‌డీఏ హెచ్చరిక లేఖ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): తెలంగాణలోని అరబిందో ఫార్మా అనుబంధ సంస్థ యూజియా ఫార్మా ఫార్ములేషన్ల ప్లాంట్‌కు అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ మండలి (యూఎస్ ఎఫ్‌డీఏ)హెచ్చరిక లేఖ జారీ చేసింది. పటాన్‌చెరు మండలం పాశమైలారంలో ఉన్న తమ యాజమాన్యంలోని యూజియా ఫార్మా స్పెషాలిటీస్ లిమిటెడ్ తయారీ ప్లాంట్‌లోని యూనిట్-3పై యూఎస్ ఎఫ్‌డీఏ అఫీషియల్ యాక్షన్ ఇండికేటెడ్ (ఓఏఐ) జారీ చేసిందని, దానికి అనుబంధంగా ఈ హెచ్చరిక లేఖ కూడా అందిందని నియంత్రణ సంస్థలకు పంపిన లేఖలో అరబిందో ఫార్మా తెలిపింది. ఆ లేఖ వివరాలేవీ ప్రకటించలేదు.

అయితే ఈ లేఖ ప్రభావం వల్ల ప్రస్తుత సరఫరాలకు ఎలాంటి అంతరాయం ఉండబోదని పేర్కొంది. ఎఫ్‌డీఏ నిబంధనలకు తాము కట్టుబడతామని, సన్నిహితంగా కలిసి పని చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని తెలిపింది. ఈ యూనిట్‌లో ఎఫ్‌డీఏ బృందం ఈ ఏడాది జనవరి 22 నుంచి ఫిబ్రవరి 2 వరకు తనిఖీలు నిర్వహించిందని, ఆ తర్వాతనే ఓఏఐ జారీ చేసిందని ఆ ప్రకటనలో అరబిందో ఫార్మా వెల్లడించింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	71,620 ▲	65,650 ▲	89,000 ▲
ముంబై	70,604 ▼	64,673 ▼	81,510 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



17వ తేదీ			
హైదరాబాద్	440	విజయవాడ	491
వరంగల్	442	గోదావరి	491
చిత్తూరు	493	విశాఖపట్నం	495
		డజను గుడ్లు రూ.	66

'రియల్టీ' పీఈ పెట్టుబడులు అదుర్స్

జనవరి-జూన్ మధ్య రూ.32,736 కోట్లు

న్యూఢిల్లీ: హైదరాబాద్‌తో సహా దేశంలోని ఆరు ప్రధాన నగరాల్లో స్థిరాస్తి (రియల్టీ) రంగం కళకళలాడుతోంది. ఈ ఏడాది జనవరి-జూన్ మధ్య కాలంలో ప్రైవేట్ ఈక్విటీ (పీఈ) సంస్థలు ఈ ఆరు ప్రధాన నగరాల్లోని కార్యాలయ, నివాస గృహ ప్రాజెక్టుల్లో 390 కోట్ల డాలర్ల (సుమారు రూ.32,736 కోట్లు) పెట్టుబడులు పెట్టాయి. గత ఏడాది (2023) మొత్తానికి చేసిన పెట్టుబడుల్లో ఇది 70 శాతానికి సమానమని రియల్టీ కన్సల్టెన్సీ సంస్థ 'కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్' ఒక నివేదికలో తెలిపింది. ఇందులో 63.33 కోట్ల డాలర్ల అత్యధిక పీఈ పెట్టుబడులను ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతం ఆకర్షించింది. ఈ ప్రాంతంలో కార్యాలయాల స్పేస్‌తో పాటు హై ఎండ్ లగ్జరీ ఇళ్లకూ మంచి డిమాండ్ ఉందని పేర్కొంది.

మూడో స్థానంలో హైదరాబాద్: ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతం తర్వాత 50.95 కోట్ల డాలర్ల పీఈ పెట్టుబడులతో ఐటీ సిటీ బెంగళూరు రెండో స్థానం ఆక్రమించింది. పీఈ పెట్టుబడులను ఆకర్షించడంలో బెంగళూరు తర్వాత హైదరాబాద్ మహానగరం మూడో స్థానంలో నిలిచింది. ఈ కాలంలో నగరంలోని కార్యాలయాలు, నివాస గృహాల ప్రాజెక్టులు 31.99 కోట్ల డాలర్ల (రూ.2,685 కోట్లు) పీఈ పెట్టుబడులు ఆకర్షించాయి. హైదరాబాద్ తర్వాత చెన్నై (23.47 కోట్ల డాలర్లు), పుణె (15.17 కోట్ల డాలర్లు), ముంబై (14.7 కోట్ల డాలర్లు) నగరాలు పీఈ పెట్టుబడులు ఆకర్షించడంలో ముందున్నాయని కుష్‌మన్ తెలిపింది.

తెలుగు రాష్ట్రాల్లో ఆగిన 32 ప్రాజెక్టులు: కాగా రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ వివిధ కారణాలతో ఆగిపోయిన గృహ నిర్మాణ ప్రాజెక్టుల సంఖ్య పెరిగిపోతోంది. హైదరాబాద్‌లో 6,169 ఇళ్లు లేదా ఫ్లాట్లకు సంబంధించిన 25 ప్రాజెక్టులు గత ఎనిమిదేళ్లుగా ముందుకు కదలడం లేదు. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలోనూ 2,403 ఇళ్లు, ఫ్లాట్లకు సంబంధించి ఆరు ప్రాజెక్టులది ఇదే పరిస్థితి. వైజాగ్‌లోనూ 28 నివాస గృహాలకు సంబంధించి ఒక ప్రాజెక్టు గత ఎనిమిదేళ్లుగా ముందుకు కదలడం లేదు.

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
శనివారం | 17-8-2024 | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | విజయవాడ సిటీ**

2 రాష్ట్రాల్లో ఎన్నికల నగారా


సీఈసీ రాజీవ్ కుమార్

జమ్ముకశ్మీర్, హరియాణా షెడ్యూలు విడుదల

జమ్ముకశ్మీర్‌కు సెప్టెంబరు 18 నుంచి 3 దశల్లో..

హరియాణాకు అక్టోబరు 1న.. 4న ఫలితాలు

మహారాష్ట్ర, ఝార్ఖండ్, ఢిల్లీకి తర్వాత?

బహుశా వారి బాస్ మహారాష్ట్ర ఎన్నికలకు ఇంకా అనుమతి ఇచ్చి ఉండకపోవచ్చు: ఆదిత్య ఠాక్రే

10



జాతీయ చలనచిత్ర అవార్డుల్లో

దుమ్మురేపిన సౌత్ సినిమా

ఉత్తమ చిత్రంగా మలయాళ సినిమా 'ఆట్టమ్'

కార్తికేయ-2కు ఉత్తమ ప్రాంతీయ చిత్రం అవార్డు



'కాంతార' హీరో రిషభ్‌శెట్టికి ఉత్తమ నటుడు పురస్కారం



నిత్యామేనన్, మానసి పరేఖ్.. సంయుక్తంగా ఉత్తమ నటి

'పొన్నియన్ సెల్వన్-1' చిత్రానికి 4 పురస్కారాలు

4

అందరూ ఎలా కొన్నారో నేనూ అలానే కొన్నా!

అగ్రిగోల్డ్ భూములపై నిజం ఒప్పుకొన్న జోగి



ముందు తెలియదని.. తర్వాత కొన్నామని స్పష్టీకరణ

పేపర్ ప్రకటన ఇచ్చి మరీ కొనుక్కున్నట్టు వెల్లడి

ఇంకా ఎంత మంది అక్రమంగా కొన్నారో?

11

టీడీపీ అధినేత బాబు ఇంటిపై దాడి కేసులో మంగళగిరి రూరల్ పోలీసుల ముందు హాజరు

మధుసూదన రెడ్డిపై సస్పెన్షన్ వేటు

ఇప్పటికే ఫైబర్‌నెట్ ఎండీగా తొలగింపు



జగన్ అండతో నాడు ఫైబర్‌నెట్‌లో ఇష్టారాజ్యం

వైసీపీ కార్యకర్తలకు భారీగా కొలువులు

10

పెట్టుబడుల సాధనకు.. ప్రత్యేక టాస్క్‌ఫోర్స్!

చైర్మన్‌గా చంద్రబాబు, కో-చైర్మన్‌గా టాటా గ్రూప్ అధినేత చంద్రశేఖరన్

దేశ ప్రముఖ పారిశ్రామికవేత్తలకూ చోటు

ఆయా రంగాల నిపుణులకు కూడా..

అమరావతిలో 'సెంటర్ ఫర్ గ్లోబల్ లీడర్‌షిప్'

విశాఖలో టీసీఎస్ డెవలప్‌మెంట్ సెంటర్

రాష్ట్రంలో ఎయిర్ ఇండియా, విస్తారా విస్తరణ

సోలార్, టెలికాం, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు

టాటా చంద్రశేఖరన్‌తో సీఎం చర్చలు

సెప్టెంబరు 17న లేలాండ్ పునఃప్రారంభం

అమరావతిలో లా యూనివర్సిటీ

ఇందులోనే అంతర్జాతీయ ఆర్బిట్రేషన్ సెంటర్!

11



సీఎం చంద్రబాబును కలిసిన టాటా గ్రూప్ చైర్మన్ చంద్రశేఖరన్

పోలవరానికి త్వరగా నిధులివ్వండి

19

ఆలస్యమైతే మరో సీజన్ కోల్పోతాం.. ఢిల్లీలో జలశక్తి మంత్రికి చంద్రబాబు వినతి

క్యాంటీన్ల కోలాహలం

పేదలు, కూలీలు, కార్మికుల కళ్లలో తిరిగొచ్చిన తృప్తి

11

99 అన్న క్యాంటీన్లు ప్రారంభం


స్టాప్‌లాగ్ ఎలిమెంట్‌ను గ్రూవ్‌లోపెట్టి కిందికి దించుతున్న దృశ్యం

'తొలి' అడుగు సక్సెస్!

విజయవంతంగా స్టాప్‌లాగ్ బ్లాక్ అమరిక

ఫలించిన ఇంజనీర్ల భగీరథ ప్రయత్నం

వరద ఒత్తిడిని తట్టుకుని సాగిన ప్రయాణం

కీలక విజయంతో ప్రాజెక్టు వద్ద సంబరాలు

నేడు మిగిలిన బ్లాక్‌లు అమర్చే అవకాశం

12

'ఆటవిక' రాతలు

ఐఏఎస్, ఐపీఎస్‌లకు అవమానమట!

రెండు నెలలుగా పోస్టింగ్ ఇవ్వలేదంటూ ఏడుపు

ఐదేళ్లలో జగన్ చేసిన నిర్వాకం ఏమిటి?

చెప్పింది వినకుంటే శంకరగిరి మాన్యాలే

'అన్నా' అంటూ సీఎస్‌గా ఉన్న ఎల్వీని ఏం చేశారు?

15 మంది ఐఏఎస్, ఐపీఎస్‌లు నెలలపాటు వెయిటింగ్

సీనియర్ ఐపీఎస్ ఏబీవీపై ఐదేళ్లూ కక్ష సాధింపే

సాయిప్రసాద్‌కు 8 నెలలు నో పోస్టింగ్

8

జగన్ సేవలో తరించిన పలువురు అధికారులు

వారిపై కూటమి సర్కారు ఆచితూచి నిర్ణయం

ఈలోపే జగన్ రోత పత్రిక పెడబొబ్బలు

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఎన్నికల పోరు!

జమ్మూకశ్మీర్, హర్యానా అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం శుక్రవారం ప్రకటించింది. ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్మూకశ్మీర్‌లో తొలిసారిగా అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్నాయి. మొత్తం 90స్థానాలకు మూడుదశల్లో పోలింగ్ జరిగి అక్టోబర్ 4న ఫలితాలు వెలువడతాయి. హర్యానాలోనూ 90స్థానాలే కానీ, అక్కడ ఒకదశలోనే, అంటే జమ్మూకశ్మీర్ ఆఖరుదశ పోలింగ్ అక్టోబర్ ఒకటి నాడు ఈ రాష్ట్రంలో అన్నిస్థానాలకు పోలింగ్ జరుగుతుంది. ఈ ఏడాది నవంబరులో మహారాష్ట్ర, హర్యానా, వచ్చే ఏడాది జనవరిలో జార్ఖండ్ అసెంబ్లీల గడువు ముగుస్తుంది. మహారాష్ట్ర, హర్యాణా అసెంబ్లీ ఎన్నికలను ఒకేమారు కలిపి నిర్వహించే సంప్రదాయాన్ని ఈ మారు ఎందుకు కాదనుకున్నారన్న ప్రశ్నకు జమ్మూకశ్మీర్‌ను కారణంగా చూపించారు సీఈసీ రాజీవ్‌కుమార్. అక్కడ భారీస్థాయిలో బలగాలను మోహరించాల్సిన అవసరం ఉన్నందున మహారాష్ట్రను పక్కనబెట్టారట. దీనికితోడు మహారాష్ట్రలో వినాయకచవితి, నవరాత్రి, దీపావళి వంటి పండుగలున్నాయని, వర్షాలు అడ్డుపడి ఓటర్ జాబితాను అప్‌డేట్ చేయడం పూర్తికాలేదని చెప్పుకొచ్చారు. మరి, జార్ఖండ్‌ను కూడా ఎందుకు వదిలేశారో తెలియదు. ఈ రెండింటినీ ఢిల్లీతో కలిపి జరుపుతారట.

జమ్మూకశ్మీర్ ప్రత్యేకప్రతిపత్తిని ఎత్తివేసి, రాష్ట్రంగా ఉన్నదాన్ని కేంద్రపాలితంగా మార్చేసిన నిర్ణయాన్ని సుప్రీంకోర్టు తప్పుబట్టకుండా, ఎన్నికలు మాత్రం ఈ ఏడాది సెప్టెంబరు ముప్పైలోగా ఎన్నికలు జరగాలంటూ ఆదేశించిన విషయం తెలిసిందే. ఇటీవలే సీఈసీ సారథ్యంలో ఎన్నికల కమిషనర్లు అక్కడ పర్యటించి క్షేత్రస్థాయి పరిస్థితులను తెలుసుకున్నారు. అన్ని పార్టీలూ ఎన్నికలు కోరుతున్నాయని, ఓటర్లు కూడా అదేమాట అంటున్నారని వారు చెప్పుకొచ్చారు. అక్కడి పార్టీలు, ప్రజలు ఎంతోకాలంగా ఎన్నికలు డిమాండ్ చేస్తున్న విషయం వీరికి తెలియనిదేమీ కాదు. 2014లో రాష్ట్రంగా ఉన్నప్పుడు జరిగిన చివరి ఎన్నికల్లో ముఫ్తీమహ్మద్ సయీద్ నాయకత్వంలోని పీపుల్స్ డెమోక్రసీ పార్టీ (పీడీపీ) అతిపెద్దపార్టీగా అవతరించింది, బీజేపీ-పీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడింది. ఆయన మరణానంతరం 2016లో కుమార్తె మహబూబా ముఫ్తీ సీఎం అయ్యారు. 2018లో ప్రభుత్వం కూలిపోయి, గవర్నర్ పాలన మొదలైంది. మరుసటి ఏడాది ఆగస్టులో కేంద్రప్రభుత్వం 370 ప్రయోగించింది, ఆ ప్రాంతాన్ని రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా మార్చింది. ఎన్నికల సంఘం ప్రకటనకు ఒకరోజుముందే లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా 200మంది అధికారులను ఎడాపెడా మార్చేయడం విశేషం. దీనిపై ఒమర్ అబ్దుల్లా అభ్యంతరాన్ని ఎన్నికల సంఘం తేలికగా కొట్టివేసింది. జమ్మూకశ్మీర్ విషయంలో కేంద్రం తీసుకున్న ప్రతీచర్యకు ఈ ఎన్నికల్లో ప్రజలు సమాధానం చెబుతారు. ప్రత్యేకప్రతిపత్తి రద్దుకు పాలకులు చెప్పిన కారణాలను, పెట్టిన ఆశలను తూకం వేస్తారు. కశ్మీర్‌నుంచి జమ్మూకు ఉగ్రవాదం విస్తరించిన నేపథ్యంలో అక్కడ సైతం గతంలో ఉన్నంత ఉత్సాహం లేదన్న విశ్లేషణలు బీజేపీకి ఇబ్బందికరమైనవే.

90 స్థానాలున్న హర్యానాలో ఈ మారు కాంగ్రెస్‌ది పైచేయి అవుతుందని విశ్లేషణలు వెలువడుతున్నాయి. 2019లో మెజారిటీ లేకున్నా దుష్యంత్ చౌతాలాతో పొత్తుపెట్టుకొని ముఖ్యమంత్రిగా ఖట్టర్ కొనసాగగలిగారు. కానీ ఇటీవలి లోక్‌సభ ఎన్నికలకు నెలరోజుల ముందు ఆ కూటమి కూలింది, ఖట్టర్ స్థానంలోకి నయాబ్‌సింగ్ సైనీ వచ్చారు. లోక్‌సభ ఎన్నికల్లో సగం స్థానాలు గెలుచుకున్న కాంగ్రెస్ పట్ల ప్రజాదరణ పెరిగిందని సర్వేలు కూడా అంటున్నాయి. నిరుద్యోగం, అగ్నివీర్, రైతు ఉద్యమాలు, మహిళా మల్లయోధుల అంశం ఓటర్లను ప్రభావితం చేస్తాయి. యూపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్‌ను కాపాడుకురావడంకోసం బీజేపీ పెద్దలు మహిళారెజ్లర్లతో అన్యాయంగా వ్యవహరించారన్న ఆగ్రహం ఖాప్ పంచాయితీల్లో ఉంది. ఆ ఉద్యమానికి సారథ్యం వహించిన వినేశ్ ఫోగట్‌మీద ఒలింపిక్స్‌లో అనర్హత వేటుపడటమూ ఓటర్ల మీద పనిచేయవచ్చు. దళిత్, ఓబీసీ ఓట్లతో పాటు జాట్ల ఓట్లు కూడా చీలి కాంగ్రెస్ బాగా లాభపడవచ్చునంటున్నారు. జమ్మూకశ్మీర్, హర్యానా ఎన్నికల్లో స్థానికాంశాలే ప్రధానంగా పనిచేసినప్పటికీ, ఫలితాల ప్రభావం దేశస్థాయిలో ఉంటుంది. ఈ మారు లోక్‌సభలో బలం తగ్గిన బీజేపీ మీద, బలపడిన ఇండియా కూటమి మీదా ఈ ఫలితాలు ప్రభావం చూపుతాయి.

ఆరోగ్యాంధ్రకు దార్శనిక ప్రణాళిక ఏదీ?

విభజనతో విద్య, వైద్య రంగాల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి జరిగిన నష్టం పదేళ్లయినా పూడనేలేదు. మెరుగైన వైద్యం కోసం పొరుగు రాష్ట్రాలకు పరుగులు తీస్తూనే ఉన్నాం. ఏపీలో వైద్య, ఆరోగ్య రంగాల్లో సమూల మార్పులు తీసుకురావడం లోనూ, ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేసుకోవడంలోనూ ఇంకా మందగమనం సాగుతూనే ఉంది. రాష్ట్రానికి ప్రత్యేక మెడికల్ విజన్ రూపొందించుకుంటే తప్ప ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధ్యం కాదు. కొత్త ప్రభుత్వం వివిధ రంగాల్లో కుంటుపడిన అభివృద్ధిని గుర్తిస్తూ, చేయాల్సిన పనులనూ, ప్రాధాన్యాలనూ నిర్దేశించుకుంటూ సమీక్షలు చేస్తున్న తీరు చూశాక ఆశ చిగురిస్తోంది.


హైదరాబాద్‌లోని నిమ్స్ తరహా రెఫరల్ ఆసుపత్రి ఆంధ్రప్రదేశ్‌లో లేదు. ప్రభుత్వ, ఆర్టీసీ, రైల్వేలు, ఇతర ప్రభుత్వరంగ సంస్థల ఉద్యోగుల కుటుంబాలకు సూపర్‌స్పెషాలిటీ వైద్యం అందించే ప్రభుత్వ వైద్యశాల లేని లోటు ఏపీకి వెలితిగానే మిగిలిపోయింది. తిరుపతిలోని స్విమ్స్‌కి ఉన్నా దానిని తిరుమల తిరుపతి దేవస్థానానికి అప్పగించేశారు. ఇదో చారిత్రక తప్పిదం. ఇక హైదరాబాద్‌లో ఉన్న అంటువ్యాధులకు ప్రత్యేక చికిత్స అందించే ఫీవర్ ఆసుపత్రి వంటిది మన రాష్ట్రంలో ఇప్పటికీ ఏర్పడలేదు.

రాష్ట్రంలో 60 నుంచి నూరేళ్ల చరిత్ర కలిగిన ప్రభుత్వ వైద్య కళాశాలలు ఉన్నాయి. విశాఖలోని ఆంధ్ర మెడికల్ కాలేజీ, కర్నూలు, గుంటూరు, తిరుపతిల్లోని ప్రభుత్వ కాలేజీలు ఘనమైనవి. వీటిని అభివృద్ధి చేయవలసినంతగా చేయలేదు. ఇప్పటికీ ఈ సంస్థల్లో సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు పూర్తిస్థాయిలో అందుబాటులో లేవు. అందుకు తగిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఈ కాలేజీల అనుబంధ ఆసుపత్రులకు అందించాలి. అవయవ మార్పిడి కేంద్రాలుగా ఈ చారిత్రక వైద్య సంస్థలను అభివృద్ధిపరచవచ్చు. అదేవిధంగా ప్రత్యేక ప్రాంతీయ రెఫరల్ వైద్య సంస్థలను ఏర్పాటు చేయాలి. ఉదాహరణకు హెమటాలజీ, అంటువ్యాధులు, ఇమ్యునాలజీ, జెనిటిక్స్ ఫ్యామిలీ మెడిసిన్‌ల వంటి వాటికి వేర్వేరు రెఫరల్ ఆసుపత్రులను భిన్న ప్రాంతాల్లో అభివృద్ధిపరచవచ్చు.

రాజకీయ ప్రముఖులూ, ఉన్నతాధికారులూ అనారోగ్యానికి గురైనపుడు హైదరాబాద్‌కో, బెంగళూరుకో, చెన్నైకో పరుగులు తీస్తున్నారు. వైద్య పరీక్షలకు కూడా ముఖ్యమంత్రులూ, మంత్రులూ, మాజీలు సహా అనేకమంది విదేశాలకు వెళ్లివస్తున్నారు. ఇటువంటి పరిస్థితి ఎందుకు ఉందో చిత్తశుద్ధితో సమీక్షించుకోవాలి. ప్రయివేటు రంగంలో వైద్య సంస్థల అభివృద్ధి వేగంగా ఉంది. భారీ పెట్టుబడులు వైద్యరంగంలో పోగవుతున్నాయి. అత్యాధునిక వైద్య పరికరాలూ, వైద్య నిపుణులూ ఉన్న కార్పొరేట్ ఆసుపత్రుల్లో అందే సేవలు ఖరీదైనవి. సమాజంలో అధికశాతం ఉన్న పేద, మధ్యతరగతికి ఇటువంటి వైద్యసేవలు లభించకపోవడం అసమానతను పెంచడమే. ఆరోగ్యశ్రీ అన్నది మాత్రమే ఇందుకు పరిష్కారం ఎంతమాత్రం కాదు. పేద ప్రజలను సంతృప్తి పరచడానికి తప్ప, వారికి నాణ్యమైన వైద్యం అందించడానికి ఆరోగ్యశ్రీ ఉపయోగపడడం లేదు. ఇందుకు సిసలైన పరిష్కారం– ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయడమే.

పేద, మధ్యతరగతి ప్రజలు జబ్బుపడ్డ వెంటనే వెళ్లేది– ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, ఏరియా ఆసుపత్రులు, జిల్లా కేంద్రాల్లోని ప్రభుత్వ ఆసుపత్రులకే. సిబ్బంది కొరతతో, మందుల కొరతతో ఇవి కునారిల్లుతున్నాయి. ఈ ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రతి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో నలుగురైదుగురు ఎంబీబీఎస్ డాక్టర్లను శాశ్వత ప్రాతిపదికన నియమించాలి. ల్యాబ్ టెక్నీషియన్, న్యూట్రిషనిస్ట్, సైకాలజిస్ట్, తగినంతమంది నర్సింగ్ సిబ్బంది తప్పనిసరిగా ఉండేలా చూడాలి. సూపర్ స్పెషాలిటీ చేసిన వైద్యులకు జీతభత్యాలను సంతృప్తికరంగా పెంచితే, సంపన్నులు కార్పొరేట్ ఆసుపత్రుల్లో అందుకునే గ్యాస్ట్రో, కార్డియాలజీ, న్యూరాలజీ, నెఫ్రాలజీ, ఆంకాలజీ వంటి వైద్యసేవలు పేదలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే అందుతాయి. బోధన, తృతీయస్థాయి రెఫరల్ ఆసుపత్రులతో టెలీమెడిసిన్ యూనిట్ల ద్వారా పీహెచ్‌సీలను అనుసంధానం చేయాలి. అన్ని సదుపాయాలున్న అంబులెన్స్ ప్రతి పీహెచ్‌సీకీ ప్రత్యేకంగా ఉండాలి. ప్రభుత్వ ఆసుపత్రులలో పరిపాలన ప్రక్షాళన కూడా జరగాలి. పరిపాలనా అనుభవం ఉన్నవారినే మెడికల్ సూపరింటెండెంట్‌లుగా నియమించాలి. పారా మెడికల్ వ్యవస్థను పటిష్టపరిచి విస్తరించాలి. టెన్త్, ఇంటర్ తర్వాత నర్సింగ్, ల్యాబ్ టెక్నీషియన్, కార్డియాక్ టెక్నీషియన్, డయాలసిస్ టెక్నీషియన్ వంటి కోర్సుల్లో చేరేలా యువతను ప్రోత్సహిస్తే వైద్యరంగంలోనూ మన రాష్ట్రంలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఎక్కువగా వారికి లభిస్తాయి.

వైద్య విద్య మీద ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. ప్రయివేటు వైద్య కళాశాలలు పెరగడం, సీట్లు పెరగడం మంచిదే కానీ, ఆ కళాశాలల్లో నాణ్యమైన విద్య అందుతోందా అనే పర్యవేక్షణ కొరవడింది. ఈ కళాశాలల అనుబంధ ఆసుపత్రులకు ప్రజలు పెద్దగా వెళ్లరు. అందుకు తగిన వైద్య సిబ్బంది, మౌలిక సదుపాయాలను వీరు ఏర్పాటు చేసుకోరు. దీంతో వైద్య విద్యార్థులకు అనుభవపూర్వకమైన విద్య అందడం లేదు. వైద్య విద్యార్థులు నైపుణ్యం పెంచుకోవడానికి స్కిల్ ల్యాబ్స్, సిమ్యులేషన్ సెంటర్లు ఏర్పాటు చేయాలి. ఇంజనీరింగ్ కాలేజీలు, ఐఐటీలతో వైద్యకళాశాలు అనుసంధానం కావాలి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సాఫ్ట్‌వేర్ శిక్షణ వంటివి వైద్యవిద్యలో నాణ్యతనూ, నైపుణ్యాన్నీ పెంచుతాయి. సంయుక్త పరిశోధనలు అద్భుతమైన ఫలితాలను ఇస్తాయి. ఎన్.ఎస్.ఎస్, రెడ్‌క్రాస్, ఇతర స్వచ్ఛంద సంస్థల్లో పనిచేయడం వైద్య విద్యార్థులకు తప్పనిసరి చేయాలి. ఇందువల్ల రోగాల గురించే కాక, రోగాలకు దారితీస్తున్న సామాజిక పరిస్థితుల మీద కూడా డాక్టర్లయ్యేవారికి అవగాహన కలుగుతుంది. ఇక ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు బస్సులు ఏర్పాటు చేసి, విద్యార్థులను క్షేత్రస్థాయి పర్యటనలకు పంపాలి. వైద్యశిబిరాలు నిర్వహించాలి. మెరుగైన వైద్యం, ఆపరేషన్లు అవసరం అని వీరు గుర్తించిన రోగులను ప్రభుత్వ ఆసుపత్రులకు తక్షణమే తీసుకువచ్చే ఏర్పాటు చేయాలి. నాణ్యమైన, నమ్మకమైన వైద్యం లభిస్తుంటే ప్రయివేటు వైద్యం కోసం పరుగులుతీసి అప్పుల ఊబిలో కూరుకుపోయే అవసరం పేదలకు తప్పుతుంది.



వైద్య, ఆరోగ్య రంగాలకు తగినంత బడ్జెట్‌ను కేటాయించడంతోపాటూ ప్రభుత్వం విధానపరమైన కొన్ని నిర్ణయాలను కూడా తీసుకోవాలి. జిల్లా కలెక్టర్ మొదలు ప్రభుత్వ ఉద్యోగులందరూ వైద్యం కోసం ప్రభుత్వ ఆసుపత్రులకే వెళ్లాలి. మెడికల్ రీయింబర్స్‌మెంట్ సదుపాయం కార్పొరేట్ ఆసుపత్రులకు తగ్గించాలి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో డబ్బు ఖర్చుపెట్టుకోగలిగిన వారికోసం ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేయవచ్చు. నిపుణులైన సూపర్ స్పెషాలిటీ వైద్యులు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉంటే సంపన్న వర్గాలు కూడా ప్రయివేటు వైపు వెళ్లడం తగ్గిపోతుంది. అలాగే ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు నాణ్యమైన పోషకాహారం అందేలా చూడాలి. ఆపరేషన్ చేసుకున్న వారికీ, డయాలసిస్ రోగులకూ, కేన్సర్ వంటి వ్యాధులున్నవారికీ ఐసీడీఎస్ ద్వారా గర్భిణీలకు ఇచ్చినట్టే ప్రత్యేక ఆహారం ఇళ్లవద్దకే అందే ఏర్పాటు జరగాలి.

ఆర్థికలోటుతో సతమతం అవుతున్న ఆంధ్రప్రదేశ్‌లో వైద్య రంగానికి బడ్జెట్‌ను భారీగా పెంచడం సాధ్యమేనా అన్న ప్రశ్న ఉత్పన్నం కావచ్చు. నిధులు పోగేసుకోవడానికి ప్రత్యామ్నాయ మానవీయ మార్గాలను ఎంచుకోవచ్చు. టీటీడీ ప్రాణదాన పథకం ఇందుకు ఒక అనుసరణీయ ఉదాహరణ. పేదల ఆపరేషన్ల కోసం టీటీడీ భక్తులకు ఇచ్చిన పిలుపునకు స్పందనగా ఈ పథకానికి 357 కోట్లు పోగైంది. అలాగే కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద పెద్ద వ్యాపార సంస్థలను ప్రోత్సహించి ప్రభుత్వ ఆసుపత్రులను దత్తత ఇచ్చే అంశమూ పరిశీలించవచ్చు. నిధుల సేకరణలో, వినియోగంలో పారదర్శకత పాటించగలిగితే స్పందించే దాతలకు కొదవ ఉండదు. ఈ సులువు తెలిసిన రాజకీయదక్షుడు ముఖ్యమంత్రిగా ఉన్నందున బడ్జెట్ అన్నది ప్రధాన సమస్య కాబోదు. వైద్య ఆరోగ్యశాఖ, పంచాయతీరాజ్, నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమం, యువజన శాఖలతో కలిసి ఏపీ మెడికల్ విజన్‌కి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి. కూటమి నాయకులందరూ ఈ అంశంపై దృష్టి పెట్టి, సమష్టి కృషి చేస్తే 2047 వికసిత భారత్, వికసిత ఆంధ్రప్రదేశ్ విజన్‌లు సుసాధ్యం అవుతాయి. ఈ దిశగా గట్టి ప్రయత్నం మొదలవుతుందని ఏపీ ప్రజలు ఆశపడుతున్నారు.

■ డాక్టర్ పెన్నా కృష్ణప్రశాంతి
కేంద్ర ప్రభుత్వ సంస్థ బైరాక్ ఇండిపెండెంట్ డైరెక్టర్

సచివాలయాలను సంస్కరించాలి

ఆనాటి ప్రభుత్వం 2002లో గ్రామపంచాయతీలను పటిష్టం చేసి వాటి బాధ్యతలను పెంచి ప్రజలకు మరింత సేవలు అందించాలని రెవెన్యూ కార్యకలాపాలను కూడా పంచాయతీలకు అనుసంధానం చేస్తూ చర్యలు తీసుకున్నది. ఈ వ్యవస్థ గాడిలో పడుతున్న సందర్భంలో తర్వాత వచ్చిన ప్రభుత్వం 2007లో తిరిగి రెవెన్యూ కలాపాలను పంచాయతీల నుండి విడదీసి రెవెన్యూ శాఖకు అప్పగించింది. దీని వలన పంచాయతీ పాలనలో అస్తవ్యస్తమైంది. తదుపరి 2019లో గత ప్రభుత్వం 73వ రాజ్యాంగ సవరణ ద్వారా పంచాయతీరాజ్ చట్టం ప్రకారం 13,371 గ్రామ పంచాయితీలకు పరిపూర్ణత కల్పిస్తామని పంచాయతీల ఆధీనంలో 11,162 గ్రామ సచివాలయాలను 1,22,782 అదనపు సిబ్బందితో ఏర్పాటు చేసింది. ఈ సచివాలయాలు గ్రామ పంచాయతీలకు సహకారంగా సేవలు అందిస్తాయని ప్రభుత్వ జీవో నెంబరు.110 తేదీ 10.7.2019 ద్వారా తెలియపరచింది. కానీ పంచాయతీ కార్యదర్శి విధులకు సంబంధించిన ఉత్తర్వుల నెంబర్ 2, తేదీ 25.1.2023 ద్వారా పంచాయతీ కార్యదర్శిని గ్రామ సచివాలయాలకూ, ఇతర సంస్థలకూ అనుసంధాన కర్తగా మార్చడం జరిగింది. అంతేకాక రాష్ట్రస్థాయిలో పంచాయతీరాజ్ శాఖ నుంచి గ్రామ సచివాలయ నిర్వహణ వ్యవస్థను విడదీసి నూతనంగా గ్రామ సచివాలయ శాఖను ఏర్పాటు చేసి వాటి ద్వారా గ్రామ సచివాలయాల నిర్వహణ జరుగుతోంది. దీనివలన గ్రామ పంచాయతీలకు సచివాలయాలపై నియంత్రణ పోయింది. అంతేకాక ప్రభుత్వంలో ప్రతి 50 ఇళ్లకు ప్రభుత్వ సేవలు అందించేందుకు ఒక వాలంటీర్‌ను నియమించింది. కానీ వారి సేవలను గ్రామ సచివాలయ శాఖ ద్వారా పంచాయతీ పలు ప్రభుత్వ కార్యక్రమాలకు నేరుగా వినియోగించడం జరిగింది. ఈ వాలంటరీ వ్యవస్థ వలన గ్రామ పంచాయతీలకు లబ్ధిదారుల ఎంపికలో ప్రాధాన్యత లేకుండా పోయింది. దీనివల్ల పంచాయతీల మనగడే ప్రశ్నార్థకమైంది. అంతేకాక ఈ వాలంటీర్లు ప్రభుత్వాధికారుల కంటే రాజకీయ నాయకుల మౌఖిక ఆదేశాలతో విధులు నిర్వహిస్తున్నారు. దీనివల్ల రికార్డు నిర్వహణ, జవాబుదారీతనం లేకుండా పోయింది. అంతేగాక గ్రామపంచాయతీల ఉనికి లేకుండా పోయింది. దీనివల్ల ప్రజల చేత ఎన్నుకొనబడిన 13371 గ్రామపంచాయతీ సర్పంచులు, 1,34,057 వార్డు సభ్యులకు విలువ లేకుండా పోయింది.



ఈ క్రమంలో పంచాయతీలు పలు విధాలుగా బలహీనపడ్డాయి. ముఖ్యంగా గ్రామ సచివాలయ నిర్వహణ ఖర్చు కోసం గ్రామ పంచాయతీ నిధులను వాడటం, సచివాలయం, వాలంటీర్ల జీతభత్యాలు చెల్లింపు విషయాలకే గ్రామ పంచాయతీల పరిధి కృంగిపోవడం జరిగింది. అంతేగాక కేంద్ర ప్రభుత్వం నుంచి బ్యాంకుల ద్వారా రావాల్సిన నిధులు పంచాయతీలకు జమ కాకుండా ఇతరత్రా బదలాయింపు జరిగింది. వీటివల్ల గ్రామపంచాయతీలలో పారిశుధ్య నిర్వహణకు నిధులు లేక తీవ్ర ఆటంకం ఏర్పడింది. ఈ చర్యల వలన గ్రామపంచాయతీల ఆర్థిక పరిస్థితి కుదేలైంది. ప్రజలచే ఎన్నుకొనబడిన గ్రామపంచాయతీ సర్పంచులు, వార్డు మెంబర్లకు గ్రామ ప్రజలలో విలువ లేకుండా పోయింది.

కాబట్టి నేడు పంచాయతీ వ్యవస్థను 1994 ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం ప్రకారం బలోపేతం చేయాలి. అందుకుగాను చట్టంలో నిర్దేశించిన విధంగా 29 అంశాలకు సంబంధించిన నిధులు, విధులు, సిబ్బంది బదలాయింపు చేసి పటిష్టపరచాలి. అంతేగాక కేంద్ర ప్రభుత్వ నిధులు ముఖ్యంగా 15వ ఆర్థిక సంఘం నిధులు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు వెంటనే పంచాయతీలకు జమ అయ్యేట్లు చర్యలు తీసుకోవాలి. పంచాయతీకి సంబంధించిన నిధులు జమ, ఖర్చు వివరాలను ఆన్‌లైన్ ద్వారా జరిగేటట్లు తక్షణ చర్యలు తీసుకోవాలి. గ్రామ పంచాయతీ పరిధిలోకి గ్రామ సచివాలయం, వాలంటరీ వ్యవస్థను తీసుకురావాలి. వాలంటీర్ల పేర్లు గ్రామ సేవక్‌లుగా మార్చాలి. ఇప్పుడున్న గ్రామ సచివాలయాల పేర్లను గ్రామపంచాయతీ సేవా కేంద్రాలుగా మార్పు చేయాలి. వాటి పర్యవేక్షణ జవాబుదారితనం పంచాయతీ కార్యదర్శికి అప్పగించాలి. నేడున్న ఆరు గ్రేడ్ల పంచాయతీ కార్యదర్శి వ్యవస్థను మూడింటిగా కుదించాలి. సదర్ 3వ గ్రేడ్ జిల్లా క్యాడర్‌లో వారు కాబట్టి మూడు నుంచి ఆరో గ్రేడ్ దాకా ఉన్న పంచాయతీ కార్యదర్శులను మూడో గ్రేడుగా పరిగణించి, పంచాయతీ కార్యదర్శిగా నియామక ప్రక్రియను, విధి నిర్వహణ ప్రారంభించిన తేదీ నుండి నిబంధనలకు అనుగుణంగా సీనియారిటీని నిర్ణయించాలి. గ్రామ సచివాలయ వ్యవస్థ రాకముందే పంచాయతీలో పనిచేస్తున్న సిబ్బంది అందరి సేవలను క్రమబద్ధీకరించాలి.

• టి.ఎం.బి. బుచ్చిరాజు
ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ వెల్ఫేర్ ట్రస్ట్ ఛైర్మన్

కోటా తీర్పును తక్షణమే సమీక్షించాలి

భారత స్వాతంత్రోద్యమానికి సమాంతరంగా డాక్టర్ అంబేడ్కర్ నిర్వహించిన సామాజికోద్యమ ఫలితంగా వచ్చిన ఎస్సీ రిజర్వేషన్లు ఇప్పుడు అంతర్గత వివాదంలో చిక్కుకున్నాయి. రాజ్యాంగ మౌలికస్వరూపాన్ని మార్చకూడదన్న 1973 కేశవానంద భారతి కేసు తీర్పులో రాజ్యసంక్షేమం కూడా ఒక ప్రధాన అంశం. ఈ సందర్భంలో వర్గీకరణ పేరిట ఏబీసీడీ అనే అడ్డకోతకు, క్రీమీ లేయర్ అనే నిలువుకోతకు గురి చేస్తూ సర్వోన్నత న్యాయస్థానం తీర్పు ఇవ్వడాన్ని వీరంతా నిరసిస్తున్నారు. చరిత్రాత్మక రిజర్వేషన్లను సంక్షేమ పథకాల్లా పరిగణించడం రాజ్యాంగ స్ఫూర్తిని అవమానించడమేనని అంబేద్కరీయవాదులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దేశ విదేశాల్లో ఏ భారతీయుడు సాధించనన్ని డిగ్రీలు సాధించిన అంబేద్కర్‌ని ఆయన మరణం వరకు అంటరానితనం వెంటాడిన సంగతిని గుర్తు చేస్తున్నారు. రాజ్యాంగ రచనాసంఘం అధ్యక్షుడైన అంబేద్కర్‌ని ఇప్పటికీ జాతినేతగా కాకుండా దళిత నేతగా వివక్ష చూపడాన్ని ఖండిస్తున్నారు. జాతీయ కాంగ్రెస్ రాజకీయాల నుంచి ఉపప్రధానిగా ఎదిగిన బాబూజగజీవన్‌రామ్ కూడా కులవివక్ష ఎదుర్కొన్న విషయాన్ని ఆయన కుమార్తె, మాజీ లోక్‌సభ స్పీకర్ మీరాకుమార్ బహిరంగంగా అనేక సమావేశాల్లో ప్రకటించారు.



ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు ఎన్నికల ముందుగానే ఎన్డీఏ మద్దతు ప్రకటించింది. అధికారం చేజిక్కిన రెండు నెలల్లోనే ఈ తీర్పు వెలువడటం రిజర్వేషన్ల స్ఫూర్తిని రాజకీయంగా మంటగలపడమేననే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రిజర్వేషన్ల మీద నిర్ణయం తీసుకునే హక్కు ఒక్క భారత పార్లమెంటుకే వుందని గతంలో సర్వోన్నత న్యాయస్థానం వెలువరించిన తీర్పును గుర్తు చేసుకుంటున్నారు. అధికారంలో వున్న రాజకీయపార్టీల ఎజెండాలకు అనుగుణంగా తీర్పులు వెలువడటాన్ని నిరసిస్తున్నారు. సుప్రీంకోర్టు తీర్పు కేవలం వర్గీకరణ చేయడానికి రాష్ట్రాలకు అధికారాన్ని ఇచ్చిన సంగతిని మరచి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే ఆర్డినెన్స్ తీసుకొస్తామని, ఇప్పటివరకు వచ్చిన ఉద్యోగప్రకటనల్లో కూడా అమలు చేస్తామని అసెంబ్లీలోనే ఆడంబరంగా ప్రకటించారు. ఇంకా జరగాల్సిన రాజ్యాంగ ప్రక్రియ చాలానే వుంది. అయినా కాంగ్రెస్ ముఖ్యమంత్రి కంగారు పడటం తెలంగాణ మాదిగేతర అంబేద్కరీయ సంఘాలు ఖండించాయి. వర్గీకరణ విషయంలో అందరూ ఆలోచనతో అడుగులు వేసి అంబేద్కర్ సామాజిక ఉద్యమాన్ని కాపాడవలసి వుందని జాతీయస్థాయి నాయకుల్లో కదలిక వచ్చింది.

సర్వోన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తితో సహా ఈ కేసును పరిశీలించిన ఏడుగురు న్యాయమూర్తుల ధర్మాసనంలో జస్టిస్ బేలా త్రివేది వర్గీకరణ తీర్పు మీద అసమ్మతి తెలియజేశారు. 341 అధికరణ మీద మిగతా ఆరుగురు న్యాయమూర్తుల వివరణ సరికాదన్నారు. 2004లో ఈవీ చిన్నయ్యకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి మధ్య నడిచిన కేసులో సర్వోన్నత న్యాయస్థానం ఎస్సీ రిజర్వేషన్ల స్వరూపాన్ని మార్చడానికి పార్లమెంటుకు మాత్రమే హక్కుందని తెలియజేసిన సంగతిని గుర్తు చేశారు. ఈ వర్గీకరణను అనుమతించే తీర్పు సమయంలోనే, మరో ప్రమాదాన్ని కూడా ఎస్సీ వర్గాలకు ఉద్దేశించిన రిజర్వేషన్ ప్రయోజనాల నుంచి 'క్రీమీలేయర్'ని మినహాయించాల్సిన అవసరాన్ని సుప్రీంకోర్టు వ్యక్తం చేసింది. ఈ తీర్పులో జస్టిస్ బీఆర్ గవాయ్ ఈ అభిప్రాయాన్ని చాలా బలంగా చెప్పారు. మండల్ కమిషన్ సిఫార్సులతో వచ్చిన ఓబీసీ రిజర్వేషన్లలో క్రిమిలేయర్ ఇప్పటికే అమల్లో వుంది. ప్రభుత్వరంగ సంస్థలు ప్రైవేటుపరం అయిపోతున్న నేపథ్యంలో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ జరిగి ప్రయోజనం ఏమిటని దళిత సామాజికవేత్తలు సూటిగా ప్రశ్నిస్తున్నారు. పదోన్నతుల్లో రిజర్వేషన్లు మీద నిరంతరం ప్రభుత్వాల అభిప్రాయాలు మారిపోతున్నాయి. ఇంతవరకు ఎస్సీలకు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా సుస్థిర స్థానం దక్కనేలేదు. ఈ విషయాన్ని ప్రశ్నిస్తున్న వారి మీద నలువైపుల నుంచి దాడులు జరుగుతూనే వున్నాయి. అంతేగాక ఎస్సీ కులాల నుంచి రాజ్యాధికారానికి పోటీ పడుతున్న ఉపకులాలను అణచివేయడానికి వర్గీకరణను ఒక ఆయుధంగా పాలకపక్షాలు గట్టిగా పట్టుకున్నాయి. ఈ పరిశీలన నుంచే దళిత నాయకులు వర్గీకరణ మీద తీర్పును కుట్రగా భావించవలసి వచ్చింది.

ఎస్సీ వర్గీకరణ మీద సుప్రీంకోర్టు తీర్పును దళితుల రాజ్యాధికార పయనం మీద జరుగుతున్న కుట్రగా దళితనేతలు పేర్కొంటున్నారు. అందుకే ఈ తీర్పును సమీక్షించవలసి వుందంటున్నారు. వెంటనే ఆంధ్రప్రదేశ్ మాలమహాసభ నాయకుడు మల్లెల వెంకటరావు (35466/2024) సుప్రీంకోర్టులో సమీక్ష కోసం కేసు నమోదు చేశారు. మిగతా సంఘాలు ఇప్పటికే సమీక్ష కోసం పిటీషన్లు వేశారు. అంటరానితనం దాని స్వభావం ఇప్పటికీ భారతదేశంలో ప్రబలంగా ఉందని నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో గణాంకాలు చెప్తున్నాయి. ఆధిపత్య కులాలు అంటరానితనం, సామాజిక, సాంస్కృతిక, మత, రాజకీయ, ఆర్థిక రంగాలలో వివక్ష కొనసాగిస్తున్నాయి. ఈ రంగాలలో సమాన భాగస్వామ్యం సాధించడానికి ప్రయత్నించినప్పుడల్లా ఆ వర్గం భౌతికంగాను, ఇతర మార్గాల్లో హింసకు గురిచేస్తున్నారని మాజీ యూజీసీ ఛైర్మన్ ప్రొఫెసర్ సుఖ్‌దేవ్ థోరట్ ఆధారాలతో పాటు ఇప్పటికే ప్రభుత్వానికి ఒక సమగ్ర నివేదిక సమర్పించారు. అంటరానితనం, వివక్ష, దౌర్జన్యాలు విస్తృతంగా కొనసాగుతున్న నేపథ్యంలో రిజర్వేషన్ల వర్గీకరణతో మాత్రమే సామాజిక న్యాయం ముడిపడివుందనే న్యాయమూర్తుల అభిప్రాయాల్ని మెజారిటీ దళిత ప్రజానీకం విశ్వసించడం లేదు. ఒక్క ఉపకులమే మొత్తం అవకాశాల్ని లాగేసుకుందనే నిందలు సరికాదంటున్నారు. వీటిలో నిజమెంతుందో తేల్చేందుకు తగిన గణనతో పాటు సామాజిక స్థితిగతుల అధ్యయనాన్ని చేపట్టాల్సిన అవసరం వుంది. ఇలాంటి సందర్భాలకు తగినట్టు న్యాయమూర్తుల వ్యాఖ్యానాల్లో నిజమెంతుందో సమీక్ష జరగాలి. వర్గీకరణను రాజకీయంగా ఎన్నికల అస్త్రంగా వాడుకున్న ప్రభుత్వం పారదర్శక గణాంకాలతో సహా న్యాయస్థానాల ముందు ఉంచవలసి ఉంటుంది. ఇవన్నీ జరగకుండా గతంలో కేంద్రప్రభుత్వం వేసిన ఉషామెహ్రా కమిషన్ ఆధారంగానో లేక ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వేసిన జస్టిస్ రామచంద్రరాజు కమిషన్ ఆధారంగానో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చేయడాన్ని ఎట్టి పరిస్థితుల్లోను తెలుగు రాష్ట్రాల్లో మాల సామాజిక వర్గం అంగీకరించడం సాధ్యం కాదు. రాష్ట్రాల వర్గీకరణ ప్రక్రియలో ప్రతి చిన్న విషయం న్యాయస్థానాల మెట్లు ఎక్కితీరుతుంది. చివరికి ఎస్సీ రిజర్వేషన్లు అంతర్గత వివాదాల్లో కూరుకుపోయే అవకాశమే ఎక్కువగా కనిపిస్తుంది. అందుకే సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు మీద ఖచ్చితమైన సమీక్షను యావత్ దేశ ఎస్సీ ప్రజలంతా ఆకాంక్షిస్తున్నారు.


◆ డాక్టర్ జీకేడీ ప్రసాద్

పాఠ్యపుస్తకాల్లో పొలిటికల్ కూడికలు, తీసివేతలు

ఎన్‌సిఇఆర్‌టి పాఠ్యపుస్తకాల సవరణ కాండ ఈ సంవత్సరం కూడా కొనసాగింది. ఈసారి 12వ తరగతి రాజనీతి శాస్త్ర పాఠ్యపుస్తకం 'స్వాతంత్ర్యానంతర భారత రాజకీయాలు'లో చోటు చేసుకున్న మార్పులు చేర్పులూ వాస్తవాలను సగం కప్పి సగం విప్పి, జరిగిన సంఘటనల మీద విద్యార్థులకు పాక్షిక దృష్టిని కలిగిస్తున్నాయి. ప్రజాస్వామిక, న్యాయ పద్ధతుల ద్వారా అయోధ్య సమస్య పరిష్కారమైనట్టు పేర్కొంటున్న ఈ పుస్తకం నుంచి గుజరాత్ మారణహోమం పూర్తిగా మాయమైంది.

మొదటిసారి 2007లో ప్రచురితమై 2023 దాకా కొనసాగిన పాతప్రతిలో అయోధ్య సమస్య అనే అంశం క్రింద ఉన్న వివరణ సంక్షిప్త రూపం ఇది: బాబ్రీమసీదు 16వ శతాబ్ది కట్టడం. దాన్ని బాబర్ సేనాని నిర్మించాడు. ఇది శ్రీరాముడు జన్మించిన స్థలంగా భావిస్తున్న చోట నిర్మితమైన ఆలయాన్ని పడగొట్టి నిర్మితమైనదిగా భావింపబడింది. ఈ అంశం చుట్టూ హిందూ ముస్లింలు తమ వర్గాలను సమీకరించుకున్నాయి. ఇది మతహింసకు దారితీసింది. ప్రజల మద్దతు కూడగట్టడానికి బీజేపీ రథయాత్రను నిర్వహించింది. కరసేవకులు డిసెంబరు 6, 1992న బాబ్రీమసీదును ధ్వంసం చేశారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రప్రభుత్వాన్ని కేంద్రం రద్దు చేసింది. దేశవ్యాపితంగా ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. 1994లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులో కూల్చివేతను విపత్కర సంఘటనగా అభివర్ణించింది.

> పాఠ్యపుస్తకాల్లో సవరణలు, తొలగింపుల విషయమై ఎన్‌సిఈఆర్‌టి డైరెక్టర్ దినేశ్ ప్రసాద్ సక్లానీ, "పిల్లలు పెద్దయ్యాక ఎలాగూ తెలుసుకుంటారు. ఇప్పటి నుంచే వాటి గురించి తరగతి గదిలో ఎందుకు?" అని తమ చర్యను సమర్థించుకున్నారు. నిజానికి ఈ పుస్తకం చదువుకునే విద్యార్థి వయసు 17 సంవత్సరాలు ఉంటుంది. మరో ఏడాదిలో ఓటుహక్కు లభించే అతనికి/ఆమెకు దేశ రాజకీయాలను దాచిపెట్టి చెప్పవలసిన అవసరం ఏముందీ?



కాగా, నవీకరింపబడిన కొత్తప్రతి 2024లో ప్రచురితమై అమలులోకి వచ్చింది. దీనిలో పైన పేర్కొన్న విషయం మొత్తం తొలగింపబడి క్రింది విషయం వచ్చి చేరింది. దాని సంక్షిప్త రూపం ఇలా ఉంది: ఇది శ్రీరాముని జన్మభూమికి చెందిన వివిధ వాదనలున్న అంశం. 1528లో శ్రీరాముని జన్మస్థలంలో మూడు గుమ్మటాల నిర్మాణం జరిగింది. దీని మీద హిందూ ప్రతీకలూ, ఆనవాళ్లూ ఉన్నాయి. ఈ పవిత్రస్థలం కోసం సంవత్సరాల తరబడి న్యాయపోరాటం జరిగింది. 1992 లో కట్టడం కూలగొట్టబడినపుడు ప్రజాస్వామ్యం ఒక సవాలును ఎదుర్కొన్నది. చట్టబద్ధ మార్గాల ద్వారా పరిష్కారం కుదిరి సుప్రీంకోర్టు ఆ స్థలాన్ని శ్రీరామ జన్మభూమి తీర్థట్రస్టుకు రామాలయ నిర్మాణానికి ఇస్తూ, వక్ఫ్ బోర్డుకు వేరొక స్థలం కేటాయించవలసిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. మనలాంటి బహుళత్వం కలిగిన సమాజాలు ఈ విధంగా ప్రజాస్వామ్యపద్ధతిలో సమస్యలు పరిష్కరించుకోవాలి. భారతీయ నాగరికతలోనే కలిసిపోయిన ఆ తత్వానికి ఇది సమున్నత ఉదాహరణ... అంటూ 2019 నాటి సుప్రీంకోర్టు తీర్పులోని కొన్ని ఉటంకింపులతో ముగిసింది.

రెండు ప్రతులలోని అంశాల వివరణలో ఎంతో వైరుధ్యం కనిపిస్తుంది. పాత ప్రతిలో "Ayodhya dispute" అని సమతూకంతో ఉన్న ఉపశీర్షిక కొత్తప్రతిలో తక్కువ తీవ్రత కలిగిన "Ayodhya issue"గా మారింది. జరిగిన పరిణామాలను పాత ప్రతి వాస్తవికంగా, తార్కికంగా, బాహాటంగా వివరించగా కొత్త ప్రతి వివరణ నర్మగర్భంగా, ఖాళీలతో, వాక్యాల మధ్య అన్వయ లేమితో సాగింది. అక్కడ నిర్మితమైన కట్టడాన్ని బాబ్రీ మసీదుగా పాతప్రతి స్పష్టం చేయగా, కొత్తప్రతి దానిని మూడు గుమ్మటాల కట్టడం అనింది. అది ఏమిటో దానిని ఎవరు నిర్మించారో ఇక్కడ జవాబులు లేవు. మసీదు నిర్మాణానికి ముందు ఉన్న ఆలయ ప్రదేశం శ్రీరాముని జన్మస్థలం అనేది ఒక విశ్వాసం అని పాత ప్రతి విస్పష్టంగా చెప్పగా, కొత్త ప్రతి దానిని శ్రీరాముని జన్మస్థలంగా నిర్ధారించి మాట్లాడింది. చారిత్రక వ్యక్తి జన్మస్థలానికీ, పురాణ వ్యక్తి జన్మస్థలానికి మధ్య ఉండవలసిన శాస్త్రీయత, ఊహాత్మకతల మధ్య విభజనను కొత్తప్రతి పాటించలేదు.

ఇక, పూర్తిగా తొలగింపుకు గురైన పాఠ్యభాగం "Gujarat riots". కరసేవకులతో నిండి అయోధ్య నుంచి తిరిగి వస్తున్న రైలు బోగీకి గోద్రా స్టేషన్‌లో ఎవరో నిప్పంటించడం, 57 మంది మరణించడం, అది ముస్లిం దుశ్చర్యగా భావించి వారి మీద మరుసటి రోజు మొదలు నెలరోజులపాటు మారణహోమం సాగటం, 1100 మంది మరణించటం, అందులో అత్యధికులు ముస్లింలు కావడంతోపాటు జాతీయ మానవహక్కుల కమిషన్ దమనకాండను అదుపుచెయ్యడంలో గుజరాత్ ప్రభుత్వ దారుణ వైఫల్యాన్ని తప్పు పట్టడం వంటి అంశాలున్న ఈ ఉపశీర్షిక మొత్తం ఎత్తివేయబడింది. ఈ అల్లర్లు ప్రభుత్వ యంత్రాంగానికి కూడా మత పక్షపాతం ఉంటుందని రుజువుచేశాయనీ, మతాన్ని రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకోవడం వల్ల జరిగే ఇటువంటి ప్రమాదాల పట్ల జాగరూకత వహించాలనీ, ఇవి ప్రజాస్వామ్యానికి సవాళ్లు అనీ చేసిన వ్యాఖ్యలు కూడా తొలగింపబడ్డాయి.

అలాగే పై రెండు సందర్భాలలో పాతప్రతిలో ముద్రింపబడిన సంఘటనల నాటి వార్తాపత్రికలలో ముద్రింపబడిన వార్తల నకళ్లు కొత్తప్రతిలో మొత్తంగా మాయమయ్యాయి. వీటిల్లో హిందూస్తాన్ టైమ్స్ ప్రచురించిన 'బాబ్రీ మసీదు విధ్వంసం–కళ్యాణ్ ప్రభుత్వాన్ని రద్దుచేసిన కేంద్రం' అనే శీర్షిక, 'అయోధ్య, బీజేపీ దారుణ వైఫల్యం – అద్వానీని ముందే హెచ్చరించాను కానీ మితవాదులకు ఇక్కడ స్థానం లేదు' అని పయనీర్ ప్రచురించిన వాజ్‌పేయి ఆక్రోశం, పయనీరే ప్రచురించిన 'కూల్చివేతపై పశ్చాత్తాపం లేదు' అన్న అద్వానీ బాధ్యతారాహిత్యం, స్టేట్స్ మన్ ప్రచురించిన 'ప్రపంచవ్యాపిత ఆగ్రహ ప్రతిస్పందన' అనే వార్త ఉన్నాయి.

గుజరాత్ విషయానికి వస్తే తొలగింపుల్లో హిందుస్తాన్ టైమ్స్ ప్రచురించిన 'మండుతున్న గుజరాత్' అనే వార్త, ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ప్రచురించిన 'కంటికి కన్ను సూత్రంతో గుడ్డిదైన గాంధీనగర్' అనే పతాక శీర్షిక, ఒక పత్రిక (పేరు లేదు) ప్రచురించిన 'గుజరాత్ సంఘటనలు మాయని మచ్చలు – ప్రపంచానికి నా ముఖం ఎలా చూపించను' అన్న వాజ్‌పేయి ఆవేదన, మరో పత్రిక ప్రచురించిన 'ఆగని గుజరాత్ మారణహోమం' అనే శీర్షిక ఉన్నాయి. వీటితోపాటు తొలగింపుల్లో 1947 ఫిబ్రవరి 27న రాజ్యాంగ పరిషత్తు సలహా సంఘం ముందు 'మైనారిటీలను కాపాడలేమని మనమీద ఉన్న అపప్రథను తొలగించుకుని వాటిని పరిరక్షించుకోవడంలో మనలను మించినవారు లేరని రుజువుపరచుకోవలసి ఉంది' అన్న సర్దార్ వల్లభాయ్ పటేల్ మాటల్ని తొలగించారు. అలానే, గుజరాత్ సంఘటనను, వాటి నివారణలో ప్రభుత్వ వైఫల్యాన్ని తీవ్రంగా తప్పుపట్టి, ఈ గాయాన్ని త్వరగా మాన్పుకుని శాంతియుతమైన, తాదాత్మ్యత (harmony) కలిగిన సమాజం కోసం ఎదురు చూడాలని, ఈ మహత్తర ఆశయ సాధన రాజ్యాంగ విలువల పరిరక్షణ ద్వారా సాధ్యపడాలని కాంక్షించిన జాతీయ మానవ హక్కుల కమిషన్ 2001–02 వార్షిక నివేదిక ఉటంకింపు కూడా కత్తిరింపబడింది. చివరిగా, అప్పటి ప్రధాని వాజ్ పేయి 'గుజరాత్ రాష్ట్ర ముఖ్యమంత్రికి నా సందేశం ఒకటే – అతను రాజధర్మాన్ని పాటించాలి. పరిపాలకుడు కులం, మతం, జాతి ఆధారంగా ప్రజల పట్ల వివక్ష చూపరాదు' అన్న మాటలు కూడా తొలగింపబడ్డాయి.

ఈ సందర్భంగా ఎన్‌సిఈఆర్‌టి డైరెక్టర్ దినేశ్ ప్రసాద్ సక్లానీ, "హింసను ప్రేరేపించి, పౌరులను కుంగుబాటుకు గురిచేసే ప్రమాదముంటుందని భావించి" వాటిని తొలగించినట్టు చెబుతూ, "పిల్లలు పెద్దయ్యాక ఎలాగూ తెలుసుకుంటారు. ఇప్పటి నుంచే వాటి గురించి తరగతి గదిలో ఎందుకు?" అని తమ చర్యను సమర్థించుకున్నారు (ఆంధ్రజ్యోతి 17.6.2024 వార్త). నిజానికి ఈ పుస్తకం చదువుకునే విద్యార్థి వయసు 17 సంవత్సరాలు ఉంటుంది. మరో ఏడాదిలో ఓటుహక్కు లభించే అతనికి/ఆమెకు దేశ రాజకీయాలను దాచిపెట్టి చెప్పవలసిన అవసరం ఏముందీ? వాటి మీద సరైన అవగాహన రాజనీతి శాస్త్ర గ్రంథం కాక, మరేది ఇవ్వగలదు?

ఒకవేళ, తొలగింపు సమర్థనే నిజమైతే, అది 1984లో ఇందిరా గాంధీ మరణానంతరం ఢిల్లీలో, ఇతర ఉత్తరభారత ప్రాంతాలలో జరిగిన సిక్కుల ఊచకోతకు కూడా వర్తించాలి. కానీ ఈ రెండు వేల మంది సిక్కుల మరణానికి దారితీసిన కారణాలూ, అనంతర పరిణామాలూ, ఈ దారుణ ఘటనల పట్ల 2005లో అప్పటి ప్రధాని మన్‌మోహన్ సింగ్ పార్లమెంటులో సిక్కు సమాజంతో పాటు యావత్ భారతజాతిని క్షమాపణలు కోరుతూ చేసిన పశ్చాత్తాప ప్రకటనను కూడా తొలగించాలి. కానీ, కొత్తప్రతిలో దానిని యథాతథంగా ఉంచేశారు.

○ కొప్పర్తి వెంకటరమణమూర్తి



విన్నపాలు వినవలె..!

కూటమి ప్రభుత్వంపై హౌసింగ్ విభాగం అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల కోటి ఆశలు

- టైమ్ స్కేల్ లేదా ఎన్ఎంఆర్‌లుగా ప్రకటించాలని వేడుకోలు
- గృహ నిర్మాణ శాఖలో ఖాళీగా రెగ్యులర్ పోస్టులు
- చేసేది బండెడు చాకిరీ
- వైసీపీ ప్రభుత్వంలో సిబ్బందికి అన్యాయం
- కూటమి ప్రభుత్వం తమను గుర్తించాలంటున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు

ఏళ్ల నుంచి శ్రమిస్తున్నారు. ప్రభుత్వాలు ఏవైనా సరే.. బండెడు భారాన్ని మోస్తున్నారు. గృహ నిర్మాణాల పురోగతికి పాటుపడుతున్నారు. అయినా వారి శ్రమకు మాత్రం తగిన ఫలితం, గుర్తింపు రావడం లేదు. గత ప్రభుత్వం వారిని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. కూటమి ప్రభుత్వమైనా తమ మొరను ఆలకించి న్యాయం చేయాలని కోరుతున్నారు. వారే హౌసింగ్ విభాగంలో పనిచేసే అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు. తమకు టైమ్ స్కేల్ ప్రకటించాలని, ఎన్ఆర్ఎంలుగా అయినా పరిగణించాలని డిమాండ్ చేస్తున్నారు. తద్వారా తమ సేవలకు గుర్తింపుగా రానున్న రోజుల్లో రెగ్యులర్ అయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఉమ్మడి కృష్ణాజిల్లా హౌసింగ్ విభాగంలో పనిచేసే వారితో పాటు రాష్ట్ర వ్యాప్తంగా 2500 మందికిపైగా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు కూటమి ప్రభుత్వంపై కోటి ఆశలు పెట్టుకున్నారు. హౌసింగ్‌లో పనిచేసే అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు టైమ్‌స్కేల్ వర్కర్లు, ఎన్ఎంఆర్‌లుగా ప్రకటించే కంటే కూడా వారిని క్రమబద్ధీకరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఏం చేస్తున్నారంటే..

- ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) వంటి కేంద్ర పథకం అమలు చేయటంతో పాటు రాష్ట్ర భాగస్వామ్యంతో చేపట్టే ఇతర పథకాలను హౌసింగ్‌లోని అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులే ముందుకు తీసుకువెళ్లారు.
- హౌసింగ్ డిపార్ట్‌మెంట్‌లో వర్క్ ఇన్‌స్పెక్టర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు (డీఈఓలు), మండల ఇన్‌చార్జులు (ఎంఐసీ)గా పని చేస్తున్నారు. రెండు, మూడు మండలాలకు కలిపి ఒకే ఏఈ ఉంటున్నారు. దీంతో హౌసింగ్ పనుల భారమంతా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల మీదే పడుతోంది.
- పేదల ఇళ్ల నిర్మాణాలను గ్రౌండింగ్ చేయటం, వివిధ స్థాయిల్లో పురోగతి ఉండేలా చూసుకోవటంతోపాటు అనేక సాంకేతిక అంశాలను వీరే చూసుకునేవారు.
- కిందటి ప్రభుత్వ హయాంలో పేదల ఇళ్ల పనులను క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పట్టాలెక్కించేందుకు కృషి చేశారు.
- కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలో హౌసింగ్ విభాగంలో పనిచేసే వర్కర్లంతా తమకు టైమ్‌స్కేల్ కల్పించాలని ఆందోళన చేపట్టారు. హౌసింగ్ విభాగంలోని అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులతో బండెడు చాకిరీ చేయించిన వైసీపీ ప్రభుత్వం వారి విన్నపాన్ని కనీసం వినను కూడా వినలేదు. దీంతో హౌసింగ్ ఉద్యోగులు కూటమి ప్రభుత్వంపై కోటి ఆశలు పెట్టుకున్నారు. తమ శ్రమను గుర్తించి టైమ్ స్కేల్ కానీ, ఎన్ఎంఆర్‌లుగా ప్రకటించాలని కోరుతున్నారు.





ఏమి రుచి.. 'అన్న'

జిల్లాలో అన్న క్యాంటీన్లు ప్రారంభం
పసందైన రుచులతో రూ.5కే భోజనం

అభాగ్యులు.. ఆకలేస్తే అన్నదానాల కోసం ఎదురుచూడాల్సిన పనిలేదు. కార్మికులు.. వచ్చే కూలి తిండీతిప్పలకు కూడా సరిపోవడం లేదని దిగులు చెందాల్సి అవసరం లేదు. సామాన్యులు... పూట భోజనానికి వందకుపైగా ఖర్చవుతుందని బెంగ పడనక్కర్లేదు. దేహీ అనే రోజులు పోయాయి. 'అన్న' అనే రోజులొచ్చాయి. రూ.15కే పసందైన రుచులతో ముప్పూటలా కడుపు నింపుతున్న 'అన్న క్యాంటీన్'లలో అభాగ్యులూ.. నిరుపేదలూ ఆనందంగా కడుపు నింపుకుంటున్నారు. ఎవరిపైనా ఆధారపడాల్సిన పనిలేదనీ, రూ.5తో నిండైన భోజనం ఆరగించొచ్చనీ సంబర పడుతున్నారు. శుక్రవారం జిల్లాలోని పలుచోట్ల ప్రారంభమైన అన్న క్యాంటీన్లు నిరుపేదలు, సామాన్యులతో కళకళలాడాయి.

అనకొండలను వదిలేసి..

రిజర్వు ఫారెస్టు అక్రమాల్లో చిరుద్యోగులపై వేటు

కొండలను పిండి చేసేశారు. వాటికి నామ రూపాల్లేకుండా చేశారు. పగలు, రాత్రి తేడా లేకుండా గ్రావెల్ తవ్వేశారు. వైసీపీ హయాంలో విజయవాడ రూరల్ మండలం, జి.కొండూరు మండలాల్లోని రిజర్వు ఫారెస్టు భూముల్లో గ్రావెల్ తవ్వకాలు విచ్చలవిడిగా సాగించారు. కొండలు మాయమవుతున్నా, సరిహద్దు రాళ్లను మాఫియా విసిరిపారేసినా జిల్లా అటవీ శాఖ అధికారులు కళ్లకు గంతలు కట్టుకున్నారు. అటవీ భూమి ఎక్కడా చెక్కు చెదరలేదని బుకాయించారు. చివరికి జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్‌ను, లోకాయుక్తను తప్పుదోవ పట్టించేలా అనకొండల్లాంటి అక్రమార్కులను వదిలేసి చిరుద్యోగులపై చర్యలకు సిద్ధపడటం గమనార్హం.



- జిల్లా అధికారులపై చర్యలు ఎప్పటికో
- వైసీపీ హయాంలో ముడుపుల మత్తులో అధికారులు
- అక్రమాలు జరిగినా ఏమీ లేదని బుకాయింపు
- ఫ్లయింగ్ స్క్వాడ్‌లోనూ దొంగలు
- అక్రమాల్లో పాత్ర పోషించిన అధికారులపై చర్యలకు డిమాండ్
- అధికారులపై డిప్యూటీ సీఎంకు ఫిర్యాదు?

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : విజయవాడ రూరల్ మండలం కొత్తూరు తాడేపల్లి, జక్కంపూడి, వేమవరం, పాతపాడు గ్రామాల్లో కొండలు, అటవీ ప్రాంతం ఉంది. ఈ భూములకు పక్కనే రెవెన్యూ భూములు ఉన్నాయి. వీటిలో తవ్వకాలు చేసిన మాఫియా మొత్తం సరిహద్దులను చెరిపేసింది. రెవెన్యూ భూములు దాటుకుని అటవీశాఖ భూముల్లోకి వచ్చింది. కొండల మధ్య ఉన్న భూమిని, కొండలను మాయం చేసింది. కొన్ని వేల క్యూబిక్ మీటర్ల గ్రావెల్‌ను ఎక్స్‌కవేటర్లతో మాఫియా తవ్వేసింది. వీటి వెనుక జగన్‌కు అత్యంత సన్నిహితంగా ఉండే ఓ ప్రజాప్రతినిధి మొదలు అప్పటి ఎమ్మెల్యేలు, ఎంపీల ఉన్నారని చర్చ నడుస్తోంది.

ఇష్టానుసారంగా తవ్వకాలపై ఆయా గ్రామాల ప్రజలు, అటవీ శాఖ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేశారు. తవ్వకాలు అటవీ శాఖ భూముల్లో జరుగుతున్నాయని మ్యాప్‌లు, ఆధారాలతో సహా అందజేశారు. అయినా విజయవాడ కేంద్రంగా ఉండే ఇద్దరు అధికారులు మాత్రం అటువంటిదేమీ లేదని బుకాయించారు. ఐదేళ్లలో ఒక్కసారీ ఫిర్యాదులు వచ్చిన ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిశీలన చేసిన దాఖలాలు లేవు. ఈ

ప్రజల ఫిర్యాదు.. పట్టించుకోని అధికారులు

ఇద్దరు అధికారుల వల్ల ఉపయోగం లేదని భావించిన ప్రజలు అటవీశాఖ ఉన్నతాధికారులకు, రాజమహేంద్రవరంలోని చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్‌కు ఫిర్యాదు చేశారు. రాజమహేంద్రవరం నుంచి ఒక ఫ్లయింగ్ స్క్వాడ్‌ను నియమించారు. చివరికి ఈ మాఫియా ఫ్లయింగ్ స్క్వాడ్‌ను సైతం కొనేసింది.

అటవీశాఖలో అన్ని విభాగాలు మైనింగ్ మాఫియా ఇచ్చే నోట్ల కట్టల మత్తులో ఉన్నాయని భావించి జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్, లోకాయుక్తలో కేసులు నమోదు చేశారు. వాటి ఆదేశాలతో అటవీశాఖలోని విజిలెన్స్ అధికారులు రంగంలోకి దిగి అక్రమాలు జరుగుతున్న మాట వాస్తవమేనని నివేదిక ఇచ్చారు. జిల్లాలో పనిచేస్తున్న ఉన్నతాధికారుల ప్రమేయం ఈ అక్రమాల్లో ఉందని తేల్చారు. కొండలు కరిగిపోయి, సరిహద్దు రాళ్లు చెరిగిపోయాయని నిర్ధారించారు. ఈ నివేదికను జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్, లోకాయుక్తకు పంపారు. సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని ఈ రెండు సంస్థల నుంచి ఆదేశాలు వచ్చాయి.

అక్రమాలు నిజమని తేల్చిన విజిలెన్స్

ఇద్దరు చిరుద్యోగులపై వేటు

అధికారులు ఉన్నట్టుండి విజయవాడ రూరల్ మండలం బీట్ ఆఫీసర్ సునీతను సస్పెండ్ వేశారు. అప్పటి డిప్యూటీ రేంజర్ విజయ శేఖర్‌పై చర్యలకు సిద్ధమవుతున్నారు. నాడు రిజర్వ్ ఫారెస్టులో జరిగిన అక్రమ తవ్వకాలకు అండగా ఉన్న ఇద్దరు అనకొండలు విజయవాడలోని అటవీ శాఖ కార్యాలయంలోనే తిష్ట వేసుకుని కూర్చున్నారు. ఈ ఇద్దరు అధికారులే తప్పుడు నివేదికలను తయారు చేయించారని ఆరోపణలు బలంగా ఉన్నాయి. స్క్వాడ్ తనిఖీలకు వచ్చినప్పుడు ముందుగానే మాఫియాకు సమాచారం చేరవేసేవారు. అటవీశాఖలో ప్రతి ఉద్యోగికీ తెలిసిన బహిరంగ రహస్యం ఇది. కిందిస్థాయి ఉద్యోగులపై చర్యలు తీసుకుని, ఈ ఇద్దరు ఉన్నతాధికారులపై చర్యలు తీసుకోకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఈ ఇద్దరి అధికారులపై కొద్దిరోజుల్లో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను కలిసి ఫిర్యాదు చేయడానికి ఆయా గ్రామాల ప్రజలు సిద్ధమవుతున్నారు.

మల్లవల్లికి మహర్దశ





ప్రారంభానికి ముస్తాబవుతున్న అశోక్ లేలాండ్

కృష్ణాజిల్లా మల్లవల్లి పారిశ్రామికవాడకు మహర్దశ రానుంది. 75 ఎకరాల విస్తీర్ణంలో అశోక్ లేలాండ్ బస్ బిల్డింగ్ యూనిట్ ప్రారంభోత్సవానికి సిద్ధమవుతోంది. సెప్టెంబరు 17న ఈ సంస్థను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. దీంతోపాటు పార్లే ఆగ్రో సంస్థ పనులు మళ్లీ గాడినపడ్డాయి. 6 నెలల్లో ఈ సంస్థ కూడా ప్రారంభానికి సిద్ధమయ్యే అవకాశాలు ఉన్నాయి.

- బస్ బిల్డింగ్ యూనిట్‌తోపాటు శిక్షణ కేంద్రం
- ప్రత్యక్షంగా 500 మందికి పరోక్షంగా 5వేల మందికి ఉపాధి
- చకచకా సాగుతున్న పార్లే ఆగ్రో పనులు

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : బాపులపాడు మండలంలోని మల్లవల్లిలో బహుళ ఉత్పత్తుల పారిశ్రామిక పార్కు(మోడల్ ఇండస్ట్రియల్ పార్కు)ను ప్రారంభించాలని 2015లో అప్పటి టీడీపీ ప్రభుత్వం నిర్ణయించింది. 2017లో సుమారు 1350 ఎకరాల్లో మోడల్ ఇండస్ట్రియల్ పార్కుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఇక్కడ భారీ పరిశ్రమలతోపాటు చిన్న, మధ్యతరగతి పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలను నెలకొల్పేందుకు అనేక మంది పారిశ్రామికవేత్తలు ముందుకొచ్చారు. ఏపీఐఐసీ భూములు కూడా కేటాయించింది. అశోక్ లేలాండ్, పార్లే వంటి సంస్థలు ఆగమేఘాలపై పనులు ప్రారంభించాయి.

వైసీపీ హయాంలో అన్నీ దుర్దినాలే..

2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మల్లవల్లి పారిశ్రామికవాడకు దుర్దినాలు మొదలయ్యాయి. ఇక్కడ కనీస మౌలిక సౌకర్యాల కల్పనపై వైసీపీ ప్రభుత్వం దృష్టి సారించలేదు. పారిశ్రామికవాడలో మౌలిక సౌకర్యాల కల్పన ఏపీఐఐసీ బాధ్యత. కానీ వైసీపీ సర్కార్ నిర్లక్ష్యం కారణంగా ఏపీఐఐసీ అధికారులు మల్లవల్లి వైపే చూడటం మానేశారు. దీంతో అప్పటికే పూర్తయిన అశోక్ లేలాండ్‌తోపాటు సగంపైగా పనులు పూర్తయిన పార్లే కూడా తమ యూనిట్ల ప్రారంభానికి వెనుకడుగు వేశాయి. వైసీపీ ప్రభుత్వ వేధింపులు తట్టుకోలేక పెట్టుబడులు పెట్టేందుకు కొత్తగా పారిశ్రామికవేత్తలు ఎవరూ ఇటువైపునకే రాలేదు. స్థలాలు కేటాయించిన - మిగతా 4లో

హోసూరు పారిశ్రామికవాడలా అభివృద్ధి చెందాలి



తమిళనాడు రాష్ట్రంలోని హోసూరు పారిశ్రామికవాడను ప్రారంభించిన సమయంలో అశోక్ లేలాండ్, లక్ష్మీమిల్స్, టీవీఎస్ మూడు కంపెనీలు మాత్రమే అక్కడ ఉండేవి. ఆ కంపెనీల స్ఫూర్తితో ప్రస్తుతం అక్కడ 2వేల కంపెనీలు పనిచేస్తున్నాయి. అదే తరహాలో మల్లవల్లి పారిశ్రామికవాడ కూడా అభివృద్ధి చెందాలి. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభించాలన్నదే నా ఆకాంక్ష. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ సూచనలకు అనుగుణంగా త్వరలోనే మల్లవల్లి పరిశ్రమలతో కళకళలాడేలా తీర్చిదిద్దే బాధ్యతను నేను తీసుకుంటున్నాను.

- యార్లగడ్డ వెంకట్రావు, ఎమ్మెల్యే

నలుగురు ఏడీసీపీల బదిలీ



విజయవాడ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : పోలీసు కమిషనరేట్‌లో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న నలుగురు ఏడీసీపీలను బదిలీ చేస్తూ హోంశాఖ ముఖ్యకార్యదర్శి కుమార్ విశ్వజిత్ శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్‌లో స్పెషల్ బ్రాంచ్ ఏడీసీపీగా ఉన్న టి.కనకరాజును డీజీపీ కార్యాలయానికి బదిలీ చేశారు. ట్రాఫిక్ ఏడీసీపీగా ఉన్న డి.ప్రసాద్‌ను సీఐడీ అదనపు ఎస్పీగా నియమించారు. టాస్క్‌ఫోర్స్ ఏడీసీపీగా పనిచేస్తున్న ఆర్.శ్రీహరిబాబును సీఐడీ అదనపు ఎస్పీగా బదిలీ చేశారు. గుంటూరు క్రైమ్స్ అదనపు ఎస్పీగా ఉన్న అరిటాకుల శ్రీనివాసరావును టాస్క్‌ఫోర్స్ ఏడీసీపీగా నియమించారు. అనంతపురం ఎస్ఈబీ అదనపు ఎస్పీగా ఉన్న జి.రామకృష్ణను విజయవాడ లా అండ్ ఆర్డర్ అదనపు డీసీపీగా నియమించారు. విశాఖపట్నం ట్రాన్స్‌కో అదనపుగా ఎస్పీగా ఉన్న ఏవీఎల్ ప్రసన్నకుమార్‌ను ట్రాఫిక్ అదనపు డీసీపీగా బదిలీ చేశారు. విజయవాడ ఎస్ఈబీ అదనపు ఎస్పీగా ఉన్న కేవీఆర్‌కే ప్రసాద్‌ను విశాఖపట్నం ట్రాన్స్‌కోకు బదిలీ చేశారు. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ ఉన్న కరీముల్లా షరీఫ్‌ను డీజీపీ కార్యాలయానికి బదిలీ చేశారు.

కమిషనరేట్‌లో 100 మంది ఎస్ఐల బదిలీ

పోలీసు కమిషనరేట్‌లో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న 100 మంది ఎస్ఐలను బదిలీ చేస్తూ పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు శుక్రవారం రాత్రి ఉత్తర్వులు ఇచ్చారు. ఎనిమిది మందిని ఏలూరు రేంజ్‌కు సరెండర్ చేశారు. వీఆర్‌లో ఉన్న 51 మందికి పోస్టింగ్‌లు ఇచ్చారు.

విజయవాడ డీసీపీగా మహేశ్వరరాజ్

విజయవాడ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ డీసీపీగా మహేశ్వరరాజ్ నియమితులయ్యారు. పది మంది ఐపీఎస్‌లను బదిలీ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఎస్ఈబీలో ఎస్పీగా ఉన్న మహేశ్వరరాజ్‌ను విజయవాడకు బదిలీ చేశారు. ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్‌కు ముగ్గురు డీసీపీలు ఉండేవారు. విజయవాడ తూర్పు, పశ్చిమతోపాటు రూరల్ డీసీపీ పోస్టులు ఉండేవి. ప్రస్తుతం కమిషనరేట్‌లో ఇద్దరు డీసీపీలు మాత్రమే ఉన్నారు. మహేశ్వరరాజు రాకతో ఈ సంఖ్య మూడుకు చేరుతుంది.

వరలక్ష్మిగా దుర్గమ్మ

శ్రావణ శుక్రవారం సందర్భంగా ఇంద్రకీలాద్రికి పోటెత్తిన భక్తులు



4లో..



ఆగ్రహ జ్వాల



4లో..

మహిళలపైనా, వైద్య విద్యార్థినులపైనా లైంగిక దాడులు, హత్యలపై ఆగ్రహం పెల్లుబుకుతోంది. వీటిని అరికట్టేందుకు తక్షణమే శిక్ష అమలయ్యేందుకు ప్రత్యేక చట్టాలు తేవాలనే డిమాండ్ పెరుగుతోంది. కోల్‌కతాలోని జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటనను నిరసిస్తూ, ప్రత్యేక చట్టాలు తేవాలంటూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎమ్ఏ), ఏపీ జూడా, డాక్టర్ల అసోసియేషన్ ప్రతినిధులు శుక్రవారం ఐఎంజీ స్టేడియంలో నిరసన తెలిపారు. కొవ్వొత్తులతో ప్రదర్శన చేశారు.



వరలక్ష్మిగా కనకదుర్గమ్మ

శ్రావణ శుక్రవారం సందర్భంగా ఇంద్రకీలాద్రికి పోటెత్తిన భక్తులు

వన్‌టౌన్, ఆగస్టు 16: శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై కనక దుర్గమ్మ వరలక్ష్మి రూపంలో దర్శనమిచ్చారు. వేకువజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారి దర్శనానికి తరలివచ్చారు. అమ్మవారి శీఘ్రదర్శనం కోసం ఈవో రామారావు, అధికారులు భక్తులకు ఇబ్బంది కలగకుండా క్యూలైన్లను పర్యవేక్షించారు.



జస్టిస్ వి.గోపాలకృష్ణారావు దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో రామారావు



జస్టిస్ టి.మల్లికార్జునరావు దంపతులకు అమ్మవారి చిత్రపటం అందిస్తున్న పండితులు, అధికారులు

అమ్మవారికి కానుకగా బంగారు మంగళసూత్రాలు



మంగళసూత్రాలు అందజేస్తున్న భక్తురాలు తోట లక్ష్మి

విజయవాడ పటమటకు చెందిన తోట లక్ష్మి, కుటుంబ సభ్యులు అమ్మవారి అలంకరణ నిమిత్తం శుక్రవారం 43.5 గ్రాముల రెండు మంగళ సూత్రాలను ఆలయ ఈఈ రమాదేవి ద్వారా దేవస్థానానికి అందించారు.



దుర్గమ్మ సేవలో హైకోర్టు న్యాయమూర్తులు

కనకదుర్గమ్మను హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ టి.మల్లికార్జునరావు, వి.గోపాలకృష్ణారావు వారి కుటుంబసభ్యులతో వేర్వేరుగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారిని ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అధికారులు అమ్మవారి దర్శనం అనంతరం వారికి శేషవస్త్రం, ప్రసాదం, అమ్మవారి చిత్రపటం అందజేశారు. పండితులు ఆశీస్సులు అందజేశారు.

నేటి నుంచి పవిత్రోత్సవాలు

వన్‌టౌన్: దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 17 నుంచి 20వతేదీ(శని, ఆది, సోమ, మంగళ) వరకు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నారు. దీంతో దేవస్థానంలో అన్ని ప్రత్యక్ష, పరోక్ష ఆర్జిత సేవలను నిలిపివేశారు. ఆలయంలో నిర్వహించే నిత్య కైంకర్యాలను అర్చకులు మాత్రమే నిర్వహిస్తారు. శ్రావణ శుద్ధ త్రయోదశి శనివారం సాయంత్రం 4 గంటలకు ఉదక శాంతి కార్యక్రమంతో పవిత్రోత్సవాలు ప్రారంభమవుతాయి. 18వ తేదీ వేకువజామున 3 గంటలకు సుప్రభాత సేవ నిర్వహించి అనంతరం స్నపనాభిషేకం నిర్వహిస్తారు. అనంతరం అమ్మవారికి అలంకారం చేశాక శాస్త్రోక్తంగా వేదమంత్రాల మధ్య పవిత్రమాలలను ధరింపజేస్తారు. 18వ తేదీ ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు గణపతి పూజ, మండపారాధన, అగ్ని ప్రతిష్టాపన, సర్వ ప్రాయశ్చిత విధి, వివిధ దేవతారాధనలు నిర్వహిస్తారు. సాయంత్రం 4 గంటల నుంచి మూల మంత్రహవనాలు, వేద పారాయణలు, హారతి, మంత్రపుష్పం సమర్పిస్తారు. 19వ తేదీన మండపారాధన నిర్వహిస్తారు. 20వ తేదీ ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు మండపారాధన, సర్వప్రాయశ్చిత విధి, శాంతి పౌష్టిక హోమాలు, కూష్మాండ బలి నిర్వహించాక 10.30 గంటలకు కలశోద్వాసన, మార్జనం, మహదాశీర్వచనం కార్యక్రమాలు నిర్వహిస్తారు. 18వ తేదీన స్నపనాభిషేక కార్యక్రమం సందర్భంగా ఆరోజు ఉదయం 9 గంటల నుంచి మాత్రమే భక్తులకు అమ్మవారి దర్శనం కల్పిస్తారు.

అమ్మవారిని దర్శించుకున్న సంత్‌సదానందగిరి మహారాజ్



రుద్రప్రయాగకు చెందిన సంత్ సదానంద గిరి మహారాజ్ స్వామీజీ(108) దుర్గమ్మను దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ మర్యాదలతో అధికారులు స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం అనంతరం ఆయనకు ఈవో కె.ఎస్.రామారావు శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటం అందజేశారు.

రహదారులపై భద్రతా చర్యలు చేపట్టండి

» అధికారులకు కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ ఆదేశం



మచిలీపట్నం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): రహదారులపై ప్రమాదాల నివారణకు భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులను కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశపుహాలులో శుక్రవారం జిల్లా రహదా రుల భద్రతాకమిటీ సమావేశం నిర్వహిం చారు. జాతీయరహదారులు 216, 65, 16, 165తోపాటు జిల్లాలోని ఇతర రహదారు లపై 61ప్రాంతాల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయన తెలి పారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో నివారణకు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. ద్విచక్రవాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్, కార్లలో ప్రయాణించేవారు సీట్‌బెల్టులు పెట్టుకునేలా అవగాహన కల్పించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపేవారిపై కఠినచర్యలు తీసుకోవాలని సూచిం చారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కలిగే అనర్థాలను వివరించాల న్నారు. 2024 జూలై వరకు రహదారులపై జరిగిన ప్రమాదాల్లో 187మంది మరణించారని, వాటిలో జాతీయరహదారులపై జరిగిన ప్రమాదాల్లో 106 మంది ఉన్నారని అధికారులు తెలిపారు. జిల్లాలో తరచూ ప్రమాదాలు జరిగే 47బ్లాక్‌స్పాట్లను గుర్తించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుం టున్నట్లు తెలిపారు. నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడుపుతున్న వారిపై రవాణాశాఖ 1,014 కేసులు, పోలీస్‌శాఖ 50,964 కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు 140 నమోదుచేసి రూ.8.65 లక్షలను జరిమానాగా వసూలు చేసినట్లు తెలిపారు. జిల్లా రవాణాశాఖ అధికారి పురేంద్ర, ఏఎస్పీ ప్రసాద్, ఏపీఎస్ ఆర్టీసీ అధికారి వాణిశ్రీ, మచిలీపట్నం మునిసిపల్ కమి షనర్ బాపిరాజు, ఆర్‌అండ్‌బీ ఈఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రా పేరుతో ప్రజాధనం లూటీ

» గత వైసీపీ ప్రభుత్వంపై దేవినేని ఉమా ఆరోపణ

నందిగామ, ఆగస్టు 16: ఆడుదాం ఆంధ్రా పేరుతో గత వైసీపీ ప్రభుత్వం ప్రజాధనాన్ని దోపిడీ చేసిందని, అప్పటి ముఖ్యమంత్రి జగన్‌తో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు ఇందులో భాగస్వాములయ్యారని మాజీ మంత్రి, టీడీపీ ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు ఆరోపించారు. శుక్ర వారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్ర మం పేరుతో నాశిరకం ఆటవస్తువులు కొనుగోలు చేశారన్నారు. కోట్లాది రూపాయల ప్రజాధనం పక్కదారి పట్టించారని ఆరోపించారు. దీనిపై టీడీపీ కూటమి ప్రభుత్వం విచారణ చేపడుతుందని, బాధ్యులను శిక్షించి తీరుతుందని ఆయన స్పష్టంచేశారు. అగ్రిగోల్డ్ భూముల వ్యవహారంపైనా సమగ్ర విచారణ సాగుతోందని తెలిపారు. లక్షలాది ప్రజల ఆస్తులైన నిషే ధిత అగ్రీభూములను అక్రమ మార్గంలో రిజిస్ట్రేషన్ చేయించుకొని జోగి రమేష్, అతని కుమారుడు లబ్ధి పొందారని ఆరోపించారు. విచారణలో అన్ని విషయాలు వెల్లడవుతాయని, చంద్రబాబు నివాసంతో పాటు టీడీపీ కార్యా లయంపై దాడి చేసిన వారిపైనా చర్యలు తప్పవని ఉమా హెచ్చరించారు.

ఉత్సాహంగా యోగాసన పోటీలు



పోటీలో ఆసనాలు వేస్తున్న క్రీడాకారుడు

విజయవాడ స్పోర్ట్సు, ఆగస్టు 16: కృష్ణాజిల్లా యోగాసన స్పోర్ట్సు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాల 49వ యోగాసన పోటీలు అజిత్‌సింగ్‌నగర్ వివేకానంద సెంటినరీ హైస్కూల్‌లో శుక్రవారం ఉత్సాహపూరిత వాతావరణంలో నిర్వహించారు. 8 ఏళ్ల నుంచి 45 ప్లస్ వయస్సు కలిగిన 11 కేటగిరీల్లో పోటీలు జరగ్గా 165 మంది క్రీడాకారులు బరిలో పోటాపోటీగా తలపడ్డారని జిల్లా యోగాసన స్పోర్ట్సు అసోసియేషన్ కార్యదర్శి ఎల్. మురళీకృష్ణ తెలిపారు. యోగా పోటీలకు జిల్లా ప్రెసిడెంట్ ఆర్.రవి, జాయింట్ సెక్రటరీ శాంతి రవికిరణ్, పూజిత, తేజస్వి, టి పూర్ణచంద్రరావు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.

గుల్జార్‌చౌక్ మసీదులో రికార్డుల తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న వక్ఫ్ బోర్డు జిల్లా అధికారులు

గుడివాడ: గుల్జార్ చౌక్ మసీదులో నిధులు దుర్వినియోగమయ్యా యని లోకాయుక్తలో వచ్చిన ఫిర్యాదు మేరకు వక్ఫ్ బోర్డు జిల్లా ఇన్‌స్పెక్టర్ ఎండీ నూహ అలీషా శుక్రవారం రికార్డులను తనిఖీ చేశారు. గుల్జార్ చౌక్ మసీదుకు చెందిన 27 దుకాణాల అనధికార అగ్రిమెంట్లపై వచ్చిన ఫిర్యాదు మేరకు తనిఖీలు చేపట్టామని నూహ అలీషా తెలిపారు. మసీదు కమిటీ అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారులు కరీంబేగ్, రజాక్ బాషా, ఎండీ నూర్‌లు విలేకరులతో మాట్లా డారు. కమిటీ పూర్వ అధ్యక్షుడు షేక్ ఇబ్రహీం మసీదుకు చెందిన 27 దుకా ణాలకు లీజుదారుల నుంచి రూ.12లక్షలు గుడ్‌విల్‌గా వసూలు చేశారని, వాటిని మసీదు ఖాతాలో జమచేయలేదని ఆరోపించారు. మసీదు ఖాతాలో నిధులు వివరాలను అడిగితే ఆయన తెలపలేదన్నారు. వక్ఫ్‌బోర్డు అనుమతి లేకుండా వసూలు చేసిన నిధుల విషయంలో జరిగిన అవకతవకలపై జిల్లా వక్ఫ్‌బోర్డు అధికారులకు తమ వద్ద ఉన్న సమాచారాన్ని తెలిపామని వారు స్పష్టం చేశారు. తనిఖీల్లో వక్ఫ్ బోర్డు ఉద్యోగి ఎండీ కరీముల్లా పాల్గొన్నారు.

కృష్ణానదిలో దూకి మహిళ గల్లంతు



రమ(ఫైల్)

తాడేపల్లి టౌన్, ఆగస్టు 16: కృష్ణానదిలోకి దూకి ఓ మహిళ గల్లంతైన సంఘటన తాడేపల్లి పరిధిలోని ప్రకాశం బ్యారేజి వద్ద శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్టీఆర్ జిల్లా జక్కంపూడి వైఎస్సార్ కాలనీకి చెందిన రమ అనే వివాహిత కుటుంబ కలహాల నేపథ్యంలో ఈ ఘట నకు పాల్పడినట్టు పోలీసులు తెలిపారు. నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో గల్లంతైన రమ ఆచూకీ తెలియ రాలేదని పోలీసులు తెలిపారు. వివాహిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.





వేడుకగా

విజయవాడలో అన్న క్యాంటీన్లు ప్రారంభించి అల్పాహారం రుచి చూస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, కలెక్టర్ సృజన, వడ్డిస్తున్న ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే బొండా ఉమా

అన్న క్యాంటీన్ల పునఃప్రారంభం

పేదల కళ్లల్లో ఆనందం చూస్తున్నాం: ఎంపీ కేశినేని చిన్ని

» నిర్వహణలో లోపాలు లేకుండా చూస్తాం: కలెక్టర్ సృజన

కృష్ణలంక, ఆగస్టు 16: ఎన్టీఆర్ జిల్లాలో అన్న క్యాంటీన్ల పునఃప్రారంభం శుక్రవారం పండుగ వాతావరణంలో జరిగింది. విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో పటమట కోనేరు బసవయ్యచౌదరి జడ్పీహెచ్‌ఎస్, బుడమేరు జం క్షన్, గాంధీనగర్, వన్‌టౌన్ గాంధీ పార్కు వద్ద అన్న క్యాంటీన్లను ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభించడంతో పేదల కళ్లల్లో ఆనందం కనిపిస్తోందని ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. కార్యక్రమాల్లో కలెక్టర్ జి.సృజన, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బొండా ఉమామహేశ్వరరావు, సుజనాచౌదరి, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. రూ.5కే అల్పాహారాన్ని స్వయంగా వడ్డించారు.

ఎన్టీఆర్ జిల్లాలో 14 క్యాంటీన్లు: కలెక్టర్ సృజన

ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా 14 అన్న క్యాంటీన్లు ప్రారంభిస్తున్నామని కలెక్టర్ సృజన తెలిపారు. నగరపాలక సంస్థ పరిధిలో 11 క్యాంటీన్లను ప్రారంభించినట్లు ఆమె తెలిపారు. క్యాంటీన్లలో మెనూ ప్రకారం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం ఏర్పాటు చేస్తున్నామని, స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేశామని తెలిపారు. నిర్వహణలో లోపాలు లేకుండా, ఎలాంటి ఇబ్బంది రాకుండా చూస్తామన్నారు.

బృహత్తర కార్యక్రమం: ఎమ్మెల్యేలు గద్దె, బొండా, సుజనా చౌదరి

రోజుకు 15 రూపాయల చొప్పున నెలకు రూ.450తో పేదల ఆకలిని తీర్చే బృహత్తర కార్యక్రమమని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. ప్రజల భాగస్వామ్యంతో కలకాలం అన్న క్యాంటీన్లు కొనసాగుతాయని సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమా పేర్కొన్నారు. అన్న క్యాంటీన్ల నిర్వహణకు విరాళాలు ఇచ్చేందుకు చాలా మంది ముందుకొస్తున్నారని పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి తెలిపారు. ఇది ఓ గొప్ప స్ఫూర్తికి తార్కాణమన్నారు. క్యాంటీన్లలో అన్ని మౌలిక వసతులను ఏర్పాటు చేస్తున్నట్లు వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. నగరపాలక సంస్థ అదనపు కమిషనర్లు డాక్టర్ ఎ.మహేష్, కేవీ సత్యవతి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

దేవినేని ఉమాపై చెరగని అభిమానం

» నందిగామ అన్న క్యాంటీన్ వద్ద చూసి అభిమానుల కన్నీటి పర్యంతం..ఉమాకు పదవి ఇవ్వాలంటూ నినాదాలు



నినాదాలు చేస్తున్న అభిమానులు

నందిగామ: టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలి సారి నందిగామలో ప్రజల మధ్యకు వచ్చిన మాజీ మంత్రి దేవినేని ఉమాపై ఆయన అభిమానులు చెరగని అభిమానాన్ని చూపారు. పట్టణంలో శుక్రవారం ప్రారంభమైన అన్న క్యాంటీన్ సందర్శనకు వచ్చిన ఉమా అక్కడ ప్రజలతో మాట్లాడుతుండగా కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వడ్డెల్లి సాంబశివరావుతో పాటు అక్కడ ఉన్న ఉమా అభిమానులు, ప్రజలు ఆయన్ను చూసి కన్నీటి పర్యంతమయ్యారు. పార్టీ కోసం, ప్రజల కోసం కష్టపడే మీవంటి నాయకుడికి సీటు దక్కక పోవడం దారుణమంటూ కంటతడి పెట్టారు. ఏ సమస్య వచ్చినా మీరున్నారన్న ధైర్యంతో ఉండేవారమంటూ వేదన చెందారు. అందరికీ అందుబాటులో ఉండే మీవంటి నేతకు ఇలా జరగడమేమిటంటూ ఆయన చుట్టుచేరారు. మీకు న్యాయం జరగకపోతే నిబద్ధత అన్న పదానికి అర్థం లేదన్నారు. చంద్రబాబు తక్షణమే ఉమా కష్టానికి తగిన పదవిని ఇవ్వాలంటూ నినాదాలు చేశారు. దీంతో ఉమా సైతం ఉద్విగ్నానికి లోనయ్యారు. వడ్డెల్లితో పాటు ఇతర అభిమానులను ఆయన సముదాయించారు. పదవులు ముఖ్యం కాదని, చంద్రబాబు పాలనలో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు అందరం కలసి పని చేద్దామని వారికి ఉమా సూచించారు.

జగన్‌రెడ్డిది సంకుచిత, శాడిస్ట్ మనస్తత్వం

» అన్న క్యాంటీన్లు నిలిపివేసి పేదలపై కక్ష తీర్చుకున్నాడు

» పేటలో అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవంలో నెట్టెం, తాతయ్య

జగ్గయ్యపేట: "వైసీపీ అధ్యక్షుడు, పులివెందుల ఎమ్మెల్యే జగన్‌రెడ్డి సంకుచిత, పైశాచిక మనస్తత్వంతో అన్న క్యాంటీన్లు నిలిపివేశారు. పేదలపై కక్ష తీర్చుకున్న ఘనుడాయన." అని విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం, ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య విమర్శించారు. శుక్రవారం జగ్గయ్యపేటలో వారు అన్న క్యాంటీన్‌ను ప్రారంభించారు. తొలి రోజు మొత్తం ఖర్చును నెట్టెం రఘురాం అందజేసి, ఉచితంగా ఆహారం అందించారు. మునిసిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, కన్నెబోయిన రామలక్ష్మి, నెట్టెం శివరాం, శ్రీరాం చినబాబు పాల్గొన్నారు.



జగ్గయ్యపేటలో టిఫిన్ చేస్తున్న నెట్టెం రఘురాం, శ్రీరాం తాతయ్య

పేదల ఆకలి తీర్చేందుకే అన్న క్యాంటీన్లు

» నిర్వహణ కోసం కృష్ణాజిల్లాలో ఏడుగురు ఎమ్మెల్యేలు, ఎంపీ కలిసి రూ.50 లక్షల విరాళమిస్తాం: కొల్లు రవీంద్ర



రూ.లక్ష చెక్కును మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలశౌరికి అందజేస్తున్న డాక్టర్ బి.ధన్వంతరీ ఆచార్య

మచిలీపట్నం టౌన్: పేదల ఆకలి తీర్చేందుకే అన్న క్యాంటీన్లు మళ్లీ ప్రారంభిస్తున్నామని వాటి నిర్వహణ కోసం కృష్ణాజిల్లాలోని ఏడుగురు ఎమ్మెల్యేలు, ఎంపీతో కలిసి రూ.50 లక్షలు విరాళంగా అందజేస్తామని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. మచిలీపట్నం మూడు స్తంభాల సెంటర్‌లో అన్న కాంటీన్‌ను ఎంపీ వల్లభనేని బాలశౌరితో కలిసి ఆయన ప్రారంభించారు. పేదలకు టిఫిన్ వడ్డించారు. వారితో కలిసి మంత్రి పూరీలు తిన్నారు. జగన్ సీఎం అయ్యాక అన్న కాంటీన్లు రద్దు చేశారని, పేదలకు ఉపయోగపడే కార్యక్రమాలను రద్దు చేస్తే చరిత్ర హీనులుగా మిగిలిపోతారని కొల్లు రవీంద్ర హెచ్చరించారు. పేదలు హోటల్‌కు వెళ్లి భోజనం చేయాలంటే రూ.80 నుంచి రూ.100 ఖర్చవుతోందని, సీఎం చంద్రబాబు, ఉపముఖ్య మంత్రి పవన్ కల్యాణ్ పేదల కడుపు నింపేందుకు అన్న క్యాంటీన్లు పునఃప్రారంభిస్తున్నారని ఎంపీ వల్లభనేని బాలశౌరి తెలిపారు. మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, మునిసిపల్ కమిషనర్ బాపిరాజు, అక్షయపాత్ర సమన్వయ కర్త ఆషిబాబు, బాబా ప్రసాద్, మాదివాడ రాము, గోపాల్ పాల్గొన్నారు.

రూ.2 లక్షల విరాళం

మచిలీపట్నానికి చెందిన వైద్యుడు బి.ధన్వంతరీఆచార్య అన్న క్యాంటీన్ నిర్వహణకు ఏటా ఆగస్టు 15న రూ.లక్ష ఇస్తామన్నారు. రూ.లక్ష చెక్కును మంత్రికి అందించారు. తన కుమారుడు ఆశ్రిత్ తొలి జీతం రూ.లక్ష చెక్కును జనసేన నాయకుడు మాదివాడ రాము అందజేశారు.

అన్నార్తులకు వరం

ఆకలితో ఉండే తమకు పునఃప్రారంభించిన అన్న క్యాంటీన్లు ఓ వరమని పలువురు కార్మికులు, పేదలు పేర్కొన్నారు. ప్రారంభమైన తొలిరోజే కార్మికులు, పేదలు భారీగా తరలివచ్చారు.

రూ.5కే భోజనం సంతోషకరం



చల్లపల్లి నుంచి మచిలీపట్నం వచ్చి ఉల్లిపాయలు అమ్ముకుంటా. హోటల్ భోజనానికి రూ.100 ఖర్చవుతోంది. బైక్‌పై రానూ పోనూ బందరులో తిరిగేందుకు రోజుకు రూ.160 ఖర్చవుతోంది. నాకు ముగ్గురు ఆడ పిల్లలు. వారిని పోషించుకోవాలి. అన్న క్యాంటీన్‌లో రూ.5కే భోజనం పెడుతున్నారు. ఎంతో సంతోషంగా ఉంది. **-పరసు జగన్మోహనరావు, చల్లపల్లి**

భోజనం రుచిగా ఉంది



బందరు బలరాముని పేటలో ఉంటాను. గ్యాస్ ప్రమాదం వల్ల రెండు కాళ్లు దెబ్బతిన్నాయి. ఇంట్లో పనిచేసుకోవడం కష్టంగా ఉంది. నా భర్త చనిపోయాడు. టైలరింగ్ చేసుకుని బతికే నాకు రూ.5కే మూడు పూటలా ఆహారం దొరుకుతుంది. భోజనం రుచిగా ఉంది. సాంబారు బాగుంది. పెరుగు, నిమ్మకాయ పచ్చడి వేశారు.

- పాగోలు వెంకట సత్యవతి, బలరాముని పేట

చంద్రబాబు రుణం తీర్చుకోలేం



బందరు మండలం వాడగొయ్యి నుంచి వచ్చి ఇక్కడ ఆటో నడుపుతుంటా. రోజుకు రూ. 500 సంపాదిస్తా. టిఫిన్లు, భోజనానికి రూ.300 అయిపోతాయి. అన్న క్యాంటీన్‌తో నా ఖర్చు భారీగా తగ్గుతుంది. నాలాంటి పేద, మధ్యతరగతి ప్రజలకు భోజన సౌకర్యం కల్పించిన చంద్రబాబు రుణం తీర్చుకోలేం.

- గోసాల బాలకోటేశ్వరరావు, వాడగొయ్యి

వైద్యులపై దాడులు అరికట్టాలి

ఐజీఎం స్టేడియంలో ఐఎంఏ ప్రతినిధులు, జూడాలు, వైద్య విద్యార్థుల నిరసన ప్రదర్శన

లబ్బీపేట, ఆగస్టు 16: దేశవ్యాప్తంగా మహిళలు, వైద్యులు, మహిళా వైద్యులపై దాడులను అరికట్టేందుకు తక్షణ శిక్ష అమలయ్యేలా ప్రత్యేక చట్టాలు తేవాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ), ఏపీ జూడా, డాక్టర్ల అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. కోల్‌కతాలోని ఆర్జీ కర్ మెడికల్ కళాశాలలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం ఘటనను నిరసిస్తూ శుక్రవారం ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిరసన కార్యక్రమం, కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. కోల్‌కతా ఘటన సభ్యసమాజం తలదించుకునే దురదృష్టకర ఘటన అని, మహిళా వైద్యురాలపై హత్యాచారం అమానుషమని వైద్యులు ఆగ్రహం వ్యక్తంచేశారు. డాక్టర్లు, మహిళా డాక్టర్లపై దాడులు అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయన్నారు. హత్యాచార ఘటనలో నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నల్లదుస్తులు ధరించి వైద్య విద్యార్థినులు, జూడాలు, భారీ కొవ్వొత్తుల ప్రదర్శనతో పాటు, స్టేడియం ముందు బందరురోడ్డులో కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఐఎంఏ ప్రతినిధులు, జూడాలు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

ముంబైకి ఇండిగో సర్వీసు పునఃప్రారంభం

గన్నవరం, ఆగస్టు 16: గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ముంబైకి ఇండిగో విమానం పునఃప్రారంభం అయింది. ప్రతి రోజు రాత్రి 9 గంటలకు ఇక్కడి నుంచి ముంబైకి బయలు దేరుతుంది. ఇందులో 106 మంది ప్రయాణికులు ముంబై వెళ్లారు. ఎంపీలు వల్లభనేని బాలశౌరి, కేశినేని చిన్నిల అభ్యర్థన మేరకు ఇండిగో విమాన సంస్థ ముంబైకి మళ్లీ సర్వీసును ప్రారంభించింది. ముంబైకి వెళ్లే ప్రయాణికులకు సర్వీసును అందుబాటులో ఉంచటమే లక్ష్యమని ఎంపీలు తెలిపారు. ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకట్రావు, కొలికపూడి శ్రీనివాసరావు, ఎయిర్‌పోర్టు అధికారులు పాల్గొన్నారు.



ప్రయాణికులకు బోర్డింగ్ పాస్ అందజేస్తున్న ఎంపీలు వల్లభనేని బాలశౌరి, కేశినేని చిన్ని, ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకట్రావు, కొలికపూడి శ్రీనివాసరావు

మల్లవల్లికి మహర్దశ

(మూడో పేజీ తరువాయి)

పరిశ్రమలు సైతం వెనుదిరిగాయి. దీంతో ఆయా స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరిగి చిట్టడివిలా మారిపోయింది.

మళ్లీ చిగురించిన ఆశలు..

ఇటీవల జరిగిన ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మల్లవల్లి పారిశ్రామికవాడ అభివృద్ధిపై ఆశలు చిగురించాయి. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ సూచనలతో స్థానిక గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మల్లవల్లిలో భూములు పొందిన పారిశ్రామికవేత్తలతో పలుమార్లు సమావేశమయ్యారు. ఇప్పటికే పనులన్నీ పూర్తి చేసుకుని ప్రారంభానికి నోచుకోని అశోక్‌లేలాండ్ సంస్థ పునఃప్రారంభం కోసం ఆయన ప్రత్యేక దృష్టి సారించారు. పలుమార్లు సంస్థ ప్రతినిధులతో భేటీ అయ్యారు. 75 ఎకరాల్లో రూ.140 కోట్లతో ఏర్పాటు చేసిన ఈ సంస్థ అందుబాటులోకి వస్తే స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్న ఉద్దేశంతో వెంకట్రావు అశోక్ లేలాండ్ ప్రారంభానికి తీవ్రంగా కృషి చేశారు. అశోక్‌లేలాండ్ సంస్థ తొలుత ఇక్కడ బస్సు బాడీ బిల్డింగ్ యూనిట్‌ని ప్రారంభించ నుంది. అనంతరం ట్రైనింగ్ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేస్తుంది. ఇవన్నీ గాడిన పడిన తర్వాత ప్లాంటు విస్తరణలో భాగంగా బస్సు అసెంబ్లింగ్ యూనిట్‌ను ప్రారంభించనుంది. ఈ సంస్థ ఏర్పాటు ద్వారా 500 మందికి ప్రత్యక్షంగా మరో 5వేల మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుంది.

ఐటీఐలో సీట్ల భర్తీకి దరఖాస్తులు

భారతీనగర్, ఆగస్టు 16: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో మిగిలిన సీట్ల భర్తీకి ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఈనెల 26వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఐటీఐ ప్రధానాధికారి, కన్వీనర్ ఎం.కనకారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు దరఖాస్తులో పేర్కొన్న కళాశాలకు ఆగస్టు 27వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోగా హాజరవ్వాలని ఆయన సూచించారు. ఒరిజినల్ సర్టిఫికెట్లను వెబ్‌సైట్‌లో ధ్రువీకరించుకోవాల్సి ఉందని ఆయన సూచించారు. జిరాక్స్ కాపీలతో పాటు ఆన్‌లైన్ దరఖాస్తును తీసుకురావాలని తెలిపారు. ప్రభుత్వ ఐటీఐలో ఆగస్టు 29వ తేదీ, ప్రైవేట్ ఐటీఐలో ఆగస్టు 30వ తేదీన అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తారని, వివరాలకు 9490639639, 7780429468లో సంప్రదించాలని ఆయన సూచించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	101, 110, 121
చికెన్ విత్ స్కిన్	196
చికెన్ స్కిన్‌లెస్	206



నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.91

కార్మికులకు వెంటనే జీతాలు చెల్లించాలని కోరుతూ ధర్నా



చిట్టినగర్, ఆగస్టు 16: నగరపాలక సంస్థలో పని చేస్తున్న శానిటరీ, మలేరియా కార్మికులకు వేతనాలు వెంటనే చెల్లించాలని కోరుతూ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం చిట్టినగర్ సర్కిల్-1 కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం కార్పొరేటర్ బోయి సత్యబాబు మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అధికారులు స్పందించకపోతే ఆందోళన తీవ్రం చేస్తామన్నారు.

నగరాభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తా

● ఎమ్మెల్యే సుజనా చౌదరి

చిట్టినగర్, ఆగస్టు 16: నగరాభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తానని, నగరాన్ని అన్ని హంగులతో స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక సిద్ధం చేయడం జరుగుతుందని పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి అన్నారు.

శుక్రవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం నూతన భవనంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కమిషనర్ ధ్యానచంద్రతోపాటు అధికారులు పాల్గొన్నారు. వీఎంసీ ప్రజలకు కల్పించాల్సిన మౌలిక సదుపాయాలు, అభివృద్ధి పనులపై చర్చించారు. నియోజకవర్గంలోని పెండింగ్ పనుల వివరాలు అడిగి తెలుసుకొని త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. నగరాభివృద్ధికి సంబంధించి ప్రణాళిక రూపొందించి అందించాలన్నారు. పలువురు ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పేదల కడుపు నింపేదే అన్న క్యాంటీన్

20వ డివిజన్‌లో అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవంలో ఎంపీ శివనాథ్, ఎమ్మెల్యే గద్దె

కృష్ణలంక, ఆగస్టు 16 : పేదవాడి కడుపు నింపేదే అన్న క్యాంటీన్ అని ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. కృష్ణలంక 20వ డివిజన్ పొట్టి శ్రీరాములు హైస్కూల్ సమీపంలోని అన్న క్యాంటీన్‌ను ఎంపీ శివనాథ్, ఎమ్మెల్యే గద్దె శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్న క్యాంటీన్లన్నీ ఈ రోజు నుంచి ప్రారంభమై పేదవారి ఆకలి తీర్చే దిశగా పనిచేయడం ప్రారంభించాయని తెలిపారు. టీడీపీ నాయకులు బొప్పన భవకుమార్, గోరిపర్తి నామేశ్వరరావు, వేములపల్లి రంగారావు, మహ్మద్ హాజీ, కేశనం భావన్నారాయణ, వెన్నా శంకర్, జనసేన నాయకుడు కొవ్వూరి కిరణ్‌బాబు, బీజేపీ నాయకుడు వాసా పల్లపురాజు తదితరులు పాల్గొన్నారు.

రాణిగారితోట: 17,18 డివిజన్ల పరిధిలో రాణిగారితోట నేషనల్ హైవే సాయి బాబా గుడి వద్ద, సిమెంట్ గోడౌన్ వద్ద రెండు అన్న క్యాంటీన్లను శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ప్రారంభించి పార్టీ శ్రేణులతో కలిసి వడ్డన చేశారు. వేముల దుర్గారావు, రాయి రంగమ్మ, ముని పోలిపల్లి, పీరుబాబు, తిరుపతయ్య పాల్గొన్నారు.

పటమట: 11వ డివిజన్ పరిధిలోని పటమట రైతుబజార్ దగ్గర ఏర్పాటు చేసిన అన్నక్యాంటీన్‌ను కలెక్టర్ సృజన, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్రలతో కలిసి ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ శుక్రవారం ప్రారంభించి అల్పాహారం రుచి చూశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామ్మోహన్ అన్నక్యాంటీన్ల నిర్వహణకు విరాళాలు సేకరిస్తున్నామని, దాతలు పెద్ద మనస్సుతో సహకరించాలని కోరారు. కలెక్టర్ సృజన మాట్లాడుతూ అన్న క్యాంటీన్లను అధికారులు నిత్యం పర్యవేక్షిస్తారన్నారు. వీఎంసీ కమిషనర్ హెచ్ఎం ధ్యాన్‌చంద్ర, అదనపు కమిషనర్ మహేష్, టీడీపీ నాయకులు కోనేరు రాజేష్, గద్దె రమేష్, ముమ్మనేని ప్రసాద్, పొట్లూరి సాయిబాబు, చెన్నుపాటి ఉషారాణి, చెన్నుపాటి గాంధీ, బంగారు మురళీలు పాల్గొన్నారు.



18వ డివిజన్‌లో అన్న క్యాంటీన్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

అన్న క్యాంటీన్లను అందుబాటులోకి తెచ్చిన సీఎంకు కృతజ్ఞతలు

సత్యనారాయణపురం: సెంట్రల్‌లో అయోధ్యనగర్‌లో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను శుక్రవారం ఉదయం సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావుతో కలిసి ఎంపీ కేశినేని శివనాథ్ ప్రారంభించారు. అనంతరం పేదలకు అల్పాహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కేశినేని శివనాథ్ మాట్లాడతూ పేదలకు అన్న క్యాంటీన్లు అందుబాటులోకి తీసుకువచ్చిన సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కలెక్టర్ జి. సృజన, మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర, కార్పొరేటర్ చెన్నగిరి రామోమహనరావు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. 27వ డివిజన్ గులాబితోట వద్ద అన్న క్యాంటీన్‌ను సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ప్రారంభించారు. పేదలకు అల్పాహారాన్ని అందచేశారు. స్థానిక కార్పొరేటర్ వీరమాచినేని లలిత, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.



అజిత్‌సింగ్‌నగర్ అన్న క్యాంటీన్‌లో భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే బొండా ఉమా

అజిత్‌సింగ్‌నగర్: అజిత్‌సింగ్‌నగర్‌లోని అన్న క్యాంటీన్‌ను శుక్రవారం ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ప్రారంభించారు. అనంతరం పేదలకు భోజనం అందించారు.

మాట నిలబెట్టుకునే నాయకుడు చంద్రబాబు

వన్‌టౌన్: ఇచ్చిన మాట నిలబెట్టుకునే నాయకుడు చంద్రబాబు నాయుడని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. శుక్రవారం గాంధీజీ మునిసిపల్ హైస్కూల్ వద్ద అన్న క్యాంటీన్ ప్రారంభ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అన్న క్యాంటీన్లకు దాతలు విరివిగా విరాళాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి మాట్లాడుతూ అన్న క్యాంటీన్లను చంద్రబాబు పునఃప్రారంభించటం ఎంతో సంతోషకరమైన విషయమన్నారు. కలెక్టర్ సృజన, మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర, అదనపు కమిషనర్ మహేష్, జోనల్ కమిషనర్ రమ్యకీర్తన, టీడీపీ అధికార ప్రతినిధి నాగుల్ మీరా, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఎస్ బేగ్, మైనార్టీ సెల్ నాయకుడు మహ్మద్ ఫతావుల్లా, మహిళా నాయకులు షేక్ ఆషా, కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు కొణిజేటి రమేష్, పీతా బుజ్జి, బొప్పన భవకుమార్, తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసీ వర్కుషాపు రోడ్డు వద్ద అన్నక్యాంటీన్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే సుజనా

భవానీపురం: పశ్చిమలోని హెచ్‌బీ కాలనీ పోలీస్ స్టేషన్ సమీపంలోను, ఆర్టీసీ వర్క్‌షాపు రోడ్డులో రెండు క్యాంటీన్లను ఎమ్మెల్యే సుజనా చౌదరితో కలిసి ఎంపీ కేశినేని శివనాథ్ శుక్రవారం ప్రారంభించారు. అనంతరం పేదలకు అల్పాహారాన్ని వడ్డించారు. పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నాగుల్‌మీరా, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఎస్ బేగ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, డివిజన్ సీనియర్ నాయకులు మోరబోయిన రాంబాబు, నాయకులు వై.రామయ్య, కొణిజేటి రమేష్, పీతా బుజ్జి, బొప్పన భవకుమార్‌లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణమాస పూజలు

● వరలక్ష్మీదేవి అలంకారంలో మహాలక్ష్మి, విజయదుర్గా అమ్మవార్లు
● భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

చిట్టినగర్, ఆగస్టు 16: నగరంలోని ఆలయాలన్నీ శుక్రవారం భక్తులతో కిటకిటలాడాయి. శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రతం కావడంతో మహిళలు తెల్లవారుజామునే పుణ్యస్నానాలు ఆచరించి ఆలయాలకు తరలి వెళ్ళి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. చిట్టినగర్‌లోని మహాలక్ష్మీ అమ్మవారిని అర్చకులు అమర లింగేశ్వర ప్రసాదశర్మ వరలక్ష్మీదేవి అలంకారంలో నోట్లతో ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించుకొని కుంకుమ పూజలు చేశారు. కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. ● కొత్తపేట గంగానమ్మ దేవస్థానంలో ఉన్న గంగానమ్మ, మంగళగౌరి, శాంభవి అమ్మవార్లను వరలక్ష్మీ దేవిగా అలంకరించి విశేష పూజలు చేశారు. ఆలయ అర్చకులు అమ్మవార్లను పూలతో అలకరించి పూజలు చేశారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకొని పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు వాండ్రాసి సాధురావు భక్తులకు ప్రసాదాల వితరణ చేశారు. ● పాలఫ్యాక్టరీ చనమోలు వెంకట్రావ్ ఫ్లైఓవర్ పక్కనే ఉన్న విజయదుర్గా రామలింగేశ్వర, పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో విజయ దుర్గా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం సామూహిక కుంకుమార్చనలు చేశారు. భక్తులు అమ్మవారికి విశేష పూజలు చేశారు.



ప్రత్యేకంగా అలంకరించిన మహాలక్ష్మి అమ్మవారు, కాళీమాత ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలు

వరలక్ష్మీ దేవిగా కాళీమాత అమ్మవారు

కృష్ణలంక: త్రిశక్తి పీఠంలోని కాళీమాత అమ్మవారు శుక్రవారం భక్తులకు వరలక్ష్మీ దేవిగా దర్శనమిచ్చింది. క్రోధి నామసంవత్సరం శ్రావణమాసం రెండో శుక్రవారం కావడంతో ఆలయ ఆవరణలో మహిళలు సామూహిక వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్నారు. సాయంత్రం సామూహిక కుంకం పూజలో మహిళలు పెద్దయెత్తున పాల్గొన్నారు.

పూజకు కావాల్సిన సామాగ్రిని ఆలయ నిర్వాహకులే అందచేశారు. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు జి.పుల్లయ్య, కొప్పురావూరి జగదీష్ కుమార్, ఆధ్యాత్మిక సలహాదారు భారతుల విజయ్‌కిరణ్, ఆలయ సూపరింటెండెంట్ అచ్యుత మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.



ఆటోనగర్ టీడీపీ జిల్లా కార్యాలయంలో సర్దార్ గౌతు లచ్చన్న చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న టీడీపీ నేతలు

ఘనంగా సర్దార్ గౌతు లచ్చన్న జయంతి

వన్‌టౌన్, ఆగస్టు 16: బడుగు, బలహీనవర్గాల పెన్నిధి, స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న 115వ జయంతి కార్యక్రమాన్ని ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి లుక్కా సాయిరాం ప్రసాద్ గౌడ్, రాష్ట్ర కార్యదర్శి కొత్త నాగేంద్ర కుమార్, బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరంకి వెంకట గురుమూర్తి, తెలుగునాడు కల్లుగీత కార్మిక సంఘం నాయకులు వాక వెంకటేశ్వరరావు గౌడ్ లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు లచ్చన్న సేవలను కొనియాడారు.

వీరంకి డాంగేకుమార్, ఉప్పిడి రాము, కె. రామారావు, పామర్తి కిషోర్ బాబు, బుల్లా వెంకటేశ్వరరావు గౌడ్, పోతురాజు, ఉపేంద్ర గౌడ్, పామర్తి గోవింద్ పాల్గొన్నారు

ప్రజల ఆరోగ్యానికే ప్రాధాన్యం : ఎంపీ శివనాథ్

సత్యనారాయణపురం, ఆగస్టు 16: ప్రజా ప్రభుత్వంలో ప్రజల ఆరోగ్యానికి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. బుడమేరు వంతెన వద్ద శుక్రవారం డ్రోన్ ద్వారా లార్వా ఆపరేషన్ పనులను ఎంపీ కేశినేని శివనాథ్, బొండా ఉమామహేశ్వరరావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత రెండు నెలలుగా దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రభుత్వ తీసుకుంటున్న చర్యల కారణంగా మలేరియా కేసులు తగ్గుముఖం పట్టాయన్నారు. డ్రెయినేజీల్లో దోమలు పెట్టె లార్వాను డ్రోన్స్ ద్వారా గుర్తించి కెమికల్ స్ప్రేయింగ్ చేయిస్తున్నామని తెలిపారు. అనంతరం డ్రోన్‌ల పనితీరును ఆయన పరిశీలించారు. ప్రజల భాగస్వామ్యంతోనే దోమల నివారణ సాధ్యమన్నారు. ప్రతీ శుక్రవారం డ్రైడేగా పాటించాలన్నారు.




దోమ లార్వాను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి డీఎంవో డాక్టర్ మోతిబాబు

ఫీవర్ సర్వే నిర్వహించాలి

కృష్ణలంక: కృష్ణలంకలో జరిగిన ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని జిల్లా మలేరియా ఇన్‌చార్జి అధికారి డాక్టర్ మోతీబాబు పరిశీలించారు. కృష్ణలంక కరకట్ట ప్రాంతమైన రణదీవెనగర్, అమ్మవారి గుడిసెంటర్, మెట్ల బజారు, బండవాడి కొట్టు, బీచ్ రోడ్డు, విక్రం దుర్గయ్య వీధి, కల్పనా ప్రింట్స్ రోడ్డు పరిసర ప్రాంతాలను పరిశీలించి దోమలు కుట్టకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. వైద్య ఆరోగ్య శాఖ దోమల నిర్మూలన సర్వే కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాప్ ద్వారా అన్ని వివరాలను సేకరించి, యాప్‌లోకి అప్లోడ్ చేయాలని స్పష్టం చేశారు. ఏఎన్ఎంలు, ఆశాలు ఫీవర్ సర్వే నిర్వహించాలని, జ్వరం వున్నట్లు అనుమానం వుంటే రక్తనమూనాలను సేకరించి వైద్యపరీక్షలకు పంపించాలని స్పష్టం చేశారు. సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసరావు, మలేరియా సూపర్‌వైజర్ శరత్‌చంద్ర, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

భారతీనగర్: నాల్గవ డివిజన్ పరిధిలోని గురునానక్, అంబేద్కర్ నగర్ కాలనీల్లో స్థానిక కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు, వీఎంసీ అధికారుల సమక్షంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. సచివాలయం అధికారులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్, ఆరోగ్యశాఖ సెక్రటరీలు, స్పెషల్ ఆఫీసర్ తదితరులు పాల్గొన్నారు.

జయహో భారత్ చిత్రలేఖనం పోటీల్లో సిద్ధార్థ విద్యార్థులకు బహుమతులు



మొగల్రాజపురం, ఆగస్టు 16: 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ సంస్థ మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన జయహో భారత్ చిత్రలేఖనం పోటీల్లో తమ విద్యార్థులు బహుమతులు గెలుచుకోవడం అభినందనీయం అని పీబీ సిద్ధార్థ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చుండి వెంకటేశ్వర్లు చెప్పారు. శుక్రవారం కళాశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పురోగమన వైతాళికుల పోర్ట్రేట్ చిత్రాలు అనే అంశంలో అర్జున్ సుతార్(సీనియర్ ఇంటర్ సీఈసీ) ద్వితీయ బహుమతి, బీట్ బాక్సింగ్‌లో ఎన్. గోపిమనోజ్(సీనియర్ ఇంటర్ ఎంపీసీ) బహుమతులు సాధించారని తెలిపారు. వీరిని కళాశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది అభినందించారు.



అన్ని బంధాల్లో స్నేహబంధం గొప్పది

అమరజీవి పొట్టి శ్రీరాములు హైస్కూల్ 1996 టెన్త్ విద్యార్థుల ఆత్మీయ కలయిక

లబ్బీపేట, ఆగస్టు 16: అన్ని బంధాల్లో స్నేహబంధం చాలా గొప్పదని దాని విలువ తెలుసుకున్న వాడే గొప్ప స్నేహితుడని తిరుపతి ఇస్కాన్ ప్రతినిధి నరసింహారావు(నిత్య ముక్తాదాస్) అన్నారు. కృష్ణలంకలోని అమరజీవి పొట్టి శ్రీరాములు మున్సిపల్ హైస్కూల్ 1996 టెన్త్ విద్యార్థుల ఆత్మీయ కలయిక శుక్రవారం ఎంబీవీకే భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 28సంవత్సరాల తరువాత కలిసి గడచిన రోజలను గుర్తుచేసుకోవడం చాలా మధురమని, ప్రతి సంవత్సరం ఇదే విధంగా అందరూ కలవాలని అన్నారు. స్నేహితులంతా అప్పటి విషయాలను గుర్తుచేసుకుంటూ ఆనందంగా గడిపారు. త్వరలోనే ఒక అసోసియేషన్‌గా ఏర్పడి సమాజానికి ఉపయోగపడే మంచి కార్యక్రమాలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

బార్‌లో వృద్ధుడు అనుమానాస్పద మృతి

అజిత్‌సింగ్‌నగర్, ఆగస్టు 16 : అజిత్‌సింగ్‌నగర్‌లోని ఓ బార్ అండ్ రెస్టారెంట్‌లో ఓ వృద్ధుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. కండ్రిక కాలనీకి చెందిన మలపరెడ్డి నాగేశ్వరరావు(64) కూలిపనులు చేస్తుంటాడు. శుక్రవారం ఉదయం పనికి వెళ్తున్నానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లాడు. మధ్యాహ్నం అజిత్‌సింగ్‌నగర్‌లోని రూపలక్ష్మీసాయి బార్ అండ్ రెస్టారెంట్‌లో మద్యం తాగడానికి వెళ్లాడు. మద్యం సేవిస్తూ అక్కడికక్కడే కుప్పకూలిపోయి కొద్ది సేపటికే మృతి చెందాడు. బార్ సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించి అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా అమ్మిశెట్టి వాసు పుట్టినరోజు వేడుకలు

పాతరాజరాజేశ్వరిపేట, ఆగస్టు 16 : జనసేన పార్టీ విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయ కర్త, పార్టీ రాష్ట్ర కార్యదర్శి అమ్మిశెట్టి వాసు పుట్టినరోజు వేడుకలు శుక్రవారం పార్టీ నేతలు, కార్యకర్తల మధ్య ఘనంగా జరిగింది. స్థానిక 34వ డివిజన్, 56వ డివిజన్లలో పార్టీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పాల్గొన్న అమ్మిశెట్టి వాసు కేక్ కట్ చేశారు. ఆకుల రవిశంకర్, మల్లెపు విజయలక్ష్మీ, గుర్రం తాతయ్య, రెడ్డిపల్లి గంగాధర్, అనిత, శివ, లీలారావు, శివకుమార్, దామోదర్‌రావు, భవిశెట్టి శ్రీను, వాసు, ఆది, తదితరులు పాల్గొన్నారు.



34వ డివిజన్‌లో కేక్ కట్ చేస్తున్న వాసు

మొగల్రాజపురం: జనసేన రాష్ట్ర కార్యదర్శి అమ్మిశెట్టి వాసు జన్మదినం సందర్భంగా 7వ డివిజన్ బందిలదొడ్డి సెంటర్‌లో సాదిరెడ్డి శ్రీను, భాగ్యరాజు ఆధ్వర్యంలో కేక్ కటింగ్ కార్యక్రమం జరిగింది. అనంతరం మహిళలకు చీరలు పంపిణీ చేశారు.



శ్రీకృష్ణుడే అవార్డుని తెచ్చాడు

కార్తికేయ 2 చిత్రానికి జాతీయ పురస్కారం దక్కడం పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థకు గొప్ప విజయం అని ఆ చిత్ర నిర్మాత టీజీ విశ్వప్రసాద్ చెప్పారు. నిఖిల్ సిద్ధార్థ్ హీరోగా చందూ మొండేటి దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా పురస్కారం గెలుచుకున్న సందర్భంగా చిత్రబృందం మీడియాతో ముచ్చటించింది. టీజీ విశ్వప్రసాద్ మాట్లాడుతూ 'కార్తికేయ 2' మొదలుపెట్టినప్పుడే పెద్ద సినిమా అనుకున్నాం. ఇంత సక్సెస్‌ను ఊహించలేదు. జాతీయ పురస్కారం దక్కడం మా సంస్థకు చాలా గొప్ప విషయం' అన్నారు. ఈ అవార్డునే శ్రీకృష్ణుడే తీసుకొచ్చాడని భావిస్తున్నాను అని అభిషేక్ అగర్వాల్ చెప్పారు. నేషనల్ అవార్డ్ మాపై బాధ్యతను మరింత పెంచింది అని చందు మొండేటి తెలిపారు. ప్రస్తుతం నాగచైతన్య హీరోగా తను తీస్తున్న 'తండేల్' పూర్తయ్యాక 'కార్తికేయ 3' ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. తను హీరోగా నటించిన 'కార్తికేయ 2' జాతీయ స్థాయిలో సత్తా చాటడం ఆనందంగా ఉందని హీరో నిఖిల్ చెప్పారు.

విజేతలకు ప్రముఖుల అభినందనలు

జాతీయ చలన చిత్ర పురస్కారాల్లో ఉత్తమ ప్రాంతీయ చిత్రాల విభాగంలో తెలుగు నుంచి కార్తికేయ - 2 అవార్డు పొందటం సంతోషకరం. ఉత్తమ నటి నిత్యమీనన్, ఉత్తమ నటుడు రిషబ్ శెట్టి, ఉత్తమ నృత్య దర్శకుడిగా ఎంపికైన జానీ మాస్టర్‌కు హృదయపూర్వక అభినందనలు.

- పవన్ కల్యాణ్, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి

70వ జాతీయ చలనచిత్ర పురస్కార విజేతలకు అభినందనలు. ఉత్తమ నటుడు రిషబ్‌శెట్టి, ఉత్తమ నటి నిత్యామేనన్.. ఉత్తమ చిత్రం 'ఆట్టమ్' , కార్తికేయ 2' మేకర్స్‌కు అలాగే ఇతర పురస్కార గ్రహీతలందరికీ అభినందనలు

- చిరంజీవి

రిషబ్‌శెట్టికి అభినందనలు. 'కాంతార' చిత్రానికి ఉత్తమ నటుడి పురస్కారం అందుకోవడం సంతోషంగా ఉంది. అందుకు అవసరమైన అన్ని అర్హతలు ఉన్న వ్యక్తివి. 'కాంతార' చిత్రంలో నీ అభినయం గుర్తుకు వస్తే ఇప్పటికీ నాకు గూస్ బంప్స్ వస్తున్నాయి.

- ఎన్టీఆర్

జాతీయ చలనచిత్ర అవార్డుల్లో.. దుమ్మురేపిన సౌత్ సినిమా

జాతీయ చలనచిత్ర పురస్కారాలను కేంద్రం శుక్రవారం ప్రకటించింది. ఉత్తమ చిత్రం అవార్డు మలయాళ సినిమా 'ఆట్టమ్'ను వరించగా, ఉత్తమ నటుడి పురస్కారం 'కాంతార' సినిమాకు గాను రిషబ్ శెట్టికి దక్కింది. ఉత్తమ వినోదాత్మక చిత్రంగా సైతం 'కాంతార' నిలిచింది. ఉత్తమ నటి పురస్కారానికి నిత్య మేనన్(తిరుచిత్రంబళం), మానసి పరేఖ్ (కచ్ ఎక్స్ ప్రెస్)ను జ్యూరీ సంయుక్తంగా ఎంపిక చేసింది. ప్రాంతీయ చిత్రాల విభాగంలో ఉత్తమ తెలుగు చిత్రంగా 'కార్తికేయ 2' నిలిచింది. ఉత్తమ కన్నడ చిత్రంగా కేజీఎఫ్-2 అవార్డు దక్కించుకుంది. ఉత్తమ హిందీ చిత్రంగా 'గుల్‌మొహర్' నిలిచింది. 'పొన్నియిన్ సెల్వన్-1' చిత్రానికి నాలుగు పురస్కారాలు దక్కాయి. మలయాళ, తమిళ చిత్రాలకు ఐదు చొప్పున అవార్డులు ప్రకటించగా, కన్నడ సినిమాకు మూడు పురస్కారాలు వచ్చాయి. తెలుగుకు దక్కింది ఉత్తమ ప్రాంతీయ చిత్రం ఒక్కటే! 2022 డిసెంబర్ 31 నాటికి సెన్సార్ అయిన చిత్రాలకుగాను ఈ అవార్డులను కేంద్రం ప్రకటించింది. 2022లో దేశవ్యాప్తంగా సుమారు 28 భాషల్లో విడుదలైన 300కు పైగా చిత్రాల నుంచి అందిన నామినేషన్లను 11 మందితో కూడిన జ్యూరీ పరిశీలించి ఈ అవార్డులను ప్రకటించింది.

న్యూఢిల్లీ, (ఆంధ్రజ్యోతి)

నాలుగోసారి దక్షిణాది హీరోలదే హవా

తాజాగా రిషబ్ శెట్టిని జాతీయ ఉత్తమ నటుడి పురస్కారం వరించడంతో దక్షిణాది చిత్రపరిశ్రమ అరుదైన ఘనతను సాధించినట్లైంది. వరుసగా నాలుగుసార్లు దక్షిణాది హీరోలు జాతీయ ఉత్తమ నటుడి పురస్కారాన్ని దక్కించుకున్నారు. 2019లో ధనుష్‌కు మనోజ్ బాజ్‌పాయ్‌తో కలసి ఉత్తమ నటుడి పురస్కారం దక్కింది. 'అసురన్' చిత్రానికి గాను ధనుష్ ఉత్తమ నటుడి పురస్కారానికి ఎంపికయ్యారు.







2020లోనూ సూర్య, అజయ్ దేవ్‌గణ్ ఉత్తమ నటుడి పురస్కారానికి ఎంపికయ్యారు. 'సూరారై పొట్రు' (తెలుగులో 'ఆకాశం నీ హద్దురా') చిత్రానికి గాను సూర్య ఉత్తమ నటుడి పురస్కారానికి ఎంపికయ్యారు. 2021లో 'పుష్ప' చిత్రానికి గాను అల్లు అర్జున్ ఉత్తమ నటుడిగా ఎంపికయ్యారు. ఇప్పుడు 2022కి గాను రిషబ్‌శెట్టిని ఈ పురస్కారం వరించింది. అంతకు ముందు 2010లో కూడా 'ఆడుకాలం' చిత్రానికి గాను ధనుష్ ఉత్తమ నటుడిగా ఎంపికయ్యారు. ఈసారి కూడా ఉత్తమ నటుడి పురస్కారానికి దక్షిణాది నుంచి మమ్ముట్టి, రిషబ్ శెట్టి, బాలీవుడ్ నుంచి విక్రాంత్ మాసే (ట్వల్త్ ఫెయిల్) పోటీ పడగా అదృష్టం రిషబ్‌ను వరించింది. మమ్ముట్టి 'నాన్పకల్ నేరట్టు మయక్కం, రోషాక్ రెండు చిత్రాలతో బరిలో నిలిచినా ఫలితం నిరాశపరిచింది.

తెలుగు సినిమాకు అన్యాయం జరిగిందా?



జాతీయ చలనచిత్ర అవార్డులు శుక్రవారం ప్రకటించారు. గత ఏడాది తెలుగు సినిమాకు ఉత్తమ జాతీయ నటుడు అవార్డు సహా తొమ్మిది అవార్డులు రావడంతో కాలరు ఎగరేసిన తెలుగు ప్రేక్షకుడు ఈసారి ప్రకటించిన అవార్డుల్లో తెలుగు సినిమాకు ఒక్కటంటే ఒక్క అవార్డ్ కూడా లేకపోవడం చూసి ఆశ్చర్యపోయాడు. ఇలా ఎందుకు జరిగిందని ఆలోచనలో పడ్డాడు.

తెలుగు రాష్ట్రాలు విడిపోయిన తర్వాత సినిమాలకు ప్రభుత్వ అవార్డులు అన్నవి లేనేలేవు. ఇప్పుడైనా ఇస్తారో, ఇవ్వరో తెలియని పరిస్థితి. ఫిల్మ్ ఫేర్ వంటి ప్రైవేట్ అవార్డులను పక్కన పెడితే, సినిమా ప్రముఖులు ఆశించేది, రావాలని కోరుకునేది జాతీయ చలనచిత్ర అవార్డులే. జాతీయ అవార్డ్ పొందితే కెరీర్ పరంగా ఏదో సాధించామనే సంతృప్తి చాలా మందికి ఉంటుంది. అయితే జాతీయ అవార్డు అందుకునే స్థాయి కలిగిన చిత్రాలు తెలుగులో ఎన్ని వస్తున్నాయనేది ఒక ప్రశ్న. తెలుగు చిత్ర పరిశ్రమలో టాలెంట్‌కు కొదువ లేదు. సినీ ప్రపంచమంతా తెలుగు చిత్రపరిశ్రమ వైపే చూస్తున్న రోజులివి. కొత్త తరహాగా ఆలోచించడం, కష్టపడే తత్వం తెలుగు వారికి ఎక్కువ. అయినా సరే కొత్త తరహా చిత్రాల గురించి ఆలోచించకుండా కమర్షియల్ చిత్రాలపై మోజుతో నిర్మాతలు పరుగులు తీస్తున్నారన్నది ఎవరూ కాదనలేని సత్యం. కాకపోతే ఈ ఏడాది ఢిల్లీకి పంపిన చిత్రాల్లో అవార్డుకు అర్హమైనవి కొన్ని ఉండడం వాటికి ఒక్క అవార్డ్ కూడా రాకపోవడం చర్చనీయాంశం అయింది.

కరోనా కారణంగా..

శుక్రవారం ప్రకటించిన నేషనల్ అవార్డ్స్ 2022 సంవత్సరం లో సెన్సార్ పూర్తి చేసుకున్న చిత్రాలకు సంబంధించినవి. వాస్తవానికి 2023 మే 3న ఈ అవార్డులను ప్రదానం చేయాలి. అయితే కరోనా తర్వాత జాతీయ చలన చిత్ర అవార్డుల షెడ్యూల్‌లో మార్పులు జరిగియి. అవార్డుల ఎంపిక, ప్రదాన కార్యక్రమం ఆలస్యమవుతూ వస్తున్నాయి. లోకసభకు జరిగిన ఎన్నికల కారణంగా జాతీయ అవార్డులు ఈసారి మరింత ఆలస్యమయ్యాయి. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడానికి ముందే అవార్డుల ఎంపిక ప్రక్రియ మొదలైనా ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో దానిని మధ్యలోనే ఆపేసి ఎన్నికల ఫలితాలు వెల్లడి అయ్యాక మళ్లీ మొదలుపెట్టారు. ఇప్పుడు ప్రకటించిన అవార్డులను అక్టోబరు నెలలో విజేతలకు అందజేస్తారని సమాచారం.

ఇరవై సినిమాలు... ఒకే ఒక్క అవార్డ్

జాతీయ అవార్డుల కోసం తెలుగు నిర్మాతలు ఈసారి పెద్ద సంఖ్యంలోనే ఎంట్రీలు పంపారు. ఆ జాబితాలో ఉన్న సినిమాలు ఏమిటంటే 1. రైటర్ పద్మభూషణ్, 2. సీతారామం 3. అంటే సుందరానికి.. 4. విరాటపర్వం 5. యశోద 6. రాధేశ్యామ్ 7. సర్కారు వారి పాట 8. మర్రి చెట్టు 9. కుదిరామ్ బోస్ 10. ఇట్లు మారేడుమిల్లి 11. కార్తికేయ 2 12. డీజె టిల్లు 13. ఇక్షూ 14. ధమాకా 15. చదువే నా ఆయుధం 16. బింబిసార 17. భారత పుత్రులు 18. ఎట్ లవ్ 19. అశోకవనంలో అర్జున కల్యాణం 20. అల్లూరి. ఇన్ని సినిమాలు పంపిస్తే వాటిల్లో ఒక్కటంటే ఒక్కదానికి కూడా ఏ అవార్డూ దక్కలేదు. ఇది ఆలోచించాల్సిన అంశం. 'కార్తికేయ 2' చిత్రానికి ఇచ్చారు కదా అని అంటే అది ఉత్తమ ప్రాంతీయ చిత్రం కేటగిరిలో ఇచ్చిన అవార్డు. ఆ అవార్డు తెలుగు సినిమాకే ఇవ్వాలి కనుక కంటితుడుపు అన్నట్లు 'కార్తికేయ 2'కు ప్రకటించి చేతులు దులుపేసుకుంది అవార్డుల కమిటీ.

ఆ రెండు సినిమాలను పక్కన పెట్టేశారా?

'యుద్ధం రాసిన ప్రేమ లేఖ' అనే ట్యాగ్‌లైన్‌తో రూపుదిద్దుకొన్న చిత్రం 'సీతారామం' వైజయంతీ మూవీస్ సంస్థ సగర్వంగా సమర్పించిన ఈ సినిమా సూపర్ హిట్ అయింది. ప్రేక్షకులను తిరిగి థియేటర్లకు రప్పించిన సినిమా ఇదని టాలీవుడ్ సెలబ్రేట్ చేసుకుంది. చక్కని కథ, కథనాలతో రూపుదిద్దుకున్న 'సీతారామం'కు జాతీయ అవార్డు ఖాయం అని అందరూ అనుకున్నారు. తీరా శుక్రవారం ప్రకటించిన అవార్డుల జాబితాలో ఆ సినిమా ఊసే లేదు. విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసిన విషయం ఏమిటంటే 'సీతారామం' చిత్రం చివరి వరకూ పోటీలో ఉంది. అయితే అందులో సుమంత్ పోషించిన పాత్ర పాకిస్థాన్‌కు అనుకూలంగా ఉందనే సాకుతో అవార్డుల కమిటీ సినిమాను పక్కను పెట్టేసిందట. అలాగే నక్సలైట్లకు అనుకూలంగా, నక్సలిజాన్ని సమర్థించే రీతిలో 'విరాటపర్వం' చిత్రం ఉందంటూ ఆ సినిమాను కూడా పక్కన పెట్టేశారని అంటున్నారు. కల్యాణ్‌రామ్ నటించిన 'బింబిసార' చిత్రం కూడా కొత్త తరహా ప్రయత్నం. ఆ సినిమాను కూడా అవార్డుల కమిటీ పట్టించుకోలేదు. జ్యూరీలో తెలుగు సభ్యుడు కనీసం ఒకరున్నా తెలుగు సినిమాకు ఇలా అన్యాయం జరిగేది కాదనీ, ఫైట్ చేసి ఏదో ఒక సినిమాకు అవార్డ్ తీసుకువచ్చేవారని అంటున్నారు. తెలుగు చిత్ర పరిశ్రమకు సంబంధించిన సభ్యులు ఎవరూ లేకపోవడంతో . ఇతర భాషల వారు పెత్తనం చెలాయించి, అవార్డుల పరంగా తెలుగు సినిమాకు అన్యాయం చేశారని చిత్ర ప్రముఖులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వారికి అవార్డులు ఇచ్చారు కానీ..

తెలుగు ప్రేక్షకులకు సుపరిచితులైన ముగ్గురికి ఈసారి జాతీయ అవార్డులు రావడం కొంతలో కొంత ఉపశమనం. అయితే వారు అవార్డులు పొందింది తెలుగు చిత్రాలకు కాదు.. తెలుగేతర చిత్రాలకు.

నిత్యా మీనన్‌కు జాతీయ ఉత్తమ నటిగా అవార్డ్ వచ్చింది. అయితే తెలుగు సినిమా కాదు 'తిరుచిత్రంబలం' తమిళ చిత్రం. అలాగే ఎ.ఆర్.రెహమాన్ కూడా తమిళ చిత్రం 'పొన్నియిన్ సెల్వన్ 1' చిత్రానికే ఉత్తమ నేపథ్య సంగీతం అవార్డ్ పొందారు. అదే విధంగా కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ కూడా తమిళ సినిమాతోనే జాతీయ అవార్డ్ పొందారు.

70 వ జాతీయ చలనచిత్ర అవార్డులు

- **ఉత్తమ చిత్రం:** 'ఆట్టమ్ (మలయాళం)
- **ఉత్తమ నటుడు:** రిషబ్‌శెట్టి (కాంతార- కన్నడం)
- **ఉత్తమ నటి:** నిత్యా మీనన్ (తిరుచిత్రంబళం - తమిళం), మానసి పరేఖ్ (కచ్ ఎక్స్‌ప్రెస్- గుజరాతీ)
- **ఉత్తమ దర్శకుడు:** సూరజ్ బర్జాత్యా (ఉంఛాయి- హిందీ)
- **హోల్‌సమ్ ఎంటర్‌టైన్‌మెంట్ ఫిల్మ్:** కాంతార (కన్నడ)
- **ఉత్తమ విజువల్ ఎఫెక్ట్స్ ఫిల్మ్:** బ్రహ్మాస్త్ర పార్ట్ 1 - శివ
- **ఉత్తమ నూతన దర్శకుడు:** ప్రమోద్‌కుమార్- (ఫౌజ- హరియాన్వి)
- **ఉత్తమ సహాయ నటి:** నీనా గుప్తా (ఉంఛా- హిందీ)
- **ఉత్తమ సహాయ నటుడు:** పవన్ రాజ్ మల్హోత్రా- (ఫౌజ)
- **ఉత్తమ బాలనటుడు:** శ్రీపథ్ (మాలికాపురం- మలయాళం)
- **ఉత్తమ ఛాయాగ్రాహకుడు:** రవి వర్మన్ (పొన్నియిన్ సెల్వం 1)
- **ఉత్తమ స్క్రీన్ ప్లే రచయిత:** ఆనంద్ ఏకార్షి(ఆట్టమ్)
- **ఉత్తమ సంభాషణల రచయితలు:** అర్పితా ముఖర్జీ, రాహుల్ వి చిట్టేలా (గుల్ మొహర్)
- **ఉత్తమ సంగీత దర్శకుడు (పాటలు):** ప్రీతమ్ (పొన్నియిన్ సెల్వం 1)
- **ఉత్తమ సంగీత దర్శకుడు (నేపథ్యం):** ఏ.ఆర్.రెహమాన్ (పొన్నియిన్ సెల్వం 1)
- **ఉత్తమ గీత రచయిత:** నౌషాద్ సదర్ ఖాన్-(ఫౌజ)
- **ఉత్తమ నేపథ్య గాయకుడు:** అర్జిత్ సింగ్ (బ్రహ్మాస్త్ర 1 - శివ)
- **ఉత్తమ గాయని:** బాంబే జయశ్రీ (సౌదీ వెల్లక్క సీసీ 225 -2009)
- **ఉత్తమ ప్రాంతీయ చిత్రం:** (కార్తికేయ 2 - తెలుగు)
- **ప్రత్యేక ప్రశంస:** నటుడు మనోజ్ వాజ్‌పాయ్ (గుల్ మోహర్- హిందీ), సంగీత దర్శకుడు - సంజోయ్ సలీల్ చౌదరి (కదికన్ - మలయాళం)
- **ఉత్తమ ఎడిటర్:** మహేశ్ భువనేండ్ (ఆట్టమ్)
- **ఉత్తమ యాక్షన్ డైరెక్టర్:** అన్బరివు (కేజీఎఫ్ 2'
- **బెస్ట్ బుక్ ఆన్ సినిమా:** కిశోర్‌కుమార్ (ది అల్టిమేట్ బయోగ్రఫీ)- రచయితలు- అనిరుద్ధ భట్టాచార్జీ, పార్థివ్ ధార్
- **బెస్ట్ క్రిటిక్:** దీపక్ దుహా (హిందీ)

నవ్య
కుటుంబ కదంబం
శనివారం • 17 ఆగస్టు 2024

బీరాకుల మహిమ!

ఒకప్పుడు మొక్కల మీద ఆధారపడి ఆహారాన్ని తీసుకునే భారతీయులకి సహజంగా ఆహార పీచు (డయటరీ ఫైబర్) చాలినంత అందేది. కానీ కొత్త రకాల వంటలు అందుబాటులోకి వచ్చిన తర్వాత పీచు తగ్గిపోయింది. ఈ పీచు తగినంత పొందటానికి బీరాకులు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి.

క్షేమ కుతూహలం

సొరకాయ మన శరీరానికి చలువ చేస్తుంది. కానీ దానిలో చింతపండు, ఇతర మసాలాలు వేస్తే దాని గుణం మారిపోతుంది. శరీరానికి వేడి చేస్తుంది. ఒకప్పుడు మన పూర్వీకులు తినే ఆహారం ఈ విధంగా ఉండేది కాదు. కూరలతో పాటుగా లేత ఆకులను కూడా ప్రత్యేకమైన పద్ధతిలో వండకొనేవారు. ఈ వండే విధానాన్ని తెలుసుకుందాం.



బీరాకుల పచ్చడి

లేత బీరాకులను మజ్జిగలో ఉడకపెట్టాలి. దానిని ఇంగువ నూనెలో మగ్గబెట్టాలి. ఆ తర్వాత తాలింపును, మగ్గపెట్టిన ఆకులను మిక్సీలో వేసి తిప్పితే బీరాకుల పచ్చడి తయారవుతుంది.

బీరాకుల కూర...


- బీర తీగ కొసకు ఉండే లేత ఆకులను ఎంచుకొని కోసుకోవాలి. వాటిని నీటితో శుభ్రపరచాలి.
- ఇలా శుభ్రపరిచిన ఆకులను చేతితోనే చిన్న చిన్న ముక్కలుగా చేసి- మజ్జిగలో నానబెట్టాలి.
- ఇలా నానబెట్టిన మిశ్రమంలో- అల్లం, ధనియాల పొడి, సైంధవ లవణం కలపాలి. దానిని పొయ్యి మీద పెట్టి ఆకులు మెత్తపడేదాకా ఉడికించాలి.
- మజ్జిగను వడగట్టి- ఆకులను బయటకు తీసుకురావాలి. వాటిని ఒక మూకుడులో నూనెలో వేసి వేయించాలి. ఆ తర్వాత తాలింపు పెట్టాలి.
- కొందరు ఈ కూరలో ఉడికించిన మినపప్పు లేదా శనగపప్పు లేదా వేయించిన మినప వడియాలు కలుపుతారు.

క్షేమశర్మ- ఈ కూరను 'తనుపుష్టిదాయికా' (శరీరానికి అమితమైన పుష్టినిచ్చేది)గా పేర్కొన్నాడు. ఇక వైద్య శాస్త్ర ప్రకారం చూస్తే- బీర ఆకులు- శరీరంలోని నీటి శాతాన్ని తొలగిస్తాయి. ఎసిడిటీని తొలగించి జీర్ణశక్తిని పెంచుతాయి. కాలేయానికి సంబంధించిన వ్యాధుల నివారణలో ఉపకరిస్తాయి. శరీరంలో విషదోషాలను కూడా తొలగిస్తాయి.

- అయితే ప్రస్తుతం మనకు బీర ఆకులు అందుబాటులో ఉండటం లేదు. పొలాలలో బీర పాదులు ఉన్నవారికి కూడా లేత ఆకుల విశిష్టత తెలియదు. ఈ లేత ఆకుల కూర ప్రచారంలోకి వస్తే చాలా మందికి అనేక రకాల వ్యాధులు తగ్గిపోతాయి.

• గంగరాజు అరుణాదేవి

తల్లులు ? నేర్పుతున్న పాఠం!



పిల్లలకు తల్లులకు మధ్య అనుబంధం ఏర్పడటానికి చనుబాలు ఒక కారణమంటారు మానసిక శాస్త్రవేత్తలు. తల్లి పాలు త్రాగటం వల్ల పిల్లలకు పోషకాలు అందటమే కాకుండా- పిల్లలు తమ తల్లులకు దగ్గర అయ్యే అవకాశముందంటారు. అయితే ఇది కేవలం మనుషులకు మాత్రమే కాదు- జంతువుల విషయంలో కూడా నిజమని డబ్లిన్ జూ అధికారులు పేర్కొంటున్నారు. ఈ జూలో 'ముజుర్' అనే 19 అరుదైన ఒరంగుటాన్ (ఒక రకం కోతి) ఉంది. మనుషులకు అతి దగ్గర పోలికలు ఉన్న జంతువుల్లో ఒరంగుటాన్‌ను ప్రధానంగా పేర్కొంటారు. ముజుర్‌కు ఇంతకు ముందు రెండు సార్లు పిల్లలు పుట్టాయి. కానీ వాటితో ముజుర్‌కు సరైన సంబంధాలు ఏర్పడలేదు. దీనికి కారణం ముజుర్‌కు పాలు ఇవ్వటం సరిగ్గా రాకపోవటమనేది ఒక కారణంగా జూ అధికారులు భావించారు. జూలై చివరి వారంలో మళ్లీ ముజుర్‌కు ఒక పిల్ల పుట్టింది. ఆ పిల్లను ముజుర్ ప్రేమగా చూసుకుంటోంది. కానీ పాలు ఇవ్వటం మాత్రం రావటం లేదు. దీనితో ముజుర్‌కు పాలు ఇవ్వటం ఎలాగో నేర్పటానికి 30 మంది తల్లులతో ఒక టీమ్‌ను ఏర్పాటు చేశారు. వీరు ముజుర్ ఉన్న ఎన్‌క్లోజర్ ముందు కూర్చుని తమ పిల్లలకు పాలు ఇస్తూ ఉంటారు. వీరిని చూసి ముజుర్ తన పిల్లకు పాలు ఇవ్వటం నేర్చుకుంటుందని జూ అధికారులు భావిస్తున్నారు. "వీరిని చూడటానికి ముజుర్ చాలా ఆసక్తి చూపిస్తోంది. కొన్ని సార్లు వారిని అనుకరించటానికి ప్రయత్నిస్తోంది. ఒక విధంగా మా ప్రయత్నాలు విజయవంతమయినట్లే" అని జూ అధికారులు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో తల్లులు కూడా చాలా ఉత్సాహంగా పాల్గొంటున్నారు. "నా పిల్లలకు చెప్పటానికి ఇది ఒక ఆసక్తికరమైన కథగా నాకు అనిపించింది. ఒక తల్లి మరొక తల్లికి ఇలాంటి సాయం చేయగలదని నాకు ఇప్పటి దాకా తెలియదు" అంటున్నారు నోరా మర్ఫీ అనే ఒక తల్లి. జూ చేస్తున్న ఈ వినూత్న ప్రయోగం విజయవంతం కావాలని కోరుకుందాం. •

మోదీ.. ఓ రాఖీ!

ఆర్ఎస్ఎస్ ప్రచారక్.. పాకిస్తానీ మహిళ. ముప్ఫయ్యేళ్ళ క్రితం వారి మధ్య చిగురించిన సోదర సోదరీ బంధం ఆయన ముఖ్యమంత్రి, ఆ తరువాత ప్రధానమంత్రి అయ్యాక కూడా కొనసాగుతోంది. ఈ ఏడాది మరోసారి నరేంద్రమోదీకి కట్టడానికి ఖమర్ మెహ్సాన్ షేక్ రాఖీని సిద్ధం చేశారు. ఆప్యాయతానురాగాలకు దేశాలు, వాటి మధ్య ద్వేషాలు అవరోధాలు కావని వారి అనుబంధం రుజువుచేస్తోంది.



"శ్రావణ పౌర్ణమి వస్తోందంటే నాలో ఉత్సాహం, ఉద్వేగం కలుగుతాయి. ఈ ఏడాది నా సోదరుడి కోసం ఎలాంటి రాఖీ తయారు చెయ్యాలి?... మనసంతా అదే ఆలోచన. ఎందుకంటే సామాన్యుడిగా నాకు పరిచయమైన సోదరుడు... ఇప్పుడు ఎంతో ఎత్తు ఎదిగిపోయారు. కానీ ఆయనలోని ఆప్యాయత అలాగే ఉంది" అంటారు ఖమర్ మెహ్సాన్ షేక్. ఆమెది పాకిస్తాన్‌లోని కరాచీ నగరానికి చెందిన ముస్లిం కుటుంబం. అక్కడే పుట్టి పెరిగారు. 1981లో... మెహ్సాన్ షేక్‌తో ఆమెకు వివాహమయింది. ఆ దంపతులు భారతదేశానికి వలస వచ్చారు. కొన్నాళ్ళు ఢిల్లీలో ఉన్నారు. తరువాత గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో స్థిరపడ్డారు. "అది 1991. అప్పటి గుజరాత్ గవర్నర్ డాక్టర్ స్వరూప్ సింగ్‌తో మాకు పరిచయం ఉంది. ఒకసారి ఎయిర్‌పోర్టులో మా దంపతులకు ఆయన ఎదురుపడ్డారు. మమ్మల్ని చూడగానే సాదరంగా పలకరిస్తూ... అక్కడ ఉన్న ఒక వ్యక్తిని మాకు పరిచయం చేశారు. నన్ను ఉద్దేశించి... "ఈమె నాకు కుమార్తె లాంటిది" అని చెప్పారు. అప్పుడు ఆ వ్యక్తి "అయితే ఈమె నాకు సోదరి. ఎలా ఉన్నారు సోదరీ?" అని నన్ను పలకరించారు. అలా ఆయన నాకు దేవుడిచ్చిన సోదరుడయ్యారు. ఆ తరువాత వచ్చిన రక్షాబంధన్ పర్వదినాన ఆయనకు తొలిసారిగా రాఖీ కట్టాను. ఆయనే మన ప్రస్తుత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ. అప్పట్లో ఆయన ఆర్ఎస్ఎస్ ప్రచారక్‌గా ఉండేవారు" అని గుర్తు చేసుకున్నారు ఖమర్.

ఆ మాట విని మోదీ నవ్వారు, కానీ...

ఆ తరువాత ప్రతి సంవత్సరం మోదీ ఎక్కడున్నా రాఖీ పండగ రోజున తప్పకుండా కలుసుకోవడం, రాఖీ కట్టడం ఆమెకు ఆనవాయితీ అయిపోయింది. అలాంటి ఒక సందర్భంలో "ఏదో ఒక రోజు మీరు గుజరాత్ ముఖ్యమంత్రి కావాలని నేను ఆ భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను" అని



మోదీతో అన్నారు ఖమర్. ఆ మాట విని మోదీ నవ్వారు. కొన్నేళ్ళ తరువాత ఆమె ప్రార్థన ఫలించింది. "ఆ తరువాత ఆయనను కలుసుకున్నప్పుడు... "ఈసారి నీ సోదరుడి కోసం ఏం కోరుకుంటున్నావు?" అని అడిగారు. "దేశానికి ప్రధానమంత్రి కావాలని పార్థిస్తున్నాను" అని చెప్పాను. నేను ఎంతో అదృష్టవంతురాలిని. ఆ కోరిక కూడా తీరింది. ఇప్పుడు మూడోసారి మోదీ ప్రధాని అయ్యారు. అయినా ఆయన వైఖరిలో ఎలాంటి మార్పూ లేదు. ఆయనలో గొప్ప నాయకత్వ లక్షణాలున్నాయనేది మొదటి నుంచీ నా విశ్వాసం. అది పదేపదే రుజువు అవుతూనే ఉంది" అని చెప్పారామె. "కొవిడ్ కారణంగా... 2020, 2021, 2022 సంవత్సరాల్లో మోదీకి వ్యక్తిగతంగా రాఖీలు కట్టడం కుదరలేదు. పోస్టులో పంపించాను. అవి అందినట్టు సమాచారం వచ్చింది. కిందటి ఏడాది స్వయంగా ఢిల్లీ వెళ్ళి, రాఖీ కట్టాను. నేను రాఖీలను మార్కెట్‌లో ఎప్పుడూ కొనలేదు. ప్రతి సంవత్సరం రాఖీ పౌర్ణమికి ముందు స్వయంగా తయారు చేస్తాను. ఈ ఏడాది కూడా ఇప్పటికే సుమారు పది రాఖీలు రూపొందించాను. వాటిలో నాకు బాగా నచ్చినదాన్ని నా సోదరుడు మోదీ చేతికి కడతాను" అన్నారు ఖమర్. "ఇది నేను ఆయనకు కట్టబోయే 30వ రాఖీ. కాబట్టి ఏదైనా ప్రత్యేకంగా చెయ్యాలనుకున్నాను. వెల్వెట్‌తో దాన్ని తయారు చేశాను. అలంకరణల కోసం ముత్యాలను, మెటల్ ఎంబ్రాయిడరీని, టిక్కీలను ఉపయోగించాను. ఈ సోమవారం రాఖీ పౌర్ణమి. ఒక రోజు ముందే నేను, నా భర్త ఢిల్లీ చేరుకోవడానికి టిక్కెట్లు బుక్ చేసుకున్నాం. ఈ ఏడాది వ్యవసాయం గురించి ఒక పుస్తకాన్ని కూడా ఆయనకు అందజేస్తాను. ఆయనకు పుస్తకపఠనం చాలా ఇష్టం" అంటున్న ఈ సోదరి... తన సోదరుడి కోసం ఇప్పుడు ఏం కోరుకుంటున్నారు? "ఆయన ఎల్లప్పుడూ ఆరోగ్యంగా ఉండాలి. దీర్ఘాయుష్షుతో జీవించాలి. పదేళ్ళపాటు ప్రజా సంక్షేమానికి ఆయన చేసిన సేవలు భవిష్యత్తులో మరింత గొప్పగా కొనసాగాలి అని రోజూ ప్రార్థిస్తున్నాను" అంటున్నారు ఖమర్. •

వంటిల్లు

ఒకో ప్రాంతంలో ఒకో వంటకం బాగా ప్రసిద్ధి చెందుతుంది. దానికి ముందో.. వెనకో.. ఆ ప్రాంతం పేరు కూడా చేరుతుంది. ఎన్నేళ్లు అయినా ఆ వంట ఆ పేరుతోనే ప్రసిద్ధి చెందుతుంది. అలాంటి కొన్ని వంటలను మీకు పరిచయం చేస్తున్నాం...

రుచిలో వారసత్వం

బచ్కా

మన ఆహారంలో తృణ ధాన్యాలకు ప్రాధాన్యత చాలా ఉంది. అందుకే ఉత్తర భారత దేశంలో పచ్చి బఠానీలతో ఎక్కువ వంటలు చేస్తూ ఉంటారు. అలాంటి ఒక వంటకం బీహార్‌కు చెందిన బచ్కా. దీనిని సాయంత్రం ఒక చిరుతిండిగా మాత్రమే కాకుండా- కొన్ని సార్లు మధ్యాహ్నం భోజనంలో కూడా తింటారు.



కావాల్సిన పదార్థాలు

బియ్యపు పిండి- అరకేజీ, పచ్చి బఠానీలు- పావు కిలో, మిరియాల పొడి- ఒక టేబుల్ స్పూన్, జీలకర్ర పొడి- రెండు టేబుల్ స్పూన్‌లు, ఉప్పు- తగినంత, ఆవ నూనె- తగినంత

తయారీ విధానం

1) బియ్యపు పిండిని ఒక గిన్నెలోకి తీసుకోవాలి. దానిలో మిరియాల పొడి, జీలకర్ర, ఉప్పు వేసి ముద్దగా చేయాలి.

2) ఆ ముద్దలో పచ్చి బఠానీలను కలపాలి. ఈ మిశ్రమాన్ని 30 నిమిషాల పాటు నానబెట్టాలి.

3) ఒక మూకుడులో నూనెను తీసుకొని వేడి చేయాలి. మిశ్రమాన్ని చిన్న చిన్న ఉండలుగా చేసి.. వాటిని చేతితో వడల మాదిరిగా ఒత్తి.. నూనెలో వేయించుకోవాలి. బీహార్‌లో సాధారణంగా ఆవనూనెలో వేయిస్తారు. ఆవనూనె ఇష్టం లేని వారు మామూలు నూనెలో కూడా వేయించుకోవచ్చు.

4) దీనిని గ్రీన్ చట్నీతో కలిపి తింటే చాలా బావుంటుంది.

పంజాబీ చోలే

మనకు స్వాతంత్ర్యం రాకముందు అవిభాజ్య పంజాబ్‌లో చాలా ప్రసిద్ధి చెందిన వంటకమిది. పంజాబీ ప్రజలు చాలా కష్టపడి పనిచేస్తూ ఉంటారు కాబట్టి వారికి అవసరమైన పోషక విలువలన్నీ ఈ వంటకంలో మనకు కనిపిస్తాయి.

కావాల్సిన పదార్థాలు

కాబూలీ చెన్నా (పెద్ద తెల్ల శనగలు)- ఒక కప్పు, తినే సోడా - ఒక స్పూను, బే లీఫ్- ఒకటి, నల్ల ఏలక్కాయలు- రెండు, లవంగాలు- 2, సినమన్ - ఒక అంగుళం ముక్క, జీలకర్ర- ఒక టేబుల్ స్పూను, ధనియాలు- అర స్పూను, అల్లం- ఒక ఇంచు ముక్క తురుము, వెల్లుల్లి పాయలు - మూడు, ఎర్రకారం పొడి- ఒక స్పూను, పసుపు- అర స్పూను, ధనియాల పొడి- అర స్పూను, గరం మసాలా పౌడర్- ఒక స్పూను, ఆమ్‌చూర్ (ఎండపెట్టిన మామిడి పొడి)- ఒక స్పూను, నూనె- తగినంత, ఉప్పు- తగినంత, తరిగిన కొత్తిమీర- రెండు స్పూన్లు.. ఒక ఉల్లిపాయను.. మూడు టమోటాలను సన్నని ముక్కలుగా తరిగి సిద్ధంగా ఉంచుకోవాలి.

తయారీ విధానం

1) శనగలను కనీసం 8 గంటలు నాననియ్యాలి. తినే సోడా వేసి నానబెడితే ఇది నాలుగు గంటల తర్వాత ఉడకపెట్టుకోవచ్చు. నానిన శనగలను బాగా కడగాలి.

2) ప్రెషర్ కుక్కర్‌లో శనగలు, బే లీఫ్, నల్ల ఏలకులు, లవంగాలు, సినామిన్ ముక్క వేసి- శనగలు బాగా మునిగే దాకా నీళ్లు పోసి 10 విజిల్స్ వచ్చే దాకా ఉడకపెట్టాలి. కుక్కర్ మూత తెరుచుకొనే దాకా కంగారుపడకూడదు. ఆ తర్వాత కుక్కర్‌లో ఉన్న శనగలను, ఇతర సుగంధ దినుసులను వడబోసి బయటకు తీయాలి.

3) ఒక మూకుడులో నూనెను వేసి- జీలకర్ర, ధనియాలను వేసి బాగా వేయించాలి. ఆ తర్వాత ఉల్లిపాయ ముక్కలు వాసన పోయేదాకా వేయించాలి. ఆ తర్వాత అల్లం, వెల్లుల్లి వేసి వేయించాలి. దానిలో ఎర్ర కారం, పసుపు, ధనియాల పొడి, గరం మసాలా పౌడర్ వేసి వేయించాలి.

4) ఆ తర్వాత దీనిలో టమోటా ముక్కలను వేసి బాగా ఉడకపెట్టాలి. బాగా ఉడికిన తర్వాత ఈ మిశ్రమంలో ఆమ్‌చూర్ పొడిని వేయాలి. దీని వల్ల ఈ మిశ్రమానికి కొద్దిగా పులుపు వస్తుంది. ఆమ్‌చూర్ పొడి వేసిన తర్వాత తగినంత ఉప్పు వేసి బాగా కలపాలి. మూకుడును కిందకు దింపిన తర్వాత దానిపై తరిగిన కొత్తిమీరను వేయాలి.

5) ఈ కూర పూరీలలోకి.. చపాతీలలోకి చాలాబావుంటుంది.



స్ఫూర్తి



పర్వత రాణి
లక్పా షెర్పా

2000 సంవత్సరంలో ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన తొలి మహిళగా చరిత్ర సృష్టించింది నేపాల్‌కు చెందిన లక్పా షెర్పా. అప్పటి నుంచి ఇప్పటివరకూ ఏకంగా పదిసార్లు ఎవరెస్ట్‌ను అధిరోహించి, స్వీయ రికార్డులను బద్దలు కొట్టిన ఈ పర్వతారోహకురాలి జీవితం తాజాగా నెట్‌ఫ్లిక్స్‌లో విడుదలై ప్రశంసలందుకుంటోంది. ఈ సందర్భంగా లక్పా గురించిన మరిన్ని విశేషాలను తెలుసుకుందాం!

బాలకర్హాలోని మారుమూల హిమాలయ ప్రాంతం, నేపాల్‌లోని మకాలు గ్రామం లక్పా స్వస్థలం. ప్రాథమిక విద్యను కూడా అభ్యసించలేకపోయిన లక్పా, 2000, సెప్టెంబరులో నేపాలీ విమెన్ మిలీనియం ఎక్స్‌పెడిషన్‌లో భాగంగా ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించి, ప్రపంచం గుర్తించే స్థాయికి ఎదిగింది. 2003 నాటికి లక్పా షెర్పా మూడోసారి ఎవరెస్టును అధిరోహించి రికార్డును నెలకొల్పింది. 2007లో ఆ రికార్డు ఆరు శిఖరాలకు పెరిగింది. 2006లో ఆమె టిబెట్ మీదుగా, సవాళ్లతో కూడుకున్న మార్గం ద్వారా ఏడోసారి ఎవరెస్టును అధిరోహించి సరికొత్త రికార్డును నెలకొల్పింది. చివరిగా 2022, మేలో పదోసారి ఎవరెస్టును అధిరోహించి అందర్నీ అబ్బురపరిచింది. ప్రస్తుతం అమెరికాలో నివసిస్తున్న లక్పా షెర్పాకు ముగ్గురు పిల్లలు. ఈమె పదోసారి ఎవరెస్టును అధిరోహించడం కోసం తన పదిహేనేళ్ల కూతురు, షైనీని వెంటబెట్టుకుని నేపాల్‌కు తిరిగొచ్చినప్పుడు, ఎవరెస్టు ఆవిడకు భిన్నంగా కనిపించింది. హిమాలయాల మీద పరుచుకున్న తక్కువ మంచు, ఎక్కువ చెత్తను చూసి ఆమె మనసు ద్రవించింది. మృతదేహాలు కూడా బయల్పడడం మొదలుపెట్టాయి. పర్వతారోహణకు ఉపయోగించే తాళ్లు, నిచ్చెనలు సైతం ఖుంబు ఐస్ ఫాల్‌లో కూరుకుపోయాయి. అయినా ఆ సవాళ్లన్నింటినీ అధిగమించి పదోసారి విజయవంతంగా ఎవరెస్టు అధిరోహించగలిగిందామె. లక్పా, హిమాలయాల నీలి మంచును మొట్టమొదటిసారిగా తాకిన రోజులను స్మరించుకుంటే...

పర్వతాలే స్నేహితులుగా...

నేపాల్‌లోని మకాలు గ్రామంలో, గొర్రెల కాపరికి 11వ సంతానంగా పుట్టింది లక్పా. ప్రపంచంలోని ఐదవ ఎత్తైన పర్వత శిఖరమైన మకాలు పర్వతపాదాల్లో లక్పా పెరిగింది. సంతానం మొత్తానికీ బూట్లను కొనలేని పేద కుటుంబం వాళ్లది. ఆ ఇంట్లో మగపిల్లలే బడికి వెళ్లేవారు. "మా ఇంట్లో టీవీ, ఫోన్ ఉండేవి కావు. నేను రోజంతా గొర్రెలు, పక్షులను చూస్తూ కాలక్షేపం చేసేదాన్ని. మా గ్రామం నుంచి ఎవరెస్టు శిఖరం కనిపిస్తూ ఉండేది" అని తన చిన్ననాటి రోజులను గుర్తు చేసుకునే లక్పా, తనకు అడ్డుచెప్పే అమ్మ కళ్లుగప్పి, ఒంటరిగా, బూట్లు లేకుండా పర్వతాల్లో సంచరిస్తూ ఉండేది. మంచులో తిరిగే చిరుతలు గాయపరుస్తాయనీ, అప్పుడు తననెవరూ పెళ్లి చేసుకోడానికి ముందుకు రారనీ అమ్మ చెప్పే మాటలు గుర్తుకొచ్చి, ఇంటికి భయంభయంగా తిరిగొచ్చేది. కానీ లక్పాలో ఆమె తండ్రికి పట్టుదల, సామర్థ్యాలు కనిపించాయి. ఒక రోజు అతను గొర్రెపిల్లలు, జడలబర్రె పిల్లలను తోలుకురమ్మని, లక్పాను మకాలు బేస్‌క్యాంప్‌కు పంపించాడు. అక్కడ ఆమెకు పర్వతాన్ని అధిరోహించబోతున్న ఒక షెర్పా కంటపడ్డాడు. అప్పట్లో నేపాలీ మహిళలకు షెర్పాలుగా ఉద్యోగం చేయడానికి అనుమతి లేకపోయినప్పటికీ, తానెప్పటికైనా షెర్పా మహిళగా ఎదిగి, ఎవరెస్టును అధిరోహించాలని నిర్ణయించుకుంది లక్పా. అలా 15 ఏళ్లకే పోర్టర్‌గా మారి, ఏటవాలు పర్వతాల మీద బరువులను మోసుకుంటూ ఎక్కడం మొదలుపెట్టింది. తర్వాత రెండేళ్లకే కిచెన్ బాయ్‌గా పదోన్నతి పొందింది. రోజంతా పర్వతాన్ని అధిరోహించి, కిచెన్ టెంట్ ఏర్పాటు చేసుకుని, గైడ్స్, ఇతరులకూ భోజనం వండడం కోసం ఉల్లిపాయలూ, వెల్లుల్లీ వలుస్తూ ఉండిపోయేది. అందుకామెకు నెలకు 50 రూపాయలు జీతంగా దక్కేవి.

వెనకడుగు వేయకుండా...

తర్వాత 2000 సంవత్సరంలో అప్పటి కాబోయే నేపాల్ ఉప ప్రధాని, సుజాతా కొయిరాలా సహాయంతో, మొట్టమొదటి నేపాలీ విమెన్ ఎవరెస్ట్ ఎక్స్‌పెడిషన్‌లో స్థానం సంపాదించుకుని, ఏడుగురు మహిళలతో అధిరోహణ మొదలుపెట్టింది. ఆ బృందంలో మిగతా ఆరుగురు ఆల్టిట్యూడ్ సిక్‌నెస్‌తో వెనుదిరగడంతో, లక్పా ఒక్కతే విజయవంతంగా ఆ సాహసయాత్రను పూర్తి చేయగలిగింది. ఆ తర్వాత చేపట్టిన ప్రతి ఎక్స్‌పెడిషన్‌లో ఎన్నో విషాదాలను ప్రత్యక్షంగా చూసింది. స్నేహితులను కోల్పోయింది. అంతిమంగా 2002లో రొమేనియన్ పర్వతారోహకుడు జార్జ్ డిజ్మరెస్కును పెళ్లి చేసుకున్న లక్పా అమెరికాలోని కనెక్టికట్‌కు వెళ్లిపోయింది. వాళ్లిద్దరూ కలిసి రూఫింగ్, పెయింటింగ్ వ్యాపారం చేసేవారు. భర్త మరణించడంతో ఆమె చిన్నా చితకా పనులు చేసుకుంటూ ఇద్దరు ఆడపిల్లలను చదివించుకుంటూ ఉండిపోయింది. చివరకు 2022లో పదోసారి ఎవరెస్టును ఎక్కడం కోసం ఆవిడ తిరిగి నేపాల్ చేరుకుంది. కానీ ఆమె సాహసయాత్రకు స్పాన్సర్స్ లేరు. మహిళా పర్వతారోహకులకు ఇది కొత్త కాదు. కాబట్టి సొంత ఖర్చులతోనే సాహసయాత్రకు పూనుకుని విజయవంతంగా ఎవరెస్టును అధిరోహించి చరిత్ర సృష్టించింది.

లక్పా హిమాలయాల్లోని ఎన్నో ఇతర శిఖరాలను అధిరోహించింది. తన అనుభవాన్ని ఎంతో మంది పర్వతారోహకులకు పంచి పెట్టింది. న్యూ ఇంగ్లండ్, హిమాలయాల్లో క్లౌడ్‌స్కేప్ క్లైంబింగ్ పేరుతో ఎంతోమంది పర్వతారోహకులకు పర్వతారోహణ మెలకువలను నేర్పిస్తోంది.



తల్లి బాటలోనే కూతురు...

లక్పా ఇప్పటివరకూ హిమాలయాల్లోని ఎన్నో ఇతర శిఖరాలను అధిరోహించింది. తన అనుభవాన్నీ, పరిజ్ఞానాన్నీ ఎంతో మంది పర్వతారోహకులకు పంచి పెట్టింది. న్యూ ఇంగ్లండ్, హిమాలయాల్లో క్లౌడ్‌స్కేప్ క్లైంబింగ్ పేరుతో ఎంతో మంది పర్వతారోహకులకు పర్వతారోహణ మెలకువలను నేర్పిస్తోంది. లక్పా సేవలు షెర్పా సంస్కృతిలో సమూల మార్పులకు దోహదపడ్డాయి. నేపాల్, న్యూ ఇంగ్లండ్‌లోని ఎంతోమంది మహిళలకు ప్రేరణగా నిలిచాయి. కొడుకు నిమా, కూతుళ్లు సన్నీ, షైనీలు కూడా తల్లి లక్పా మార్గాన్నే అనుసరించారు. 15 షైనీ ఇప్పటికే కొన్ని క్లిష్టమైన పర్వతాలను అధిరోహించడం విశేషం. "షెర్పా సంస్కృతినీ, షెర్పా మహిళలు, నేపాలీ మహిళల స్థితిగతులను మార్చగలిగినందుకు నాకెంతో సంతోషంగా ఉంది. నా జీవితం సవాళ్లతో సాగింది. పర్వతాలే నా మనసుకు స్వాంతన చేకూర్చాయి. నేనెప్పటికీ వెనకడుగు వేయను. నాలాగే యువతులందరూ వెనకడుగు వేయకుండా ఉండాలనే నేను కోరుకుంటాను" అంటూ సాటి యువతులకు ప్రేరణగా నిలుస్తోంది లక్పా. •

మేకప్

వేడుకల్లో వెలుగులీనేలా

పగటి వేళ వేడుకులకూ, రాత్రివేళ వేడుకలకూ వేసుకునే మేకప్ భిన్నంగా ఉంటుంది. వెలుగుకు తగిన మేకప్ వేసుకున్నప్పుడే, ఆకర్షణీయంగా, సహజసిద్ధంగా కనిపిస్తాం. కాబట్టి నైట్‌పార్టీల కోసం ఇదుగో ఇలాంటి మేకప్ టిప్స్ పాటించండి.

లిప్ షేడ్: పగటి వేళ న్యూడ్ బీజ్ లాంటి రంగులతో మేకప్‌ను మ్యానేజ్ చేయవచ్చు. కానీ రాత్రి వేళ ముదురు ఎరుపు రంగు లిప్‌స్టిక్స్ ఆకర్షణీయంగా కనిపిస్తాయి.

ఐ షాడో: లైట్ల వెలుగులో తారలా వెలిగిపోవాలంటే ఐ షాడోకు కూడా మెరుపులు జోడించాలి. అందుకోసం గ్లిట్టర్ వాడుకోవాలి.

బేస్ ఫిక్స్: మేకప్ చెక్కుచెదరకుండా ఉండడం కోసం మేకప్ సెట్టింగ్ స్ప్రే వాడుకోవాలి. లేదంటే, ఫౌండేషన్ మీద కాంపాక్ట్ పౌడర్ అద్దుకోవాలి. అలాగే బేస్‌ను ఫిక్స్ చేయడం కోసం కొంత ఫౌండేషన్, బ్యూటీ బ్లెండర్ కలిపి వాడుకోవాలి.

ఐలైనర్: మేకప్ లుక్ అదిరిపోవాలంటే కనురెప్పలకు నియాన్ ఐలైనర్ అప్లై చేయాలి.

చెక్కిన లుక్: ముక్కూ, చుబుకం, కనుబొమలు స్పష్టంగా చెక్కినట్టు కనిపించడం కోసం బ్రాంజర్‌తో కాంటూర్ చేసుకోవాలి.



బ్లషర్: సాధారణంగా బ్లషర్ కొన్ని గంటలకే చెదిరిపోతూ ఉంటుంది. కాబట్టి చెక్కిళ్లకు కూడా బ్లషర్ అప్లై చేయడం మర్చిపోకూడదు.

ఐల్యాషెస్: ఫాల్స్ ఐల్యాషెస్ ఉపయోగించవచ్చు. ఇష్టం లేకపోతే డ్రమాటిక్ మస్కారా అప్లై చేయాలి.

హైలైటర్: ఈ బ్లైండింగ్ హైలైటర్‌ను చెక్కిళ్లు, బ్రో బోన్ మీద అద్దుకోవాలి. •

ఫుడ్ ఫ్యాక్ట్స్

ఆహారం... కలకాలం!

ఆహారపదార్థాలు కొన్ని గంటల్లో లేదా కొన్ని రోజుల్లో పాడైపోతూ ఉంటాయి. కానీ కొన్ని పదార్థాలు కలకాలం పాడయిపోకుండా ఉంటాయని మీకు తెలుసా? అలాంటి వాటిని నిల్వ చేసుకుని, నిక్షేపంగా వాడుకోవచ్చు. అవి ఇవే!

తెల్ల బియ్యం: పాలిష్ పట్టిన లేదా పాలిష్ పట్టని బియ్యం సరైన పరిస్థితుల్లో నిల్వ చేస్తే దాదాపు 30 ఏళ్లపాటు చెక్కుచెదరకుండా ఉంటాయి. వాటిలోని పోషకాలు కూడా నిర్వీర్యమవకుండా ఉంటాయి. ఇందుకోసం ఆ బియ్యాన్ని గాలి చొరబడని డబ్బాల్లో, 40 డిగ్రీల ఫారిన్‌హీట్ ఉష్ణోగ్రతల్లో నిల్వ చేయాలి. అయితే గోధుమ బియ్యం ఎన్ని జాగ్రత్తలు పాటించినా ఆరు నెలలకు మించి నిల్వ ఉండదు. ఇందుకు కారణం దాన్లో సహజసిద్ధ నూనెలు ఉండడమే!



తేనె: పూల నుంచి సేకరించిన మకరందంతో తేనెటీగల శరీరాల్లో ఉండే రసాయనాలు కలిసి, మకరందం రసాయన స్థితి మారుతుంది. ఇలా తయారయిన తేనె సింపుల్ సుగర్స్‌లా విడివడి, తేనె తుట్టె గదుల్లోకి చేరుతుంది. ఈ క్రమం మూలంగా తేనె ఎల్లకాలం చెక్కుచెదరకుండా ఉంటుంది.

ఉప్పు: భూమిలోని సహజసిద్ధ ఖనిజలవణం రూపమే సోడియం క్లోరైడ్. కాబట్టే దీని నిల్వ కాలం ఎక్కువ. తేమను పీల్చుకునే గుణం ఉండడం మూలంగా ఉప్పును పదార్థాల నిల్వకు ఉపయోగించే ఆనవాయితీ శతాబ్దాల పూర్వం నుంచి ఉంది. అయితే ఇదే గుణం ఆహారంలో ఉపయోగించే మెత్తని ఉప్పుకు ఉండదు. ఈ ఉప్పు తయారీలో భాగంగా జోడించే అయొడిన్ మూలంగా మెత్తని ఉప్పు నిల్వ సామర్థ్యం తగ్గుతుంది. ఇలాంటి అయొడైజ్‌డ్ సాల్ట్ ఐదేళ్లకు మించి నిల్వ ఉండదు.

కాచిన వెన్న: వెన్న లోని తేమ మొత్తం పోయేలా వేడి చేసి నిల్వ చేయాలి. కాచిన వెన్న లేదా నెయ్యిలను చల్లని ఉష్ణోగ్రత వద్ద, మూత బిగించిన సీసాల్లో నిల్వ చేస్తే దాదాపు వందేళ్లపాటు పాడవకుండా నిల్వ ఉంటాయి.

ఎండిన పప్పుధాన్యాలు: కందులు, మినుములు, చిక్కుడు గింజలు, సోయా, రాజ్మా మొదలైనవి తేమ లేకుండా, ఎండబెట్టి నిల్వ చేస్తే 30 ఏళ్ల పాటు పాడవకుండా ఉంటాయి. ఇంతకాలం నిల్వ ఉన్నా వాటిలోని మాంసకృత్తుల పరిమాణం ఏమాత్రం తగ్గదు. •

వైసీపీ ఐపీఎస్‌లు సెలవులో..!

- 16 మంది మూకుమ్మడిగా పెట్టారని ప్రచారం
- ఆరుగురే అడిగారంటున్న అధికారులు
- దీర్ఘకాలిక సెలవుపై వెళ్లాలని అత్యధికుల యోచన!

అమరావతి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు అధికార పార్టీకి కొమ్ముకాసి.. కొత్త ప్రభుత్వంలో పోస్టింగ్ దక్కని 16 మంది ఐపీఎస్ అధికారులు ఇప్పుడు సెలవులో వెళ్లారు. పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న వీరంతా మూకుమ్మడిగా సెలవు పెట్టినట్లు ప్రచారం జరిగింది. అయితే అందరూ సెలవు పెట్టలేదని, వారాంతం కావడంతో ఆరుగురు మాత్రమే తాత్కాలిక సెలవు కోరారని పోలీసు శాఖలోని ఉన్నత స్థాయి వర్గాలు తెలిపాయి. ఎన్నికల ముందు ఏకపక్షంగా వ్యవహరించి, జగన్ పార్టీ అరాచకాలకు కొమ్ముకాసిన పలువురు ఐపీఎస్ అధికారులను ఎన్నికల కమిషన్ (ఈసీ) పక్కన బెట్టిన సంగతి తెలిసిందే. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక.. నిరీక్షణలో ఉన్న పోలీసు అధికారులపై గతంలో పలు ఆరోపణలు ఉండడంతో వాటిపై విచారించి నివేదిక ఇవ్వాలని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాన్ని ఆదేశించింది. విషయం తెలుసుకున్న వైసీపీ ఐపీఎస్‌లు కొందరు.. ఏకంగా విజిలెన్స్ అధికారులకే ఫోన్ చేసి తమ పాత్రను చూపించొద్దని కోరినట్లు ఫిర్యాదులందాయి. దీంతో వెయిటింగ్‌లో ఉన్న ఐపీఎస్‌లందరూ ప్రతి రోజూ పోలీసు ప్రధాన కార్యాలయానికి వచ్చి రిజిస్టర్‌లో సంతకాలు చేయాలని డీజీపీ ద్వారకా తిరుమలరావు ఈ నెల 12న సర్క్యులర్ జారీ చేశారు. అయితే 15న స్వాతంత్ర్య దినోత్సవం, ఆ తర్వాత శని, ఆది వారాలు సెలవు కావడంతో వీరిలో కొందరు ఈ నెల 13, 14న.. మరికొందరు 16న సెలవు పెట్టినట్లు తెలిసింది. లాంగ్ వీకెండ్ రావడంతో మధ్యలో సెలవులు పెట్టుకున్నారని, సోమవారం రాఖీ పండుగ తర్వాత వారు వచ్చే అవకాశం ఉందని సదరు వర్గాలు తెలిపాయి. ఇదిలా ఉండగా.. ప్రతి రోజూ పోలీస్ హెడ్ క్వార్టర్స్‌కు వచ్చి నిరీక్షించడం అవమానకరంగా ఉంటుందని ఆ 16 మందిలో అత్యధికులు మధనపడుతున్నట్లు తెలిసింది. రోజూ ఉదయం పదింటికి వెళ్లి సాయంత్రం ఐదింటి వరకూ ఊరకే పనిలేకుండా కూర్చోవడం కంటే దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడం మంచిదని వారు అభిప్రాయపడుతున్నట్లు సమాచారం. కాగా.. ఐపీఎస్‌ల సెలవుపై ప్రభుత్వ వర్గాలు స్పందించాయి. సెలవు అడిగినంత మాత్రాన ఇవ్వాలని లేదని.. సహేతుక కారణం చూపితేనే మంజూరు చేస్తారని.. నచ్చినట్లు సెలవు పెడతామంటే కుదరదని స్పష్టం చేశాయి. నిఘా మాజీ అధిపతి పీఎస్ఆర్ ఆంజనేయులు, సీఐడీ మాజీ చీఫ్‌లు సునీల్ కుమార్, సంజయ్‌కి ప్రభుత్వమే (జీఏడీ) సెలవు మంజూరు చేయాల్సి ఉంటుంది. మిగిలిన 13 మందిలో ఎవరికి సెలవు ఇవ్వాలన్నది డీజీపీ ఇష్టం.

ఎందుకీ ఏడుపు?

- ఐఏఎస్, ఐపీఎస్‌లకు అవమానమట!
- రెండు నెలలుగా పోస్టింగ్ ఇవ్వలేదంటూ ఏడుపు
- ఐదేళ్లలో జగన్ చేసిన నిర్వాకం ఏమిటి?
- చెప్పింది వినకుంటే శంకరగిరి మాన్యాలే
- 'అన్నా' అంటూ సీఎస్‌గా ఉన్న ఎల్వీని ఏం చేశారు?
- 15 మంది ఐఏఎస్, ఐపీఎస్‌లు నెలల తరబడి వెయిటింగ్
- సీనియర్ ఐపీఎస్ ఏబీవీపై ఐదేళ్లూ కక్ష సాధింపే
- సాయిప్రసాద్‌కు 8 నెలలు నో పోస్టింగ్

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఐఏఎస్‌లను 'అయ్యో..ఎస్'లుగా మార్చి... ఐపీఎస్‌లతో 'వైసీపీ' చట్టాన్ని అమలు చేయించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిదే! ఇప్పుడు... ఐఏఎస్, ఐపీఎస్‌ల ఆత్మగౌరవంపై ఆటవిక దాడి జరుగుతోందంటూ ఆయన రోత పత్రిక వాపోతోంది. పలువురు అఖిలభారత సర్వీసు అధికారులకు రెండు నెలలుగా పోస్టింగ్ ఇవ్వకుండా అవమానిస్తోందని తెగ ఆవేదన వ్యక్తం చేసింది. అంతటితో ఊరుకోకుండా... జగన్మోహన్ రెడ్డి ఇలా ఎవరికీ పోస్టింగులు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టలేదని, 'ఉత్తమ సంప్రదాయాలు' పాటించారని ఓ సర్టిఫికెట్ ఇచ్చేసింది. 'ఇదంతా నిజమేనా? కొంతైనా నిజం ఉండొచ్చు' అని నమ్మితే తప్పులో కాలేసినట్లే! జగన్ ఐదేళ్ల జమానాలో... ఐఏఎస్, ఐపీఎస్‌లకు నిత్య నరకమే! చెప్పింది విన్న వాళ్లకే అందలం! కాదంటే.. శంకరగిరి మాన్యాలే!

వీళ్లను వేధించింది ఎవరు?

'జగన్ ఎవరికీ పోస్టింగ్‌లు ఇవ్వకుండా ఆపలేదు' అంటూ ఆయన రోతపత్రిక పచ్చి అబద్ధాలు రాసింది. ప్రస్తుతం సీఎంవో ముఖ్యకార్యదర్శిగా ఉన్న సీనియర్ ఐఏఎస్ ముద్దాడ రవిచంద్రను 2023లో పక్కన పెట్టేశారు. ఎన్నికలయ్యే దాకా ఆయనకు పోస్టింగ్ దక్కలేదు. జగన్ ప్రభుత్వం తెచ్చిన ఒక అడ్డగోలు ఆర్డినెన్స్‌ను సమర్థించలేదనే ఏకైక కారణంతో సీనియర్ ఐఏఎస్ అధికారి ఆర్పీ సిసోడియాకు ఆర్నెళ్లు పోస్టింగ్ ఇవ్వలేదు. ఆ తర్వాత పెద్దగా పనేమీ ఉండని హెచ్చార్డీకి విసిరి కొట్టారు. 'మాతో పెట్టుకుంటే ఇలాగే ఉంటుంది' అని ఇతర ఐఏఎస్‌లకు హెచ్చరిక పంపించారు. ఇక... చంద్రబాబు హయాంలో యూపీ నుంచి డిప్యుటేషన్‌పై వచ్చిన సీనియర్ ఐఏఎస్ అధికారి రాజమౌళిని తీవ్ర స్థాయిలో ఇబ్బంది పెట్టారు. ఆయనను ఇక్కడ రిలీవ్ చేయకుండా... 14 నెలల పాటు వెయిటింగ్‌లో ఉంచి పైశాచికం ప్రదర్శించారు.

జగన్ వల్లే అసలైన అవమానం..

ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లకు అవమానం జరిగిందంటే... అది జగన్ నిర్వాకం వల్లే! జగన్ పాపాల వల్లే శ్రీలక్ష్మి, బీపీ ఆచార్య వంటి ఐఏఎస్‌లు జైలు పాలయ్యారు. ఆయన ముఖ్యమంత్రి అయ్యాక సగటున నెలకు ఒక ఐఏఎస్, ఐపీఎస్ అధికారి తల దించుకుని హైకోర్టు ముందు నిలవాల్సిన పరిస్థితి వచ్చింది. కొందరికి శిక్షలు కూడా పడ్డాయి. కోర్టు దయతలచి మినహాయింపు ఇవ్వకుంటే వారూ జైళ్లకు వెళ్లే వారే. ఐఏఎస్, ఐపీఎస్‌లను తన సొంత పాలేర్లలా వాడుకున్న ఘనత జగన్‌ది. తన మాటకు తలూపితే ఒక లెక్క.. తప్పును ఎత్తి చూపితే మరో లెక్క! బ్యూరోక్రాట్లను అడ్డదిడ్డంగా వాడుకుని తర్వాత ఈడ్చిపడేయడం ఆయన నైజం. సీఐడీ చీఫ్‌గా పని చేసిన సునీల్ కుమార్‌ను టీడీపీ నేతలను వేధించేందుకు అడ్డగోలుగా వాడుకుని... ఎక్కడో తేడా రావడంతో ఆయనను ఎక్కడో పడేయడం మచ్చుకు ఒక ఉదాహరణ.

ఇది సత్కారమా?

జగన్ పాలనలో 15 మంది ఐఏఎస్, ఐపీఎస్‌లను... 170 మందికి పైగా అడిషనల్ ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలను నెలలు, సంవత్సరాల తరబడి పోస్టింగ్‌లు ఇవ్వకుండా 'వెయిటింగ్'లో పెట్టారు. ఇది.. వాళ్లను అవమానించడం కాదా? ఐపీఎస్‌లలో అత్యంత సీనియర్‌ను డీజీపీగా నియమించాలి. కనీసం... టాప్-5 నుంచి డీజీపీని ఎన్నుకోవడం రివాజు. కానీ... ఎక్కడో 15వ స్థానంలో ఉన్న రాజేంద్రనాథ్ రెడ్డికి జగన్ డీజీపీ పోస్టు కట్టబెట్టారు. ఇది... సీనియారిటీ లిస్టులో ఆయనకంటే పైన ఉన్న 14 మందిని అవమానించడం కాదా?

అబ్బో... ఎంత పెద్ద మనసో!

చంద్రబాబు హయాంలో సీఎం కార్యాలయంలో పని చేసిన సాయిప్రసాద్‌కు కీలక పోస్టు ఇచ్చి జగన్ చాలా పెద్ద మనసు ప్రదర్శించారని కూడా ఆయన రోత పత్రిక గొప్పలకు పోయింది. కానీ... జగన్ సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన మరుసటి రోజునే సాయిప్రసాద్‌ను తప్పించేశారు. ఏకంగా 8 నెలలు వెయిటింగ్‌లో పెట్టారు. ఆ తర్వాత రెండేళ్లపాటు అప్రాధాన్య పోస్టులే ఇచ్చారు. 'మీరు చెప్పినట్లువింటాం' అని శరణుజొచ్చిన వాళ్లకు, ఢిల్లీ స్థాయిలో ఒత్తిడి చేయించిన వాళ్లకు మాత్రమే జగన్ సర్కారు పోస్టులు ఇవ్వడం అక్షరాలా నిజం!

'జగన్ బ్యాచ్'అని ఒప్పుకొన్నట్లేనా?

జగన్ హయాంలో పదుల కొద్దీ అధికారులను నెలల తరబడి వెయిటింగ్‌లో పెట్టడం నిజం. 'ఎందుకు' అని ప్రశ్నిస్తే... సరైన జవాబు కూడా చెప్పలేరు. ఇప్పుడేమో.. ఐఏఎస్, ఐపీఎస్‌లకు 'రెండు నెలలు'గా పోస్టింగ్‌లు ఇవ్వలేదంటూ జగన్ పత్రిక వాపోయింది. వీళ్లంతా జగన్ సేవలో తరించిన వారేనంటూ చెప్పకనే చెప్పింది. ప్రభుత్వం మారినప్పుడు కీలక స్థానాల్లో ఉండే అధికారులను మార్చడం సహజం! పైగా... ఇప్పుడు 'వెయిటింగ్'లో ఉన్న వారిలో అత్యధికులు 'మామూలు' అధికారులు కాదు. చంద్రబాబు, లోకేశ్, టీడీపీ కీలకనేతలను లక్ష్యంగా చేసుకుని అక్రమ కేసులు, అరెస్టులే ధ్యేయంగా పని చేసిన వాళ్లే! తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్న వారూ ఉన్నారు. అయినా... వీళ్లెవరినీ చంద్రబాబు ప్రభుత్వం సస్పెండ్ చేయలేదు. ప్రభుత్వం మారిన తర్వాత పోస్టింగ్‌ల విషయంలో ఆచితూచి వ్యవహరించడం సహజం! ఆరోపణలు ఎదుర్కొంటున్న వారి విషయంలో మరింత జాగ్రత్తగా ఉంటారు. ఇప్పటికీ ఐఏఎస్, ఐపీఎస్‌ల పోస్టింగ్‌ల ప్రక్రియ జరుగుతూనే ఉంది. కానీ... 'మా వాళ్లకు అన్యాయం, అవమానం' అని జగన్ రోత పత్రిక వాపోయింది.

రెండు నెలలకే అంత ఏడుపా?

పలువురు ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు చట్టాలు, నిబంధనలు ఉల్లంఘించినప్పటికీ... అక్రమాలపై సాక్ష్యాధారాలున్నప్పటికీ కూటమి ప్రభుత్వం వారిని సస్పెండ్ చేయలేదు. వాళ్లంతా సర్వీసులోనే ఉన్నారు. అంటే వేతనంతో పాటు ఇతర సౌకర్యాలు కూడా అనుభవిస్తారు. పోస్టింగ్ ఇవ్వకుండా జీఏడీకి, డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేసిన అధికారులు రోజూ ప్రధాన కార్యాలయానికి వెళ్లాలి. మిగిలిన అధికారులతోపాటు కూర్చోవాలి. వీరిని అత్యవసర సేవలకు ఉపయోగించుకునే అవకాశముంటుంది. ఏవైనా కారణాల వల్ల రాలేకపోతే... ముందస్తు అనుమతి తీసుకోవాలి. కానీ... 'వెయిటింగ్'లో ఉన్న 16 మంది ఐపీఎస్‌లు హెడ్‌క్వార్టర్స్‌కే రావడంలేదు. అందుకే... రోజూ ఆఫీసుకు వచ్చి సంతకం చేయాలని డీజీపీ మెమో జారీ చేశారు. ఇదేమీ నిబంధనలకు విరుద్ధం కాదు! కానీ... 'మా వాళ్లను ఆఫీసుకు పిలిచి సంతకం చేయమంటారా?' అని జగన్ పత్రిక వాపోవడమే విచిత్రం!

ఎల్వీపై తొలి వేటు..



సీనియర్ ఐఏఎస్ అధికారి ఎల్వీ సుబ్రమణ్యానికి జగన్ చేసిన అవమానం అంతా ఇంతా కాదు. చీఫ్ సెక్రటరీగా ఉన్న ఎల్వీని 'అన్నా... అన్నా' అంటూ ప్రేమంతా ఒలకబోశారు. తర్వాత కొన్నాళ్లకే... ఎలాంటి కారణం చూపకుండానే ఆయనను బాపట్లలోని మానవ వనరుల విభాగానికి తరిమేశారు. ఉమ్మడి రాష్ట్ర చరిత్రలోనే సీఎస్ హోదాలో ఉన్న ఏ అధికారికీ ఎదురుకాని అనుభవమిది! ముఖ్యమంత్రి హోదాలో జగన్ తీసుకునే అడ్డగోలు, అర్థరహిత నిర్ణయాలకు తల ఊపలేదనే ఏకైక కారణంతోనే ఎల్వీని పక్కకు తప్పించినట్లు ఐఏఎస్ వర్గాల్లో ప్రచారం జరిగింది. 'నా మాట వినకుంటే అంతే' అంటూ బ్యూరోక్రాట్లకు జగన్ ఇలా హెచ్చరికలు పంపించారు.

ఏబీవీని ముప్పుతిప్పలు పెట్టలేదా?



సీనియర్ ఐపీఎస్ ఏబీ వెంకటేశ్వర రావును జగన్ సర్కారు ముప్పు తిప్పలు పెట్టింది. ట్రైబ్యునల్ తీర్పులు, కోర్టు ఉత్తర్వులు ఎలా ఉన్నా.. సస్పెన్షన్ల మీద సస్పెన్షన్లు చేసింది. ఆయనకు యూనిఫామ్ దూరం చేసి వికృతానందం పొందింది. సస్పెన్షన్ ఎత్తివేశాకా నెలల తరబడి పోస్టింగ్ ఇవ్వలేదు. చివరికి.. పదవీ విరమణ చేసే రోజున పోస్టింగ్ ఇచ్చింది. ఇక... మరో ఐపీఎస్ అధికారి బాలసుబ్రమణ్యంనూ జగన్ ఇలాగే సతాయించారు. రెండు విడతల్లో ఐదునెలలు పోస్టింగ్ ఇవ్వలేదు. ఆయనకు జగన్ ఇచ్చిన పోస్టింగ్‌లు కూడా అప్రాధాన్యమైనవే!

ఆ ఐదేళ్లు ఏం చేసినట్లు?

ఏపీలో ఐఏఎస్, ఐపీఎస్‌లకు అవమానం జరుగుతోందంటూ దేశవ్యాప్తంగా సివిల్ సర్వెంట్లు మండిపడుతున్నారని జగన్ పత్రిక ఆక్రోశించింది. ఐపీఎస్ సర్వీసు వదులుకుని రాజకీయాల్లో చేరిన ఒక మాజీ ఐపీఎస్ అధికారి, ఇంకో రిటైర్డ్ ఐపీఎస్ అధికారి కూడా... ఏపీ ప్రభుత్వ చర్యలు మూర్ఖత్వం, అసంబద్ధం అని కన్నెర్ర చేశారు. జగన్ ఐదేళ్ల హయాంలో బ్యూరోక్రాట్ల పరిస్థితి వీళ్లకు తెలియదా? తెలిసీ మాట్లాడలేదా? అప్పుడు కూడా నోరెత్తకుండా... ఇప్పుడు మాట్లాడే నైతిక అర్హత వీరికి ఉంటుందా?

10 మంది ఐపీఎస్‌ల బదిలీ

- అనంత ఎస్పీగా జగదీశ్.. విశాఖ ఏపీఎస్పీకి మురళీకృష్ణ
- బెజవాడ డీసీపీగా మహేశ్వరరాజు
- డీజీపీ ఆఫీసుకు సత్యయేసుబాబు
- 12 మంది నాన్-కేడర్ ఎస్పీలు, 49 మంది అదనపు ఎస్పీలకూ స్థానచలనం



అమరావతి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పది మంది ఐపీఎస్ అధికారులను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. అనంతపురం ఎస్పీ మురళీకృష్ణను విశాఖపట్నం ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంట్‌గా పంపి.. ఆయన స్థానంలో జగదీశ్‌ను నియమించింది. ఇంటెలిజెన్స్ ఎస్పీ సత్య యేసుబాబును డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించింది. ఆయన స్థానంలో నచికేత్ విశ్వనాథ్‌ను నిఘా ఎస్పీగా నియమించింది. విజయవాడ డీసీపీగా మహేశ్వర రాజును, గుంతకల్ రైల్వే ఎస్పీగా రాహుల్ మీనాకు పోస్టింగ్ ఇచ్చింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. ఇంకోవైపు.. 12 మంది నాన్-కేడర్ ఎస్పీలను, 49 మంది అదనపు ఎస్పీలను కూడా ప్రభుత్వం బదిలీచేసింది. నాన్-కేడర్‌లో ఐదుగురిని డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని హోం శాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ ఆదేశించారు. వీరిలో వైసీపీతో అంటకాగిన నిఘా డీసీపీ ఆనంద రెడ్డి, విజయవాడ విజిలెన్స్ ఎస్పీ కరీముల్లా షరీఫ్, శ్రీకాకుళం ప్రాంతీయ విజిలెన్స్ అధికారి సురేశ్ బాబు, విశాఖ క్రైం డీసీపీ వెంకటరత్నం, విశాఖ కమిషనర్ అటాచ్‌మెంట్‌లో ఉన్న లక్ష్మీనారాయణ ఉన్నారు. అలాగే 15 మంది అదనపు ఎస్పీలను కూడా డీజీపీ ఆఫీసులో రిపోర్టు చేయాలని నిర్దేశించారు.

పది మంది ఐపీఎస్‌ల బదిలీలు ఇలా..

అధికారి	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
సత్య యేసుబాబు	ఎస్పీ, ఇంటెలిజెన్స్	డీజీపీ ఆఫీసులో రిపోర్టు
గరుడ్ సుమిత్ సునీల్	వెయిటింగ్	గ్రూప్ కమాండర్, గ్రేహౌండ్స్
పి. జగదీష్	వెయిటింగ్	ఎస్పీ, అనంతపురం
కేవీ మురళీకృష్ణ	ఎస్పీ, అనంతపురం	కమాండెంట్, ఏపీఎస్పీ, విశాఖ
కేఎం మహేశ్వరరాజు	ఎస్పీ, సెబ్	డీసీపీ, విజయవాడ
సునీల్ షొరెన్	ఎస్‌డీపీవో, పార్వతీపురం	గ్రూప్ కమాండర్, గ్రేహౌండ్స్
రాహుల్ మీనా	ఏఎస్పీ, చింతూరు	రైల్వే ఎస్పీ, గుంతకల్
నచికేత్ విశ్వనాథ్	ఏఎస్పీ, గుంటూరు తూర్పు	ఎస్పీ, ఇంటెలిజెన్స్
పంకజ్ కుమార్ మీనా	అసాల్ట్ కమాండర్, గ్రేహౌండ్స్	ఏఎస్పీ, చింతూరు
సురాన అంకిత మహవీర్	అసాల్ట్ కమాండర్, గ్రేహౌండ్స్	ఎస్‌డీపీవో, పార్వతీపురం

దుర్గగుడిలో సెల్‌ఫోన్ తనిఖీలు

వన్‌టౌన్, ఆగస్టు 16: ఇంద్రకీలాద్రి దుర్గామల్లేశ్వర దేవస్థానంలో అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల వద్ద సెల్ ఫోన్లు లేకుండా ఉండేందుకు దేవస్థానం ఈవో కె.ఎస్. రామారావు ఆదేశాల మేరకు ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బంది, హోం గార్డులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బంది, హోం గార్డుల కళ్లు కప్పి ఆలయంలోకి సెల్‌ఫోన్‌లు తీసుకువెళ్లిన భక్తులను గుర్తించి వారికి జరిమానా విధిస్తున్నారు. ఇటీవల దేవస్థానంలో ఒక భక్తుడు తన సెల్ ఫోన్ ద్వారా అంతరాలయాన్ని చిత్రీకరించి సోషల్ మీడియాలో పెట్టాడు. దీనిపై ఆంధ్రజ్యోతిలో కథనాలు రావడంతో స్పందించిన మంత్రి, సంబంధిత ఉన్నతాధికారులు ఆలయ ఈవోపై సీరియస్ అయ్యారు. దాంతో భక్తులను విస్తృతంగా తనిఖీలు చేయాలని ఉద్యోగులతో పాటు, ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బంది, హోం గార్డులను ఆదేశించారు. ఫోన్‌లు తీసుకువెళ్లిన భక్తులకు రూ. 500 నుంచి 1000 వరకు జరిమానా విధిస్తున్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు

విద్యాధరపురం, ఆగస్టు 16 : విద్యాధరపురం రావిచెట్టు సెంటర్‌కు చెందిన వివాహిత (23) అదృశ్యమైనట్లు శుక్రవారం భవానీపురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. యువకుడు (24) రెండేళ్ల క్రితం యువతిని ప్రేమించి వివాహం చేసుకున్నాడు. ఆ యువకుడు కారు డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. అతని భార్యకి హైదరాబాద్ ఎస్ఆర్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో జాబ్ రావటంతో జనవరి 26న హైదరాబాద్ వెళ్లింది. ఆమె ఉద్యోగం చేస్తూ మూడు నెలల తరువాత ఓ యువకుడితో పరిచయమై అతనితో సన్నిహితంగా ఉండటం భర్తకు తెలిసింది. ఈనెల 6న భర్త ఆమెను విద్యాధరపురం తీసుకువచ్చాడు. అదేరోజు ఆమె ఫోన్‌కు రూ.1000 ఫోన్ పే రావటంపై భర్త ప్రశ్నించాడు. ఆమె సమాధానం చెప్పలేదు. 15న యువకుడు ట్రావెల్స్ పనిమీద బయటకు వెళ్లాడు. మధ్యాహ్నం అతను ఇంటికి వచ్చి చూడగా భార్య కనిపించలేదు. బంధువులు, స్నేహితుల వద్ద వెతికినప్పటికీ ఆచూకీ లభించకపోవటంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

అలరించిన వీణ కచేరి



వన్‌టౌన్, ఆగస్టు 16 : ధర్మపథం వేదిక పై శుక్రవారం విజయవాడకు చెందిన ఎస్.సుజాత బృందం వీణ వాదన కచేరి నిర్వహించారు. ఎన్.ఎస్. కల్యాణ్ రామ్ మృదంగంతో, హరిబాబు ఘటంతో సహకరించారు. పలు కీర్తనలను వీణపై పలికించి ఆహుతులను అలరించారు.

ఎస్ఆర్ఆర్ అధ్యాపకులకు అవార్డ్సు

భారతీనగర్, (గుణదల) : స్వాతంత్ర్య దినోత్సవం రోజున కలెక్టర్ జి. సృజన ప్రకటించిన ఎన్టీఆర్ జిల్లా అధ్యాపకుల మెరిట్ అవార్డ్స్ విభాగంలో ఎస్ఆర్ఆర్ అండ్ సీవీ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులకు అవార్డులు ప్రకటించారని కళాశాల ప్రిన్సిపాల్ కె. భాగ్యలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పొలిటికల్ సైన్స్ అధ్యాపకుడు, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ కొల్లేటి రమేష్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ అధ్యాపకులు డి.ఎస్.వి.ఎస్.బాల సుబ్రమణ్యం, కామర్స్ అధ్యాపకులు, నోడల్ రిసోర్స్ సెంటర్ కో- ఆర్డినేటర్ డాక్టర్ అప్పారావుకు అవార్డులు అందుకోవడం అభినందనీయమన్నారు.

చిరువ్యాపారులపై వేధింపులు ఆపాలి

- సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన



సీఐటీయూ ఆధ్వర్యంలో మహంతి మార్కెట్‌లో చిరువ్యాపారుల నిరసన

గవర్నర్‌పేట, ఆగస్టు 16 : బీసెంట్ రోడ్డులో చిరువ్యాపారులపై స్థానిక కార్పొరేటర్ కక్ష సాధింపు ఆపకపోతే ఆయన అవినీతి, అరాచకాలపై ఆపార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేస్తామని సీఐటీయూ నేతలు అన్నారు. కార్పొరేటర్ తన అనుచరుల ద్వారా నెల నెలా మామూళ్లు వసూలు చేస్తున్నారు. అవి చెల్లించనివారిపై మున్సిపల్ సిబ్బందితో కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్పొరేషన్ సిబ్బంది శుక్రవారం బీసెంట్ రోడ్డులో హాకర్ షాపులను తొలగించారు. సీఐటీయూ అనుబంధ హాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బీసెంట్ రోడ్డులోని మహంతి చేపల మార్కెట్ నిరసనకు దిగారు. దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ 30 సంవత్సరాలుగా ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా వ్యాపారం చేసుకుంటున్న చిరు మహిళా వ్యాపారులను ఎందుకు తొలగించారో కార్పొరేషన్ అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వందల సంఖ్యలో బీసెంట్ రోడ్డులో హాకర్ షాపులు ఉండగా ఆ నాలుగు షాపులు మాత్రమే తొలగించడం వెనుక కక్ష సాధింపు ఉందన్నారు. ప్రభుత్వం మారిన నాటి నుంచి కార్పొరేటర్, అతని అనుచరులు నెలనెలా కప్పం కట్టమని బీసెంట్ రోడ్డులో హాకర్లను బెదిరిస్తూ బేరాలు చేస్తున్నారని ఆరోపించారు. అప్సర సెంటర్, పాత బస్టాండ్, లెనిన్ సెంటర్ ప్రాంతాల్లో కప్పం చెల్లించే వారినే ఉంచుతామని, లేకుంటే పీకించివేస్తామని అనుచరులు బెదిరింపులకు దిగుతున్నారని ఆరోపించారు. బీసెంట్ రోడ్డులో వైసీపీకి చెందిన హాకర్లు ప్రభుత్వం మారిన వెంటనే అధికార పార్టీ బ్యానర్లు కట్టడంతో వారిని వదిలివేసి, ఎన్నో ఏళ్లుగా వ్యాపారాలు చేస్తున్న వారిని తొలగించారని ఆరోపించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ పాలకులు ఉపాధి చూపించాల్సింది పోయి, చిరు వ్యాపారులపై కక్ష సాధింపు చర్యలకు దిగటం అమానుషం అన్నారు. నిరసన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎ. వెంకటేశ్వరరావు, సెంట్రల్ సిటీ అధ్యక్షుడు కె. దుర్గారావు, వై. సుబ్బారావు, టి. ప్రవీణ్, ఎం. బాబూరావు, బాలబొమ్మ లక్ష్మణ్, హాకర్స్ యూనియన్ నాయకులు మురళీ, బి. వెంకటేశ్వరరావు, హేమంతు కుమార్, వేమారెడ్డి, సూరమ్మ పాల్గొన్నారు.

'విమానాశ్రయానికి ఎన్టీఆర్ - రామోజీ పేరు పెట్టాలి'

విజయవాడ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం విమానాశ్రయానికి ఎన్టీఆర్ - రామోజీ అంతర్జాతీయ విమానాశ్రయంగా నామకరణం చేయాలని ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ సౌత్ ఇండియా సీఎం చంద్రబాబుకు లేఖ రాసింది. ఈ మేరకు అధ్యక్షుడు దీక్షప్రసాద్, కార్యదర్శి అశోక్, కోశాధికారి తరుణ్‌తేజ్ తదితరులు ఒక ప్రకటన విడుదల చేశారు. ఇదే ప్రతిపాదనను కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన నాయుడుకి అందజేశారు. పాత్రికేయులకు గత ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇస్తానని నమ్మించి ఇవ్వలేదన్నారు. కూటమి ప్రభుత్వంలో జర్నలిస్టులకు సొంతిళ్లు ఇవ్వాలని కోరారు.

హడావిడిగా వస్త్రలత కమిటీ ఎన్నికలు!

- ఏకపక్షంగా ప్రస్తుత కమిటీ నిర్ణయాలు
- లెక్కలు తెల్చిన తర్వాతే ఎన్నికలు : మెజార్టీ సభ్యులు

వన్‌టౌన్, ఆగస్టు 16: వన్‌టౌన్‌లోని వస్త్రలత నూతన కమిటీ ఎన్నికకు ప్రస్తుత కమిటీ హడావిడి చేస్తుంది. మెజార్టీ సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా ఒంటెద్దుపోకడలతో శనివారం ఎన్నికలు జరపటానికి చర్యలు చేపట్టింది. మెజార్టీ సభ్యులు మాత్రం ఆరు ఏళ్లుగా లెక్కలు చెప్పటం లేదని, లెక్కలు చెప్పిన తరువాతే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. పశ్చిమ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే అండదండలతో ప్రస్తుత కమిటీ అడ్డగోలుగా వ్యవహరించిందని, కనీసం వస్త్ర వ్యాపారుల సమస్యలు పరిష్కరించకుండా, పాత కమిటీ వసూలు చేసిన డబ్బుల వివరాల లెక్కలు తేల్చాలని సభ్యుడు కొమ్మూరి బసవరాజు ఇటీవల పాత కమిటీ కార్యదర్శి అనిల్ కుమార్‌కు లేఖ రాశారు. దీనిపై కమిటీ పట్టించుకోలేదు. అసోసియేషన్‌లో 350 మంది సభ్యులుండగా, పాత కమిటీ వ్యవహారం నచ్చక సుమారు 150 మంది తమ సభ్యత్వాలను రెన్యూవల్ చేసుకోలేదు. మిగిలిన 200 మందితోనే ఎన్నికలు నిర్వహించటానికి పాత కమిటీ హడావిడి చేస్తుంది. బైలా ప్రకారం ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి ఎన్నిక నిర్వహించి ఎన్నికైన కార్యవర్గం జాబితాను జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో నమోదు చేసుకోవాలి. కాని ప్రస్తుత కార్యవర్గం రిజిస్టర్ చేయకుండా ఆరేళ్లు కొనసాగటం నేరమని బసవరాజు అన్నారు. ప్రస్తుతం ఉన్న కార్యవర్గానికి ఎటువంటి గుర్తింపు లేదన్నారు. ప్రస్తుత కార్యవర్గం ఆస్తులు, ఆదాయం దుర్వినియోగం చేస్తుందని, ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై దౌర్జన్యానికి పాల్పడుతున్నారన్నారు. ప్రస్తుతం ఉన్న కార్యవర్గం తక్షణమే రాజీనామా చేసి అడ్‌హక్ కమిటీని నియమించి ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. శనివారం జరిగే ఎన్నికలను నిలుపుదల చేయాలని బసవరాజుతో పాటు మెజార్టీ సభ్యులు డిమాండ్ చేశారు.

చేతిరాతి పోటీల్లో ఏపీ విద్యార్థుల సత్తా

భవానీపురం, ఆగస్టు 16 : జాతీయ స్థాయి చేతిరాత పోటీల్లో రాష్ట్ర విద్యార్థులు సత్తా చాటారు. నేషనల్ బెస్ట్ హ్యాండ్ రైటింగ్ కెప్టెన్‌గా విశాఖ జిల్లా కలెక్టర్ కుమారుడు ఎ.అర్జున్ సీనియర్ లెవెల్‌లో గెలుపొందారు. ఎన్ఆర్ఐ నేషనల్ హ్యాండ్ రైటింగ్ ఆకాడమీ, అమ్మఒడి హ్యాండ్ రైటింగ్, అఖిల భారత హ్యాండ్ రైటింగ్ ట్రైనర్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ పోటీలు గత నెల 14న ఆన్‌లైన్‌లో నిర్వహించారు. సుమారు 3 లక్షల మందికి పైగా విద్యార్థులు ఈ పోటీలకు హాజరు కాగా జాతీయ స్థాయిలో సీనియర్ విభాగంలో రెండు, జూనియర్ విభాగంలో రెండు స్థానాలను రాష్ట్రం దక్కించుకుందన్నారు. సీనియర్ స్థాయిల్లో ఏలూరు జిల్లా కైకలూరు నేషనల్ హైస్కూల్‌లో చదువుతున్న సీహెచ్ లక్ష్మీ కావ్య వండర్ ఆఫ్ బెస్ట్ రైటింగ్‌లో మొదటి స్థానం, జూనియర్‌స్థాయిలో విజయవాడ ఎస్ఎస్ఎం స్కూల్లో ఐదో తరగతి చదువుతున్న అభిరామ ధన్విక్ మొదటి స్థానం, నిర్మల హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న బొప్పన ముకుంద ప్రియ తృతీయ స్థానాన్ని సాధించారన్నారు. త్వరలో గవర్నర్ నుంచి అవార్డులను అందించడం జరుగుతుందన్నారు.

ఘనంగా ఏపీ టీటీ ర్యాంకింగ్ పోటీలు

విజయవాడ స్పోర్ట్సు, ఆగస్టు 16 : ఎన్టీఆర్ జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్, థామూస్ టేబుల్ టెన్నిస్ అకాడమీ సంయుక్తంగా ఏపీ టీటీ అసోసియేషన్ పర్యవేక్షణలో కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ ఇండోర్ స్టేడియంలో టీటీ ర్యాంకింగ్ టోర్నీ శుక్రవారం ప్రారంభమైంది. వర్సిటీ స్టూడెంట్ ఎఫైర్స్ డీన్ కె.ఆర్.ఎస్.ప్రసాద్, ఏపీ టీటీఏ కార్యదర్శి పి. విశ్వనాథరావు మ్యాచ్‌లను ప్రారంభించారు. తొలి రోజు అండర్ -11,13,15,17,19 బాల, బాలి కలు, సీనియర్స్ పురుషులు, మహిళా విభాగాల్లో పోటీలు ప్రారంభం అయ్యాయి. 500 మందికి పైగా క్రీడాకారులు పాల్గొంటున్నారు. ఉమెన్స్ విభాగంలో నగరానికి చెందిన కాజోల్ సునార్ సెమీస్‌కు చేరి సత్తా చాటింది. కార్యక్రమంలో వర్సిటీ స్పోర్ట్సు డీన్ డాక్టర్ కె. హరికి షోర్, టోర్నీ కార్యనిర్వాహక కార్యదర్శి వై.దామోదర్‌రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఐకమత్యంతోనే సమస్యల పరిష్కారం

సత్యనారాయణపురం, ఆగస్టు 16 : కళాకారులు ఐక్యంగా ఉంటేనే సమస్యలు పరిష్కారమవుతాయని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త వేముల హజరత్తయ్యగుప్తా అన్నారు. అయోధ్యనగర్‌లోని నాయీబ్రాహ్మణ వాద్యవృత్తి కళాకారుల శిక్షణా కేంద్రానికి రాష్ట్రన్యాయ సలహాదారుడిగా ఉన్న ఆయనను కళాకారుల సమస్యలను ప్రభుత్వానికి నివేదించే కమిటీ చైర్మన్‌గా శనివారం ఎన్నుకున్నారు. సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో హజరత్తయ్యగుప్తాను చైర్మన్‌గా ప్రకటించారు. కార్పొరేటర్ చెన్నగిరి రామ్మోహనరావు, ఇప్పిడి రాము, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యాలమందరావు, కార్యదర్శి మురళీకృష్ణ గుప్తాను ఘనంగా సత్కరించారు.

పోలీస్ వెల్ఫేర్ డేలో 21 ఫిర్యాదులు

విజయవాడ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : పోలీసు కమిషనరేట్‌లో ప్రతి శుక్రవారం నిర్వహించే పోలీస్ వెల్ఫేర్ డేకు 21 ఫిర్యాదులు అందాయి. బదిలీలు, సర్వీసు ఇతర అంశాలకు సంబంధించి సిబ్బంది పోలీసు కమిషనర్ రాజశేఖరబాబుకు వినతులు అందజేశారు. అర్జీలను పరిష్కరించి తగు చర్యలు తీసుకోవాలని ఆయా విభాగాల అధికారులను సీపీ ఆదేశించారు.

క్రీడా ప్రాంగణాలను తీర్చిదిద్దాలి

అధికారులకు శాప్ వీసీ ఎండీ గిరిషా ఆదేశం



అధికారులతో సమీక్షిస్తున్న శాప్ నూతన వీసీఎండీ గిరిషా

విజయవాడ స్పోర్ట్సు, ఆగస్టు 16 : రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న స్టేడియంలతో పాటు కొత్త క్రీడా ప్రాంగణాలను అభివృద్ధి చేసి క్రీడాకారులకు మరింత ఉపయోగపడేలా తీర్చిదిద్దాలని శాప్ వీసీ ఎండీగా ఇటీవల పదవీ బాధ్యతలను స్వీకరించిన గిరిషా అధికారులను ఆదేశించారు. శాప్ ప్రధాన కార్యాలయంలో అన్ని విభాగాల అధికారులతో శుక్రవారం సమీక్షించారు. కేంద్ర ప్రభుత్వ సహాయ సహకారంతో కావాల్సిన నిధులను శాప్ ద్వారా సమకూర్చేందుకు చర్యలు తీసుకోవాలని, జాతీయ, అంతర్జాతీయంగా క్రీడాకారులను మరింత ప్రోత్సహించాలని కోరారు. సమావేశంలో ట్రైబల్ స్పోర్ట్సు ఆఫీసర్ వెంకటరమణ, ఈఈ ఎం.సిద్ధయ్య, వివిధ విభాగాల ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

పోలీసులకు ప్రేమజంట అప్పగింత

తిరుచానూరు, ఆగస్టు 26 : అవును.. వారిద్దరూ ఇష్టపడ్డారు. కులాలు వేరు కావడంతో యువతి తల్లిదండ్రులు అభ్యంతరం తెలిపారు. అయితే ఇంటి నుంచి పారిపోయి వచ్చి తిరుపతిలో ప్రేమ వివాహం చేసుకున్నారు. అయితే విజయవాడలో మిస్సింగ్ కేసు నమోదు కావడంతో తిరుచానూరు పోలీసులు ప్రేమికులు ఇద్దరిని తమ సంరక్షణలోకి తీసుకుని అక్కడి పోలీసులకు అప్పగించారు. విజయవాడకు చెందిన సాంబశివరావు, అలేఖ్య చౌదరి 11 ఏళ్లుగా ప్రేమించుకుంటున్నారు. యువతి తల్లిదండ్రులు పెళ్లికి అభ్యంతరం చెప్పడంతో చేసేది లేక గురువారం తిరుపతికి వచ్చి ఓ ఆలయంలో వివాహం చేసుకున్నారు. అప్పటికే అలేఖ్య తల్లిదండ్రులు విజయవాడ భవానీపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ప్రేమజంట అలేఖ్య, సాంబశివరావు శుక్రవారం తిరుచానూరు పోలీసులు తమ సంరక్షణలోకి తీసుకుని భవానీపురం పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇష్టపూర్వకంగా ప్రేమించి సాంబశివరావును పెళ్లి చేసుకున్నానని, తామిద్దరమూ మేజర్లమని, తమ తల్లిదండ్రులు, బంధువుల నుంచి ప్రాణహాని ఉందని అలేఖ్య పోలీసులను రక్షణ కోరారు. పోలీసు రక్షణలోనే విజయవాడకు పంపించాలని తిరుచానూరు సీఐ సునీల్‌కుమార్‌ను ప్రేమజంట కోరింది. అలేఖ్య తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి భవానీపురం పోలీసులకు అప్పగించారు.

ప్యాంట్రీకార్లలో తనిఖీలు



ఏలూరు రైల్వే స్టేషన్‌లో రైళ్ల ప్యాంట్రీకార్లను తనిఖీ చేస్తున్న ఎండీ అలీఖాన్ బృందం

వన్‌టౌన్, ఆగస్టు 16 : ఏలూరు రైల్వే స్టేషన్, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ప్యాంట్రీకార్లను శుక్రవారం విజయవాడ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎండీ అలీ ఖాన్ తన బృందంతో తనిఖీలు నిర్వహించారు. నాణ్యత, పరిశుభ్రతలను పరిశీలించారు. డిజిటల్ టిక్కెటింగ్, ప్రయాణికుల సేవల ప్రమాణాలపై ఆరా తీశారు. ఏలూరు స్టేషన్‌లో బుకింగ్ కౌంటర్లు, క్యూఆర్ కోడ్ల ప్రదర్శన, పార్శిల్ ఆఫీసు, క్యాటరింగ్, వాటర్ వెండింగ్ స్టాళ్లు, తదితరాలను పరిశీలించి తగు సూచనలు చేశారు. ప్రయాణికుల సౌకర్యాలు మెరుగుపరచాలని ఆదేశించారు. కోణార్క్ ఎక్స్‌ప్రెస్ ప్యాంట్రీకార్ల ఆహారపదార్థాల తయారీ, పరిశుభ్రత, నాణ్యత, గడువు తేదీలు, సిబ్బంది గుర్తింపు కార్డులు, ప్రామాణికాలు, సిబ్బందికి వైద్య ధ్రువీకరణ పత్రాలు పరిశీలించి పలు సూచనలు చేశారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, యూనిఫామ్స్, ఐడీ కార్డులను ధరించాలన్నారు. రైల్వే బోర్డు మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని కోరారు.

27న కేబినెట్ సమావేశం.. తొలిసారి పేపర్‌లెస్‌గా

అమరావతి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 27న రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరగనుంది. ఆరోజు ఉదయం 11 గంటలకు సచివాలయంలోని మొదటి బ్లాక్‌లో సమావేశాన్ని నిర్వహించనున్నారు. తొలిసారిగా పేపర్‌లెస్ కేబినెట్ జరుగనుంది.

వయనాడ్‌కు ఏపీ 10 కోట్ల సాయం

భారీ వర్షాలతో కొండచరియలు విరిగిపడి అతలాకుతలమైన కేరళలోని వయనాడ్ ప్రాంతాన్ని ఆదుకునేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూ.10 కోట్ల సాయం ప్రకటించింది. ముఖ్యమంత్రి సహాయ నిధి(సీఎంఆర్ఎఫ్) నుంచి చెక్కును కేరళ ప్రభుత్వానికి పంపించనున్నారు.



తిరుమల ఆలయం ముందు జస్టిస్ రవి, జస్టిస్ పంకజ్ మిట్టల్, జస్టిస్ రాజశేఖర్

శ్రీవారి సేవలో జడ్జీలు

తిరుమల, ఆగస్టు16(ఆంధ్రజ్యోతి): శ్రీవారిని శుక్రవారం ఉదయం సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ పంకజ్ విట్టల్, ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ చీమలపాటి రవి, జస్టిస్ రాజశేఖర్ వీఐపీ బ్రేక్ సమయంలో దర్శించుకున్నారు. రంగనాయక మండపంలో న్యాయమూర్తులను వేదపండితులు ఆశీర్వదించగా, అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

పోలవరానికి.. త్వరగా నిధులివ్వండి

ఆలస్యమైతే మరో సీజన్ కోల్పోతాం: చంద్రబాబు

- ఢిల్లీలో జలశక్తి మంత్రి పాటిల్‌తో చర్చలు
- డయాఫ్రం వాల్‌ను గతంలో నిర్మించిన సంస్థకే కొత్త వాల్ నిర్మాణ పనులు
- ఒకే ఏజెన్సీ ఉంటే బాధ్యత ఉంటుంది
- అందుకే పాత సంస్థకే వాల్ బాధ్యత: సీఎం
- నేడు ప్రధాని మోదీతో సమావేశం
- నిర్మలా సీతారామన్, అమిత్‌షాలతో కూడా



ఢిల్లీలో చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న ఎంపీలు

న్యూఢిల్లీ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి సాధ్యమైనంత త్వరగా నిధులు కేటాయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను కోరారు. లేదంటే మరో సీజన్ కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. శుక్రవారమిక్కడ శ్రమశక్తి భవన్‌లో కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, భూపతిరాజు శ్రీనివాసవర్మ, పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు, మాజీ ఎంపీ కంభంపాటి రామ్మోహన్‌రావుతో కలిసి సీఎం ఆయనతో సమావేశమయ్యారు. పోలవరంపై సుమారు 50 నిమిషాలు కూలంకషంగా చర్చించారు. 2014-19 మధ్య ప్రాజెక్టును 70 శాతం పూర్తి చేశామని చంద్రబాబు గుర్తుచేశారు. తమ ప్రభుత్వమే కొనసాగి ఉంటే 2025కల్లా ప్రాజెక్టు పూర్తవడానికి ఆస్కారం ఉండేదన్నారు. అయితే 2019లో వచ్చిన జగన్ ప్రభుత్వ అవగాహనరాహిత్యంతో తీరని నష్టం జరిగిందని తెలిపారు. 'పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ), కేంద్ర జలసంఘం హెచ్చరించినా వినకుండా రివర్స్ టెండరింగ్‌కు వెళ్లారు. కాంట్రాక్టులను ఏకపక్షంగా రద్దు చేశారు. కాంట్రాక్టరును మార్చడం వల్లే పనుల్లో జాప్యం జరిగింది. 13 నెలల కాలం పనులు చేయకపోవడం వల్ల ఎగువ కాఫర్ డ్యాం నిర్మాణం పూర్తికాలేదు. దీంతో డయాఫ్రం వాల్ దెబ్బతింది. ఐఐటీ (హైదరాబాద్) నిపుణులు, కాగ్ ఇచ్చిన నివేదికలోనూ ఇదే చెప్పారు. పాత ఏజెన్సీనే కొనసాగించి ఉంటే 2019 జూన్ నుంచి జూలై నాటికి ఎగువ కాఫర్ డ్యాం పూర్తయి ఉండేది. ఈసారి ఆ తప్పిదాలు పునరావృతం కాకుండా చూస్తున్నాం. గతంలో డయాఫ్రం వాల్ నిర్మించిన సంస్థకే కొత్త వాల్ బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించాం. ఒకే ఏజెన్సీ ఉంటే నిర్మాణంపై బాధ్యత ఉంటుందనేది మా అభిప్రాయం. ప్రాజెక్టు నాణ్యత, భద్రత విషయంలో ఇబ్బంది రాదని భావిస్తున్నాం. జలశక్తి శాఖ, పీపీఏ సహా అందరూ ఇదే అభిప్రాయం వ్యక్తంచేశారు. కొత్త డయాఫ్రంవాల్ నిర్మాణానికి అనుగుణంగా యంత్రాలను తరలించాల్సి ఉంటుంది. ఇదే విషయంపై రాష్ట్ర కేబినెట్‌లో చర్చించాం. కేబినెట్ నిర్ణయాన్ని కేంద్రానికి కూడా తెలియజేశాం. పోలవరం ప్రాజెక్టుకు నిధులు ఖర్చు చేసేందుకు ఇన్వెస్ట్‌మెంట్ బోర్డు ఆమోదం తెలిపింది. ముందు కొత్త డయాఫ్రం వాల్ కట్టాలి. తర్వాత ఎర్త్ కం రాక్ ఫిల్(ఈసీఆర్ఎఫ్) డ్యాం నిర్మించాలి. కాఫర్ డ్యాంలు కొంత తగ్గించి.. సీపేజ్ మొత్తం ఎత్తిపోస్తూ వాల్ పూర్తి చేయాల్సి ఉంటుంది. రెండు సీజన్ల కంటే ముందే దీనిని కట్టేస్తే ఈసీఆర్ఎఫ్ డ్యాం పనులు చేపట్టవచ్చు. వరద తగ్గిన వెంటనే మొదలు పెడితే పనులు కొలిక్కి రావడానికి రెండు సీజన్లు పట్టే అవకాశం ఉంది. త్వరగా నిధులు మంజూరు చేయండి. లేదంటే మరో సీజన్ కోల్పోతాం' అని పాటిల్ దృష్టికి చంద్రబాబు తీసుకెళ్లినట్లు సమాచారం.

నేడు ప్రధాని, కేంద్ర మంత్రులతో..

పోలవరం ప్రాజెక్టు, అమరావతి నిర్మాణంతోపాటు కేంద్రం నుంచి అందాల్సిన ఆర్థిక చేయూత తదితర అంశాలపై ఢిల్లీ పెద్దలతో చర్చించేందుకు చంద్రబాబు శుక్రవారం సాయంత్రం ఢిల్లీ వచ్చారు. విమానాశ్రయంలో ఆయనకు రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులతోపాటు టీడీపీ ఎంపీలు ఘన స్వాగతం పలికారు. తొలిరోజు జలశక్తి మంత్రిని సీఎం కలిశారు. రెండోరోజు శనివారం ప్రధాని మోదీతో సమావేశమవుతారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, హోం మంత్రి అమిత్ షాలనూ కలువనున్నట్లు సమాచారం.

కృష్ణ చివుకులకు చంద్రబాబు అభినందనలు

ఐఐటీ మద్రాసుకు రూ.228 కోట్లు భారీ విరాళం ఇచ్చిన తెలుగు తేజం కృష్ణ చివుకులను సీఎం చంద్రబాబు అభినందించారు. చివుకుల గురించి టీడీపీ ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయులు, కలిశెట్టి అప్పలనాయుడు శుక్రవారం రాత్రి ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా కృష్ణ చివుకులతో చంద్రబాబు ఫోన్లో మాట్లాడారు.

24 గంటలపాటు వైద్య సేవలు బంద్: ఐఎంఏ



కోల్‌కతాలో జూనియర్ మహిళా డాక్టర్‌పై జరిగిన అత్యాచారం, హత్యకు నిరసనగా శుక్రవారం విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో ఐఎంఏ, జూడాల ఆధ్వర్యంలో జరిగిన కొవ్వొత్తుల నిరసన ప్రదర్శన

అమరావతి/విశాఖపట్నం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వైద్యులు, ముఖ్యంగా మహిళా వైద్యులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ, కోల్‌కత్తాలోని ఆర్‌జి.కర్ మెడికల్ కాలేజీలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటనలో నిందితుల్ని శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ దేశ వ్యాప్తంగా ఆందోళనకు పిలుపునిచ్చింది. శనివారం ఉదయం ఆరు గంటల నుంచి ఆదివారం(18వ తేదీ) ఉదయం ఆరు గంటల వరకు దేశ వ్యాప్తంగా వైద్య సేవలను నిలిపివేస్తున్నట్టు ప్రకటించింది. అత్యవసర సేవలు మినహా మిగిలిన వైద్య సేవలు నిలిపివేయాలని నిర్ణయించారు. దేశ వ్యాప్తంగా సెంట్రల్ మెడికల్ రక్షణ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని, మెడికల్ కాలేజీలు, ఆస్పత్రులను సేఫ్ జోన్‌గా ప్రకటించి రక్షణ చర్యలు తీసుకొనే ఆర్డినెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ సమ్మెకు పిలుపునిచ్చారు. కాగా, ఆందోళనలో భాగంగా 24గంటల పాటు ప్రభుత్వ ప్రైవేటు ఆస్పత్రుల్లో అత్యవసర వైద్యం మినహా ఓపీ, ఐపీ, స్కానింగ్స్, ఇతర సేవలను పూర్తిగా నిలిపివేస్తున్నట్టు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జయచంద్రనాయుడు విశాఖపట్నంలో ప్రకటించారు.

'ఫైబర్' దొంగలు ఇప్పటికీ సేఫ్!

కార్పొరేషన్‌లో ఇంకా జగన్ మనుషులే..సీఎం సమీక్షలకూ వారే హాజరు

ఓవైపు సొంతపార్టీ ఎమ్మెల్సీ ఫిర్యాదు.. మరోవైపు అక్రమార్కులకే మర్యాదలు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

వందల కోట్ల రూపాయల ఆర్థిక అక్రమాలకు పాల్పడ్డ దొంగలే 'ఫైబర్ నెట్'లో అల్లుకుపోయారు. ఇంటి దొంగలు దర్జాగా తిరుగుతుంటే.. అధికార యంత్రాంగం ప్రేక్షకపాత్ర పోషిస్తోంది. ఇంటిని ప్రక్షాళన చేయాలంటే మురికిని తీసేయాలి. కార్యాలయాల్లో అవినీతి మురికిని శుభ్రం చేయాలంటే.. అందుకు కారకులైన వారిని పక్కకు తప్పించాలి. కానీ... కూటమి ప్రభుత్వం కొలువు తీరి రెండు నెలలు దాటినా ఇప్పటికీ ఈ దిశగా అడుగులు వేయడంలేదు. ఫైబర్‌నెట్ కార్పొరేషన్ ఎండీ మధుసూదన రెడ్డికి ఉద్వాసన పలికి, తాజాగా సస్పెండ్ చేసినప్పటికీ ఐదేళ్ల అక్రమాల్లో కీలక పాత్ర పోషించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అసిస్టెంట్ జనరల్ మేనేజర్లు, మేనేజర్లు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లను యథాతథంగా కొనసాగిస్తోంది. ఫైబర్ నెట్‌పై ఎన్ని సమీక్షలు పెట్టినా... 'అంతా ఓకే. ఎలాంటి అక్రమాలు జరగలేదు' అనే వీరు నివేదికలు ఇవ్వడం సహజం. ఇక... ఫైబర్‌నెట్ కార్పొరేషన్‌లో జరిగే అక్రమాలు బయటికి వచ్చేదెలా? ఫైబర్‌నెట్ కొత్త మేనేజింగ్ డైరెక్టర్ నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు దాకా నిర్వహించే సమీక్షల్లో 'తాడేపల్లి' మనుషులే దర్జాగా కూర్చుంటున్నారు. వీరికి ఎలాంటి అర్హతలు లేనప్పటికీ ఉన్నత స్థానాల్లో కూర్చోబెట్టి లక్షల్లో జీతాలు... భారీగా భత్యాలు ఇచ్చారు. సర్కారు మారినా వీరంతా కొత్త అల్లుళ్ల తరహాలో మర్యాదలు పొందుతున్నారు. ఇదేవిటని ప్రశ్నిస్తే.. 'అవగాహన చేసుకుంటున్నాం' అని సంబంధిత మంత్రి అధికారులు చెబుతున్నా రు. నాటి ఎండీ మధుసూదన్ రెడ్డి ఇష్టారాజ్యంగా తన సొంత మనుషులను ఫైబర్ నెట్ కార్పొరేషన్‌లో నింపేశారు. ప్రభుత్వం మారగానే... మధుసూదన్ రెడ్డిని తప్పించేశారు. ఆయనతోపాటు అక్రమా ల్లో కీలక పాత్ర పోషించిన వారు మెల్లగా అక్కడి నుంచి జారుకున్నారు. కానీ... ఇప్పటికీ అనేక మంది పాత సిబ్బంది అక్కడ కీలక స్థానాల్లో కొనసాగుతున్నారు. వారిలో... పిల్లా జగన్మోహన్ ఒకరు. గత ప్రభుత్వ హయాంలో జగన్మోహన్‌ను ఫైబర్‌నెట్‌లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆపరేషన్స్‌గా నియమించారు. ఆయనకు ఏమాత్రం సాంకేతిక పరిజ్ఞానంలేదు. ఈ పోస్టుకు ఆయన అనర్హుడని చెబుతున్నా.. అప్పటి ఎండీ మధుసూదన్ రెడ్డి పట్టించుకోలేదని, ఏరికోరి ఈడీ సీటులో కూర్చోబెట్టారని సంస్థ సిబ్బంది బాహాటంగానే చెబుతుంటారు. జగన్మోహన్‌కు జీతంకంటే.. అదనపు సౌకర్యాలే ఎక్కువని కూడా చెబుతారు. నెలవారీ కారు వాడకానికి ఇచ్చే సొమ్ముతో ఏడాదిలో కొత్తకారే కొనేయవచ్చని వ్యాఖ్యానిస్తుంటారు. జగన్మోహన్‌ను ఇప్పటికీ ఈడీగానే కొనసాగుతున్నారు. ఇంకా చెప్పాలంటే మరింత కీలకంగా మారారని ప్రచారం సాగుతోంది. మాజీ ఎండీ మధుసూదన్‌రెడ్డితో కలసి అక్రమాలకు పాల్పడ్డారంటూ ఆరోపణలు వచ్చిన జగన్మోహన్.. ఎండీ నుంచి సీఎం చంద్రబాబు వరకూ నిర్వహించే సమీక్షల్లో తన అస్మదీయ సిబ్బందితో పాల్గొంటున్నారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన కూటమి ప్రజా ప్రతినిధులకు సన్నిహితమై.. వారి సిఫారసులతో 'సేఫ్' సాగిపోతున్నారు.

ఇలాగైతే జరిగేదేమిటి..

ఫైబర్‌నెట్‌లో 2019 నుంచి 2024 దాకా జరిగిన అక్రమాలపై విజిలెన్స్ విచారణ జరిపించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్‌ను టీడీపీ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డి బుధవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కోరారు. గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలపై లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అక్రమాలకు సహకరించిన ఏజీఎం లేబాకు భాస్కర రెడ్డి, గ్రీన్‌లాంతర్న్ ఎంఈ శేషిరెడ్డి, ఫైబర్‌నెట్ మేనేజర్ కిరణ్ కుమార్ రెడ్డి, ఏజీఎం ఉయ్యూరు గుణశంశాక్ రెడ్డిలపై కేసు నమోదు చేయాలన్నారు. అక్రమాల్లో అప్పటి ఎండీ మధుసూదన్ రెడ్డితోపాటు వీరంతా కీలక పాత్ర పోషించినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్సీ రామ్‌గోపాల్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదుపై ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో చూడాలి మరి!



మెట్టు రామచంద్రప్రసాద్‌కు హనుమజ్జానకీరామశర్మ అవార్డు ప్రదానం చేస్తున్న వెంకయ్య నాయుడు

విద్యావిధానాన్ని సంస్కరించాలి

- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

నెల్లూరు(సాంస్కృతికం), ఆగస్టు 16: ఆంగ్లేయులు ప్రవేశపెట్టిన విద్యా విధానాన్ని సంస్కరించాల్సిన అవసరం ఉందని, కుటుంబం, సమాజంపై అభిరుచిని పెంచే భారతీయ విద్యా విధానం రావాలని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. హైదరాబాద్‌కు చెందిన తెలంగాణ సారస్వత పరిషత్, నెల్లూరుకు చెందిన పద్మకళాపరిషత్ సంయుక్తంగా శుక్రవారం నెల్లూరు పురమందిరంలో బ్రహ్మశ్రీ పోలూరి హనుమజ్జానకీరామశర్మ శత జయంతి వేడుక నిర్వహించింది. విశిష్ట అతిథిగా హాజరైన వెంకయ్య నాయుడు.. నెల్లూరు పద్మకళాపరిషత్ అధ్యక్షుడు మెట్టు రామచంద్రప్రసాద్‌కు హనుమజ్జానకీరామశర్మ స్మారక పురస్కారాన్ని ప్రదానం చేశారు. అనంతరం ప్రసంగిస్తూ ఇప్పటి విద్యా విధానం కుటుంబ విలువలు, ప్రకృతితో మమేకం వంటి సంస్కారాలు నేర్పడం లేదని, దానిని సంస్కరించి భారతీయ విద్యావిధానాన్ని అమలు చేయాలని సూచించారు. తల్లి, తండ్రి, గురువులను గౌరవించే సంస్కారం నేటి యువతలో లేదన్నారు. సామాజిక సంస్కారం లేనందునే చిన్న వయసులో అత్యాచారాలకు, ఆత్మహత్యలకు పాల్పడే బలహీనతలు చోటుచేసుకుంటున్నాయన్నారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, తెలంగాణ సారస్వత పరిషత్ కార్యదర్శి జే. చెన్నయ్య, ప్రపంచ తెలుగు మహాసభ ప్రాంతీయ ఛైర్మన్ నలబోలు బలరామయ్యనాయుడు ప్రసంగించారు. ఆకాశవాణి రిటైర్డ్ డైరెక్టరు అనంతపద్మనాభరావు అధ్యక్షత వహించారు.

సమాజ సేవను జీవితంలో భాగంగా చేసుకోవాలి

వెంకటాచలం: ఆపన్నులకు కృత్రిమ పరికరాలను అందించడం ఉదాత్త కార్యక్రమమని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. నెల్లూరు జిల్లా వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రాంగణంలో భగవాన్ మహావీర్ వికలాంగ్ సహాయ సమితి(హైదరాబాద్), స్వర్ణభారత్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జైపూర్ ఫుట్ కృత్రిమ అవయవాల అమరిక శిబిరాన్ని శుక్రవారం మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. లబ్ధిదారులకు వీల్ చైర్లు, వాకర్లు, క్రచెస్‌ను పంపిణీ చేశారు.

ఎమ్మెల్సీగా బొత్స ఏకగ్రీవ ఎన్నిక

విశాఖపట్నం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖపట్నం జిల్లా స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీగా వైసీపీ అభ్యర్థి, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఉపఎన్నికలో పోటీకి దూరంగా ఉండాలని పాలక టీడీపీ కూటమి నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. షెడ్యూల్ ప్రకారం నామినేషన్ల ఉపసంహరణ గడువు శుక్రవారం మధ్యాహ్నం ముగిసిన తర్వాత బొత్స ఎన్నికను రిటర్నింగ్ అధికారి, విశాఖపట్నం జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ అధికారికంగా ప్రకటించారు.

పాత ఏజెన్సీకే బాధ్యతపై ఏకాభిప్రాయం: నిమ్మల

కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణ బాధ్యతలు పాత సంస్థకే అప్పగించాలని కేంద్ర జలశక్తి మంత్రితో భేటీ సందర్భంగా ఏకాభిప్రాయానికి వచ్చినట్లు రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. డ్యాం భద్రత దృష్ట్యా కొత్త వాల్ నిర్మించడమే మేలని అంతర్జాతీయ నిపుణులు చేసిన సూచనపై చర్చించామన్నారు. 'కొత్త డయాఫ్రం వాల్ కట్టడానికి పాత ఏజెన్సీని కొనసాగించాలా.. లేదా కొత్తగా టెండర్లు పిలవాలా అనే అంశం చర్చకు వచ్చినప్పుడు అందరూ ఏకాభిప్రాయంతో పాత సంస్థకే మొగ్గు చూపారు. ఒకే పనిని రెండు ఏజెన్సీలు చేస్తే నాణ్యత, భద్రత పరమైన సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, నిర్మాణ పనులు ఆలస్యమవుతాయనే ఈ అభిప్రాయానికి వచ్చాం. పోలవరం ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్‌కు వరం.. జీవనాడి. భవిష్యత్‌లో కరువురహిత రాష్ట్రంగా మార్చే శక్తి దానికి ఉంది. ఈ ప్రాజెక్టు విభిన్నమైనది. నదీ ప్రవాహ మార్గాన్ని మళ్లించి నిర్మించే ప్రాజెక్టు. అలా ప్రవాహ మార్గాన్ని మళ్లించినప్పుడు డ్యాంపై భారం పడకుండా గైడ్ బండ్ నిర్మాణం చేపట్టారు. దురదృష్టవశాత్తూ అది కూడా కుంగిపోయింది. దీనిపై జలసంఘం ఏం చెబుతుందో చూసి ఆ ప్రకారం నిర్ణయం తీసుకుంటాం' అని చెప్పారు. అంతకు ముందు నిమ్మల జలశక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీతో సమావేశమయ్యారు. కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణ బాధ్యతలను అనుభవం కలిగిన జర్మన్ సంస్థ బావరేకే అప్పగించాలని కోరారు. ఈ దశలో పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) అధికారులు జోక్యం చేసుకుని.. 2019లో కాంట్రాక్టు సంస్థను మార్చడం వల్ల దుష్పరిణామాలు ఎదురయ్యాయని.. మళ్లీ ఇప్పుడు కొత్త సంస్థకు పనులు అప్పగించడంపై స్థిరమైన నిర్ణయం తీసుకోవాలని సూచించారు. కొత్త వాల్ నిర్మాణానికి తక్షణమే డిజైన్లు రూపొందించి.. కార్యాచరణ సిద్ధం చేయాలని నిమ్మల కోరారు. అదేవిధంగా నిర్మాణ పనులకు ఎలాంటి అవరోధమూ లేకుండా నిరంతరాయంగా నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్, సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ నరసింహమూర్తి తదితరులు ఉన్నారు.

జైలుకైనా పంపండి.. ఇంటికి మాత్రం వెళ్లను!

- భార్య హింస భరించలేకపోతున్నా
- పోలీసులకు తేల్చిచెప్పిన బెంగళూరు టెకీ

బెంగళూరు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): తనపై ఏ కేసు అయినా పెట్టుకోవాలని, అవసరమైతే జైలుకైనా పంపండని, ఇంటికి మాత్రం వెళ్లబోనని 34 ఏళ్ల సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ విపిన్ గుప్త బెంగళూరు పోలీసులకు తేల్చి చెప్పారు. భార్య పెట్టే మానసిక హింసను భరించలేకపోతున్నానని, వేధింపులు తట్టుకోలేనని వాపోయారు. ఈ నెల మొదటి నుంచి ఆయన కనిపించకుండాపోవడంపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. చివరికి ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో ఉన్నట్లు గుర్తించారు. బెంగళూరుకు రప్పించగా, ఇంటికి వెళ్లేందుకు మాత్రం ఆయన ససేమిరా అంటున్నారు. యూపీలోని లఖ్‌నవూకు చెందిన విపిన్ గుప్త బెంగళూరు మాన్యతా టెక్ పార్క్‌లోని ఓ ప్రముఖ కంపెనీలో పనిచేస్తున్నారు. ఆయన భార్య శ్రీపర్ణ వయసు 42 సంవత్సరాలు. వీరికి ఇద్దరు సంతానం. బెంగళూరులోని కొడిగేహళ్లి టాటానగర్‌లో వీరు నివసిస్తున్నారు. ఇటీవల ఇంటి నుంచి బైక్‌పై బయల్దేరిన విపిన్ గుప్త బ్యాంకులో రూ.1.80 లక్షలు డ్రా చేసి, ఎటో వెళ్లిపోయారు. ఆయనకు సోలో రైడ్ అలవాటు ఉంది. గతంలో పలుమార్లు



వివిధ ప్రాంతాలకు వెళ్లి వచ్చారు. అయితే, ఫోన్‌లో ఎప్పుడూ అందుబాటులో ఉండేవారు. ఈసారి ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి ఉండడం, వారం అయినా జాడలేకపోవడంతో భార్య ఈ నెల 6న కొడిగేహళ్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం తన భర్త ఆచూకీ కనుగొనడంలో పోలీసులు విఫలమయ్యారని, నిర్లక్ష్యం చేస్తున్నారంటూ ఆమె 'ఎక్స్' లో పోస్ట్ చేయడంతోపాటు ప్రధానమంత్రికి ట్యాగ్ చేశారు. దీంతో పోలీసులు దర్యాప్తు వేగం పెంచి నోయిడాలో ఆయన ఉన్నట్లు గుర్తించారు. అక్కడి నుంచి బుధవారం బెంగళూరుకు రప్పించగా, ఇంటికి వెళ్లేందుకు విపిన్ నిరాకరించారు.

నగరాల సమీపంలో కూరగాయల సాగు!

- రూ.2 వేల కోట్లతో 50 క్లస్టర్ల ఏర్పాటుకు ప్రణాళికలు

న్యూఢిల్లీ, ఆగస్టు 16: కురగాయల ధరలు అదుపులోకి తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం సరికొత్త పథకాన్ని ముందుకు తీసుకురానుంది. పట్టణాలు, నగరాలకు సమీపంలో కురగాయల సాగును ప్రోత్సహించాలని నిర్ణయించింది. వచ్చే ఐదేళ్లలో, 20 లక్షల జనాభా కలిగిన పట్టణాలు, నగరాలకు సమీపంలో 50 వెజిటబుల్ క్లస్టర్లు ఏర్పాటుకు కేంద్రం రంగం సిద్ధం చేస్తోంది. ప్రభుత్వ ప్రయివేట్ భాగస్వామ్యంతో కురగాయల సాగు, సరఫరాను చేపట్టే ఈ కార్యక్రమం కోసం రూ.2 వేల కోట్లను వెచ్చించే అవకాశం ఉంది. ఈ పథకం కింద కురగాయలు, పండ్ల సేకరణ, నిల్వ చేయడం వంటి వాటి కోసం ఏజెన్సీలను ఎంపిక చేసి వాటికి ఆర్థిక మద్దతునిస్తారు. ఈ ప్రతిపాదనలను త్వరలోనే కేంద్ర కేబినెట్ ఆమోదానికి పెట్టే అవకాశం ఉంది.

లోకం తీరు



'ఆంధ్రజ్యోతి' జర్నలిస్ట్ కారుసాల వెంకటేష్‌కు..

మోటూరు స్మారక ఉత్తమ అవార్డు

- 20న విజయవాడలో పురస్కార ప్రదానం



అమరావతి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రజాశక్తి పూర్వ సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మారకార్థం ఏటా ప్రకటిస్తున్న ఉత్తమ జర్నలిస్టు అవార్డును ఈ ఏడాది 'ఆంధ్రజ్యోతి' పాత్రికేయుడు కారుసాల వెంకటేశ్‌కు లభించింది. 'ఆంధ్రజ్యోతి'లోని మహిళా శీర్షిక 'నవ్య'లో 'అప్పట్లో మా కోడ్ రాబ్సన్', 'ఎమ్మెల్యే అయ్యాక కూడా చెప్పులు కుట్టేవారు', 'చౌరబాటుదారులు అనడం అన్యాయం'.. వంటి శీర్షికలతో వెంకటేశ్ (కలం పేరు సాంత్వన్) రాసిన కథనాలు, ఇంటర్వ్యూలు మానవాసక్తితోపాటు సామాజిక ప్రయోజనాన్ని కలిగి ఉన్నాయని అవార్డు కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన కమ్యూనిస్టు నేత ఉప్పల మల్సూర్, తెలంగాణ సాయుధ పోరాటంలో కొరియర్‌గా సేవలందించిన అవధీశ్‌రాణి (రాజ్ బహదూర్ గౌర్ సోదరి), 'నేనొక ట్రాన్స్‌కు తల్లిని' శీర్షిక కింద మాతృ ప్రేమకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన 'ముకుంద మాల', 'ఉద్యోగం విడిచి పెట్టి ఆదర్శంతో జట్టుకట్టి'న వెనిగండ్ల పద్మజ, 'చదువు కొనలేని అమ్మాయిలకు' కొండంత అండగా నిలిచిన తాటి సరోజ తదితరులపై వెంకటేశ్ అందించిన ఇంటర్వ్యూలను పరిశీలించామని కమిటీ తెలిపింది. సీనియర్ సంపాదకులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి.అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన అవార్డు ఎంపిక కమిటీ ఇటీవల సమావేశమై.. అవార్డుకు వచ్చిన ప్రతిపాదనలను పరిశీలించింది. ఎంట్రీలు వైవిధ్యభరితంగాను, హృద్యంగాను, వాస్తవ పరిస్థితులకు దర్పణం పట్టేవిగాను ఉన్నాయని కమిటీ సంతృప్తి వ్యక్తం చేసింది. అంతిమ పరిశీలనలో కారుసాల వెంకటేశ్‌ను అవార్డుకు ఎంపిక చేశామని తెలిపింది. ఈనెల 20న విజయవాడ ఎంబీ విజ్ఞాన కేంద్రంలో జరిగే సభలో అవార్డు ప్రదానం జరుగుతుందని ప్రజాశక్తి సాహితీ సంస్థ ప్రధాన కార్యదర్శి ఎం.వి.ఎస్.శర్మ తెలిపారు. కాగా, 2002 నుంచి మోటూరు స్మారక అవార్డును క్రమం తప్పకుండా (కరోనా రెండేళ్లు మినహా) అందజేస్తున్నారు.

చంపేస్తారేమోనని భయమేస్తోంది: సౌదీ యువరాజు

న్యూఢిల్లీ, ఆగస్టు 16: ఇజ్రాయెల్‌తో శాంతి ఒప్పందం తన ప్రాణాల మీదకు తెస్తోందని అమెరికా చట్ట సభ్యుల ముందు సౌదీ యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్ ఆందోళన వ్యక్తం చేశారు. పాలస్తీనా ఆందోళనలు పట్టించుకోకుండా సౌదీ అరేబియా-ఇజ్రాయెల్ మధ్య సంబంధాలను సాధారణస్థితికి తీసుకొస్తే.. తనను చంపుతారేమోనని భయమేస్తోందంటూ వాపోయారు. ఇజ్రాయెల్‌తో శాంతి ఒప్పందం చేసుకుని ఉగ్రవాదుల చేతుల్లో హత్యకు గురైన ఈజిప్టు మాజీ అధ్యక్షుడు అన్వర్ సాదత్ విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. సాదత్ భద్రత విషయమై ఆనాడు అమెరికా ఏం చర్యలు తీసుకుందని ఆయన ఆరా తీసినట్లు ఆ దేశ డిజిటల్ వార్తాపత్రిక 'పొలిటికో' పేర్కొంది. అయితే తనకు ప్రాణభయమున్నప్పటికీ ఇజ్రాయెల్‌తో సంబంధాల విషయంలో తాను ముందుకెళ్లడానికే నిశ్చయించుకున్నట్లు సౌదీ యువరాజు స్పష్టం చేశారు.

రెండు రాష్ట్రాల్లో ఎన్నికల నగారా

జమ్మూకశ్మీర్, హరియాణా అసెంబ్లీ ఎన్నికల షెడ్యూలు విడుదల

- జమ్మూకశ్మీర్ శాసనసభకు 3 దశల్లో
- హరియాణా అసెంబ్లీకి అక్టోబరు 1న
- 2 రాష్ట్రాల్లోనూ అక్టోబరు 4న ఫలితాలు

న్యూఢిల్లీ, ఆగస్టు 16: రెండు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల నగరా మోగింది. జమ్ముకశ్మీర్‌లో మూడు దశల్లో (సెప్టెంబరు 18, 25, అక్టోబరు 1).. హరియాణాలో అక్టోబరు 1న శాసనసభ ఎన్నికలు నిర్వహించనున్నట్టు కేంద్ర ఎన్నికల కమిషన్ శుక్రవారం వెల్లడించింది. అక్టోబరు 4న కౌంటింగ్ జరిపి ఫలితాలను ప్రకటించనున్నట్టు తెలిపింది. ఆర్టికల్ 370 నిర్వీర్యం తర్వాత.. జమ్ముకశ్మీర్‌లో ఎన్నికలు జరగడం ఇదే మొదటిసారి. చివరిసారిగా అక్కడ 2014లో ఐదు దశల్లో ఎన్నికలు జరిగాయి. అప్పట్లో ఏర్పాటైన పీడీపీ-బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం 2018లో పడిపోయింది. ఆ తర్వాత జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మోదీ 2.0 సర్కారు ఏర్పాటయ్యాక.. 2019 ఆగస్టు 5న.. జమ్ముకశ్మీర్‌కు స్వతంత్ర ప్రతిపత్తి కల్పించే 370 అధికరణను రద్దు చేసింది. ఆ నిర్ణయం సరైనదేనని పేర్కొంటూ గత ఏడాది డిసెంబరులో తీర్పునిచ్చిన ఐదుగురు సభ్యుల సుప్రీం రాజ్యాంగ ధర్మాసనం.. ఈ ఏడాది సెప్టెంబరు 30లోగా ఆ రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు జరిపించాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలోనే ఎన్నికల కమిషన్ షెడ్యూలు ప్రకటించింది. అయితే, మూడో దశ ఎన్నిక.. అక్టోబరు 1న, అంటే సుప్రీంకోర్టు పెట్టిన గడువు (సెప్టెంబరు 30) తర్వాత జరగడంపై కేంద్ర ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్‌ను మీడియా ప్రశ్నించింది. దీనికి ఆయన.. కోర్టు తీర్పునిచ్చింది 2023 డిసెంబరులో అని, ఆ వెంటనే సార్వత్రిక ఎన్నికలువచ్చాయని గుర్తుచేశారు. ఆ ఎన్నికల ప్రక్రియ జూన్ 4 నాటికి ముగిసిందని.. ఆ తర్వాత వాతావరణం బాగోలేదని, అమర్‌నాథ్‌యాత్ర మొదలైందని.. ఆ యాత్ర ఆగస్టు 19న ముగుస్తోందని పేర్కొన్నారు. కశ్మీర్‌లో పండగల సీజన్, యాపిల్స్ సీజన్, ట్యులిప్స్ సీజన్.. ఇలా అన్నింటినీ దృష్టిలో పెట్టుకుని ఈ తేదీలు ఎంపిక చేశామని చెప్పారు. ఒక్కరోజు అటూ ఇటూ అవడం పెద్ద విషయమేమీ కాదని.. సుప్రీం కోర్టు తీర్పు స్ఫూర్తికి అనుగుణంగా ఎన్నికలు నిర్వహిస్తున్నామా లేదా అన్నదే ముఖ్యమని స్పష్టం చేశారు. అయినా, ఈ ఎన్నికలు సుప్రీం పెట్టిన గడువులోపే మొదలవుతున్నాయని.. నిర్ణీత షెడ్యూలు ప్రకారం ముగుస్తాయని స్పష్టం చేశారు. ఎన్నికల నిర్వహణను తామేమీ ఆలస్యం చేయలేదని తేల్చిచెప్పారు. జమ్ముకశ్మీర్‌లో 90 లక్షల మంది రిజిస్టర్డ్ ఓటర్లున్నారని.. ఈ ఏడాది అక్కడ జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 58.46 శాతం మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని.. ఇది మూడున్నర దశాబ్దాల గరిష్ఠమని గుర్తుచేశారు. కాగా, జమ్ముకశ్మీర్ మొత్తం 90 స్థానాలకుగాను.. సెప్టెంబరు 18న తొలి దశలో 24 స్థానాలకు, రెండో దశలో 26 సీట్లకు.. మూడో దశలో 40 సీట్లకు ఎన్నికలు నిర్వహించనున్నారు.



విలేకరుల సమావేశంలో ఎన్నికల కమిషనర్లు జ్ఞానేశ్, రాజీవ్‌కుమార్, సుఖ్‌బీర్

మహారాష్ట్రలో ఇప్పుడే కాదు!

గత మూడు దఫాలుగా (2009, 2014, 2019) హరియాణాతోపాటే మహారాష్ట్రలోనూ ఎన్నికలు నిర్వహించారు. ఆ లెక్క ప్రకారం ఇప్పుడు హరియాణాతో పాటే అక్కడ కూడా ఎన్నికలు జరపాలి. కానీ మహారాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికల షెడ్యూలు ప్రకటించలేదు. దీనిపై సీఈసీని ప్రశ్నించగా.. జమ్ముకశ్మీర్‌లో భారీస్థాయిలో భద్రతా ఏర్పాట్లు చేయాల్సి ఉందని.. మహారాష్ట్రలో ప్రస్తుతం వానాకాలం కారణంగా ఓటర్ల జాబితా అప్‌డేట్ చేయడం ఆలస్యమవుతోందని.. దీనికితోడు పితృపక్షాలు, వినాయక చవితి, దీపావళి వంటి పండుగలు, ఆధ్యాత్మిక కార్యక్రమాల సీజన్ నడుస్తోందని.. కాబట్టి మహారాష్ట్ర ఎన్నికల షెడ్యూలును తర్వాత ప్రకటిస్తామని సమాధానమిచ్చారు. ఈ రెండు రాష్ట్రాల్లో ఎన్నికలు పూర్తయ్యాక.. మహారాష్ట్ర, ఝార్ఖండ్, ఢిల్లీ ఎన్నికలను నిర్వహించే అవకాశం ఉందని సమాచారం. కాగా.. మహారాష్ట్రలో ఎన్నికలు నిర్వహించకపోవడానికి కేంద్ర ఎన్నికల కమిషన్ చెప్పిన కారణాలపై శివసేన (ఉద్ధవ్ వర్గం) నేత ఆదిత్య ఠాక్రే స్పందించారు. "బహుశా వారి బాస్ (కేంద్రప్రభుత్వం) మహారాష్ట్రలో ఎన్నికలు నిర్వహించడానికి ఇంకా అనుమతి ఇచ్చి ఉండకపోవచ్చు" అని వ్యంగ్యంగా ట్వీట్ చేశారు. "మహారాష్ట్రలో ప్రస్తుతం అధికారంలో ఉన్న రాజ్యాంగవిరుద్ధమైన, చట్టవిరుద్ధమైన బీజేపీ-మిందే సర్కారుకు కొనసాగే నైతిక అర్హత లేదు. ప్రజలు వారిని ఒకసారి తిరస్కరించారు. మళ్లీ తిరస్కరిస్తారు. అందుకే ఈసీ వారికి కాస్త ఊపిరి పీల్చుకోవడానికి, రాష్ట్రాన్ని లూటీ చేయడానికి వారి కాంట్రాక్టర్లకు సమయం ఇస్తోంది" అని దుయ్యబట్టారు. మరోవైపు.. ఎన్నికల షెడ్యూలు ప్రకటనకు 12 గంటల ముందు జమ్ముకశ్మీర్‌లో భారీస్థాయిలో 198 మంది ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. వీరిలో ఐదుగురు డిప్యూటీ కమిషనర్లు, 10 మంది సీనియర్ సూపరింటెండెంట్స్ ఆఫ్ పోలీస్ సహా 83 మంది పోలీసు అధికారులున్నారు.

ఆర్థిక సేవల శాఖ కార్యదర్శిగా

నాగరాజు మద్దిరాల

భారీగా కేంద్ర కార్యదర్శుల బదిలీ



న్యూఢిల్లీ, ఆగస్టు 16: కేంద్ర ప్రభుత్వం శుక్రవారం భారీగా కార్యదర్శులను బదిలీ చేసింది. ఆర్థిక, రక్షణ, ఆరోగ్యం, మైనార్టీల సంక్షేమం తదితర శాఖలకు కొత్త కార్యదర్శులను నియమించింది. ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శిగా పుణ్య సలిల శ్రీవాత్సవ నియమితులయ్యారు. ఆమె ప్రస్తుతం ప్రధాని కార్యాలయంలో ప్రత్యేక కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ఆరోగ్య శాఖలో తొలుత ఆమె ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీగా (ఓఎస్‌డీ) చేరనున్నారు. ప్రస్తుత కార్యదర్శి అపూర్వ చంద్ర సెప్టెంబరు 30న పదవీ విరమణ చేసిన అనంతరం పూర్తి బాధ్యతలు చేపట్టనున్నారు. రక్షణ శాఖ కార్యదర్శిగా రాజేష్ కుమార్ సింగ్ నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం ఆయన కూడా రక్షణ శాఖలో ఓఎస్‌డీగా చేరనున్నారు. రక్షణ శాఖ కార్యదర్శి అరమనే గిరిధర్ అక్టోబరు 31న పదవీ విరమణ చేసిన అనంతరం ఆ శాఖ కార్యదర్శిగా పూర్తి బాధ్యతలు చేపట్టనున్నారు. మైనార్టీ వ్యవహారాల కార్యదర్శి కటికితల శ్రీనివాస్.. హౌసింగ్- అర్బన్ వ్యవహారాల కార్యదర్శిగా నియమితులయ్యారు. బొగ్గు శాఖ అదనపు కార్యదర్శి నాగరాజు మద్దిరాల ఆర్థిక వ్యవహారాల కార్యదర్శిగా బదిలీ అయ్యారు. ఆర్థిక శాఖ వ్యవహారాల కార్యదర్శి వివేక్ జోషి.. సిబ్బంది, శిక్షణ శాఖ కార్యదర్శిగా నియమితులయ్యారు. రాష్ట్రపతి కార్యదర్శిగా దీప్తి ఉమాశంకర్ బదిలీ అయ్యారు.



మధుసూదన రెడ్డిపై

సస్పెన్షన్ వేటు

- ఇప్పటికే ఫైబర్‌నెట్ ఎండీగా తొలగింపు
- రాష్ట్రం దాటిపోరాదని అప్పట్లో ఆదేశాలు

అమరావతి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఫైబర్‌నెట్ సంస్థను సొంతజాగీరుగా చేసుకుని గత ఐదేళ్లు చెలరేగిపోయిన మాజీ ఎండీ ఎం.మధుసూదనరెడ్డిపై ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసింది. ఐఆర్‌ఎస్ బ్యాచ్‌కు చెందిన మధుసూదనరెడ్డిని గత సీఎం జగన్ 2020 మే19వ తేదీన ఫైబర్‌నెట్ ఎండీగా ఏరికోరి నియమించారు. జగన్ మనసు తెలిసిన అధికారిగా.. ఫైబర్‌నెట్‌ను విచ్చలవిడి అవినీతికి, వైసీపీ రాజకీయ అవసరాలకు కేంద్రంగా మార్చారు. ఆయన భార్య వైసీపీలో క్రియాశీల కార్యకర్తగా ఉన్నారు. ఫైబర్‌నెట్ కార్యాలయాన్ని బంధువులు, సన్నిహితులతో నింపేశారు. ఈ నేపథ్యంలో కొత్త ప్రభుత్వం ఈ ఏడాది జూన్ ఏడో తేదీన మధుసూదనరెడ్డిని ఎండీగా తప్పించింది. డిప్యుటేషన్ మీద వచ్చిన ఆయనను తిరిగి కేంద్ర సర్వీసులకు పంపకుండా రాష్ట్రంలోనే ఉండాలని ఆదేశించింది. ఈ నెల 22వ తేదీతో ఆయన డిప్యుటేషన్ కాలపరిమితి పూర్తికానుంది. ఈ లోగానే ఆయనను సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మధుసూదనరెడ్డి వ్యవహారంపై సీఐడీ దర్యాప్తునకు ఆదేశించే అవకాశాలున్నాయని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. మధుసూదనరెడ్డి, ఆయన బంధువర్గంపై దర్యాప్తు జరిపించాలని టీడీపీ నేతలు గురువారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్‌ను కోరారు. ఆ మరునాడే ఆయనపై ప్రభుత్వం సస్పెన్షన్ వేటు పడింది.

ఆది నుంచీ ఆరోపణలే ..

ఫైబర్‌నెట్ ఎండీగా,ఆది నుంచీ మధుసూదనరెడ్డి తీవ్రమైన అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నారు. తన బంధుగణంతో ఫైబర్‌నెట్‌ను నింపేశారు. కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి సిఫారసు చేసిన వారికందరికీ అర్హత లేకున్నా ఉద్యోగాలిచ్చారు. విచ్చల విడిగా సాగిన ఆర్థిక దుర్వినియోగంతో సంస్థ ఆర్థికంగా దెబ్బతింది. మధుసూదనరెడ్డి రాక ముందు నెలనెలా రూ.17 కోట్ల రాబడి ఫైబర్ నెట్‌కు ఉంది. అప్పట్లో కనెక్షన్‌కు నెలవారీ రూ.199 వసూలు చేశారు. మధుసూదనరెడ్డి అడుగుపెట్టాక.. దానిని రూ.599కు పెంచారు. అయినా రాబడి 12 కోట్లు మాత్రమే వచ్చేది. ఆయనకు ముందు 9,70,000గా ఉన్న కనెక్షన్లు.. గతఐదేళ్లలో ఏడున్నర లక్షలకు పడిపోయారు. అందులోనూ.. నాలుగు లక్షలకే లెక్కలు చూపించారు. మిగిలిన కనెక్షన్లను అధికారిక లెక్కల్లో చూపకుండా వసూళ్లు చేసుకున్న డబ్బులు జేబులో వేసుకున్నారు. మధుసూదనరెడ్డి బాధ్యతలు చేపట్టక ముందు కోర్ స్టాఫ్ 120 మంది మాత్రమే ఉండేవారు. . వారి జీతభత్యాల కోసం నెలకు రూ.40 లక్షల దాకా చెల్లించేవారు. కానీ, ఆయనను సస్పెండ్ చేసే సమయానికి 1350 మంది ఉద్యోగులు ఉన్నారు. రూ.4.20 కోట్ల మేర జీత భత్యాలకు చెల్లించారు. అయితే, వీరిలో ఎక్కువమంది వైసీపీ కార్యకర్తలే ఉన్నారనే విమర్శలు వచ్చాయి.

బంధువులు, సన్నిహితులకు పదవులు ..

మధుసూదనరెడ్డి పెద్దన్న మద్దిరాల కంచంరెడ్డి ఫైబర్ నెట్‌లో ఆర్థిక వ్యవహారాలు నడిపించారన్న ఆరోపణలున్నాయి. ఫైబర్‌నెట్ ఏజీఎం (ఉయ్యూరు) గుణశశాంక్‌రెడ్డి ద్వారా బిల్లింగ్ సాఫ్ట్‌వేర్‌ను మార్ఫింగ్ చేసి సంస్థ ఆదాయాన్ని ముంబై ఖాతాకు మళ్లించారన్న అభియోగాలూ ఉన్నాయి. మధుసూదనరెడ్డి ఆర్థిక వ్యవహారాల్లో సన్నిహితులైన ఏజీఎం భాస్కర్‌రెడ్డి , గ్రీన్ లాంతెర్న్ ఐటీ సంస్థ యజమాని శేశిరెడ్డి ద్వారా వ్యవహారాలను నడిపారన్న ఆరోపణలు ఉన్నాయి. మధుసూదనరెడ్డి ఆర్థిక వ్యవహారాల్లో ఫైబర్ నెట్ మేనేజర్ కిరణ్‌కుమార్‌రెడ్డి సహకరించారన్న ఆరోపణలు ఉన్నాయి. వీరితోపాటు.. ఏజీఎం సుభాన్ పూర్తిస్థాయిలో మధుసూదనరెడ్డికి సహకారాన్ని అందించారని చెబుతున్నారు. ఫైబర్ గ్రిడ్ ఈడీ పిళ్లా జగన్మోహనరావు పైనా ఆర్థిక ఆరోపణలు వచ్చాయి.

తిన్నవారంతా బాగున్నారు... పనిచేసేవారే సమిధలయ్యారు

మధుసూదనరెడ్డి జమానాలో ఆర్థిక అక్రమాలకు పాల్పడ్డ తిమింగలాలన్నీ.. కూటమి ప్రభుత్వం వచ్చాక ఒక్కొక్కరుగా బయటకు వెళ్లిపోయారు. కానీ, సంస్థను నమ్ముకుని పనిచేస్తున్న సిబ్బంది మాత్రం జీతభత్యాలు లేక పడరాని పాట్లు పడుతున్నారు. మధుసూదనరెడ్డిపై సమగ్ర దర్యాప్తు చేయడంతో సహా.. ఆయనకు సహకరించినవారందరిపైనా కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తే .. వాస్తవాలు వెలుగు చూస్తాయని సిబ్బంది చెబుతున్నారు.

బెంగాల్ సర్కారు వైఫల్యం వల్లే!

- 7వేల మంది గుమిగూడితే ఇంటెలిజెన్స్ ఏంచేస్తోంది.. ఆర్జీ కర్ ఆస్పత్రిపై దాడి ఘటనపై కలకత్తా హైకోర్టు వ్యాఖ్య

కోల్‌కతా, న్యూఢిల్లీ, ఆగస్టు 16: ఆర్జీ కర్ వైద్యకళాశాల, ఆస్పత్రిపై బుధవారం అర్ధరాత్రి దుండగులు పాల్పడిన దాడి ఘటనపై కలకత్తా హైకోర్టు శుక్రవారం తీవ్రంగా స్పందించింది. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం వల్లే ఈ హింసాత్మక దాడి జరిగిందని చీఫ్ జస్టిస్ టీఎస్ శివగణం, హిరణ్మయి భట్టాచార్య ఆధ్వర్యంలోని ద్విసభ్య ధర్మాసనం తీవ్రంగా ఆక్షేపించింది. పోలీసులకంటూ ఓ ఇంటెలిజెన్స్ విభాగం ఉంటుందని.. ఆస్పత్రి వద్ద భారీ సంఖ్యలో 7వేల మంది గుమిగూడితే ఆ విభాగానికి తెలియదనుకోవాలా? కచ్చితంగా 'రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం వైఫల్యం వల్లే జరిగిన దాడి ఇది' అని వ్యాఖ్యానించింది. జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటనకు నిరసనగా దాదాపు 7వేల మంది ఆస్పత్రి ప్రాంగణం వద్ద గుమిగూడారని రాష్ట్ర ప్రభుత్వ తరఫు న్యాయవాది చెప్పడంతో హైకోర్టు పైవిధంగా వ్యాఖ్యానించింది. ఆస్పత్రిపై దుండగుల దాడి వెనుక కారణం ఏమిటనేది తేల్చాలని ఆదేశించింది. విధ్వంసకర, హింసాత్మక చర్యల ద్వారా దుండగులు సృష్టించిన బీభత్సం ఆస్పత్రిలో నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యులను భయాందోళనల్లోకి నెట్టిందని.. ఆస్పత్రిలో పనిచేస్తున్న వైద్యులకు భద్రత కల్పించాలని నిర్దేశించింది. జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం జరిగిన ఆస్పత్రిలోని నాలుగో అంతస్తులోనే నవీకరణ పనులు చేపట్టినట్లుగా దృష్టికి రావడంతో కోర్టు విస్మయం వ్యక్తం చేసింది. నేరం జరిగిన ఫ్లోర్‌లోనే అంత అర్జెంటుగా మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఏమొచ్చింది? అని ప్రశ్నించింది. తాము అనుకుంటే ఆస్పత్రిని మూసివేయాలని, రోగులను ఇతర ప్రభుత్వాస్పత్రులకు తరలించాలని ఆదేశాలివ్వగలమని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆస్పత్రిపై దాడి, అనంతర పరిణామల పట్ల వేర్వేరుగా అఫిడవిట్లు దాఖలు చేయాలని పోలీసులు, ఆస్పత్రి వర్గాలను ఆదేశించింది.



హత్యాచార దోషులకు మరణశిక్ష విధించాలని మమత ర్యాలీ

హత్యాచార ఘటనలో వైద్యులూ

జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటనలో నిందితుడు సంజయ్ రాయ్‌ని పోలీసులు ఇప్పటికే అరెస్టు చేశారు. అయితే ఇందులో ఒకరికి మించి నిందితులున్నారంటూ వాదిస్తున్న హతురాలి తల్లిదండ్రులు తమకు అనుమానం ఉన్న, ఆర్జీ కర్ ఆస్పత్రిలోనే పనిచేస్తున్న కొందరు వైద్యుల పేర్లను అందజేశారని సీబీఐ అధికారులు వెల్లడించారు. ఆ పేర్ల ఆధారంగా 30 మంది వైద్యులను గుర్తించామని.. కేసులో భాగంగా వారిని విచారిస్తామని చెప్పారు. కాగా ఘటన జరిగిన రోజు.. విధుల్లో ఉన్న ఓ వైద్యుడు, ఇద్దరు జూనియర్ వైద్యులకు సీబీఐ సమన్లు ఇచ్చింది.

కోయంబత్తూరులో మహిళా డాక్టర్‌పై అత్యాచారయత్నం

చెన్నై, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని కోయంబత్తూరు వైద్యకళాశాల ఆసుపత్రి వద్ద బుధవారం రాత్రి ఓ మహిళా వైద్యురాలిపై అత్యాచారయత్నానికి పాల్పడిన ఆగంతకుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటనను ఖండిస్తూ కోయంబత్తూరు ఆసుపత్రి వైద్యులు సుమారు 150 మంది గురువారం ధర్నా నిర్వహించారు. బుధవారం రాత్రి ఆ మహిళా వైద్యురాలు వాహనాల పార్కింగ్ ప్రాంతంలో తన స్కూటర్‌ను తీసుకునేందుకు వెళుతుండగా ఆమెను వెంబడించిన ఓ వ్యక్తి అత్యాచార యత్నానికి పాల్పడ్డాడు. ఈ విషయమై ఆ ఆసుపత్రి డీన్ డాక్టర్ నిర్మల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని ఆ దుండగుడిని అరెస్టు చేశారు.

దాడి జరిగిన 6గంటల్లోపు ఎఫ్ఐఆర్

జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటనకు నిరసనగా ఆందోళనలు హింసాత్మకంగా మారడం.. ఆర్జీ కర్ ఆస్పత్రిపై దుండగుల దాడి నేపథ్యంలో కేంద్ర ఆరోగ్య శాఖ సీరియస్ అయింది. ఆస్పత్రిపైన, వైద్యులపైన దాడి జరిగిన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించింది. హింసాత్మక ఘటనలపై ఆరు గంటల్లోపు ఎఫ్ఐఆర్ నమోదయ్యేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాస్పత్రుల చీఫ్‌లదేనని స్పష్టం చేసింది. ఈ మేరకు ఎయిమ్స్ సహా దేశవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆస్పత్రులకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ డాక్టర్ అతుల్ గోయల్ ఆదేశాలిచ్చారు.


ఆదివారంలోగా కేసును తేల్చేయాలి

జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటన నేపథ్యంలో బెంగాల్ సీఎం మమత రాజీనామా చేయాలంటూ శుక్రవారం ఆ రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ ర్యాలీలు చేపట్టింది. అయితే బీజేపీ డిమాండ్‌ను టీఎంసీ సీనియర్ నేత కునాల్ ఘోష్ తప్పుబట్టారు. మరోవైపు.. జూనియర్ వైద్యురాలి కుటుంబానికి న్యాయం చేయాలని.. హత్యాచార దోషులకు మరణశిక్ష విధించాలని డిమాండ్ చేస్తూ సీఎం మమత శుక్రవారం కోల్‌కతాలో ర్యాలీ నిర్వహించారు. హత్యాచారం కేసును ఆదివారంలోగా సీబీఐ అధికారులు తేల్చేయాలని.. దోషులను ఉరితీయాలని ఆమె డిమాండ్ చేశారు.

ఎస్ఎస్ఎల్వీ-డీ3 ప్రయోగం సక్సెస్

- 17 నిమిషాల్లో రోదసీలోకి ఈవోఎస్-08
- మరింత కచ్చితంగా విపత్తుల సమాచారం

సూళ్లూరుపేట, ఆగస్టు 16: ఎస్ఎస్ఎల్వీ-డీ3 ప్రయోగం విజయవంతమైంది. దీంతో ఇస్రో మరో చారిత్రాత్మక మైలురాయికి చేరింది. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని అంతరిక్ష ప్రయోగ కేంద్రం సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి శుక్రవారం ఉదయం 9.17 గంటలకు ఎస్ఎస్ఎల్వీ-డీ3 రాకెట్ ప్రయోగం చేపట్టారు. ఈ రాకెట్ ద్వారా 175.5 కిలోల బరువున్న ఈవోఎస్-08 ఉపగ్రహాన్ని రోదసీలోకి పంపారు. దీంతో పాటు ఎస్ఆర్-0, డెమోశాట్ మరో రెండు చిన్న ఉపగ్రహాలను కూడా కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. శుక్రవారం ఉదయం 9.17 గంటలకు షార్‌లోని ప్రథమ ప్రయోగ వేదికపై ఉన్న ఎస్ఎస్ఎల్వీ-డీ 3 రాకెట్ నిప్పులు చిమ్ముతూ నింగిలోకి దూసుకెళ్లింది. నాలుగు దశల్లో సునాయాసంగా ప్రయాణించిన రాకెట్ తొలుత 16నిమిషాల్లో ఈవోఎస్-08 ఉపగ్రహాన్ని భూమికి 475కిలోమీటర్ల ఎత్తులో చేర్చింది. అనంతరం నిమిషం వ్యవధిలో మరో 2చిన్న ఉపగ్రహాలను నిర్ణీత కక్ష్యలోకి చేర్చింది. ఉపగ్రహాలు కక్ష్యలోకి చేరిన వెంటనే మిషన్ కంట్రోల్ సెంటర్‌లో ఉన్న ఇస్రో చైర్మన్ ఎస్. సోమనాథ్ ఎస్ఎస్ఎల్వీ-డీ3 ప్రయోగం విజయవంతమైనట్లు ప్రకటించారు. 500 కిలోమీటర్ల ఎత్తులోని కక్ష్యలోకి తక్కువ బరువున్న ఉపగ్రహాలను ప్రవేశ పెట్టేందుకు ఎస్ఎస్ఎల్వీ వాహక నౌకను రూపొందించినట్టు తెలిపారు. తాజా ప్రయోగంతో విపత్తులను మరింత కచ్చితంగా తెలుసుకునేందుకు వీలు కలగనుంది. అదేవిధంగా సముద్ర మట్టాలు, అగ్నిపర్వతాల పరిస్థితిని కూడా అంచనావేయొచ్చు. ఈ ఉపగ్రహం ఏడాది పాటు పనిచేయనుంది. మూడేళ్లపాటు తీవ్రంగా శ్రమించిన ఇస్రో శాస్త్రవేత్తలు.. స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్(ఎస్ఎస్ఎల్వీ)ను రూపొందించడంలో విజయం సాధించారు. దీంతో ఇంధన ఆదాతో పాటు తక్కువ ఖర్చుతో విదేశీ ఉపగ్రహాలను రోదసీలోకి పంపేందుకు శ్రీకారం చుట్టారు. ప్రపంచ దేశాల్లో భారత శాస్త్రవేత్తల సత్తా ఏమిటో నిరూపించారు. ఇప్పటి వరకు ఇస్రో ప్రయోగించిన 5 రకాల రాకెట్లతో పాటు ప్రస్తుతం సరికొత్త రాకెట్ చేరింది. ఏఎస్ఎల్వీ, ఎస్ఎల్వీ, పీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీ-మార్క్3 తర్వాత ఎస్ఎస్ఎల్వీ ఆరో వరుసలో ఆరో రాకెట్‌గా చేరింది. ఎస్ఎస్ఎల్‌వీ-డీ3 ప్రయోగం విజయవంతం కావడం పట్ల ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. భారత అంతరిక్ష రంగంలో ఇది అతిగొప్ప మైలురాయి అని పేర్కొన్నారు.



నాలుగో దశలో విడిపోతున్న ఉపగ్రహం

క్రియోస్ఫియర్ అధ్యయనం..

భారత రాకెట్ ప్రయోగాల్లో ఇప్పుడు సరికొత్త వాహక నౌక చేరిందని ఇస్రో చైర్మన్ సోమనాథ్ అన్నారు. ఈవోఎస్-08 భూ పరిశీలన ఉపగ్రహమని, ఇందులో ఉండే ఎలక్ట్రో ఆప్టికల్ ఇన్‌ఫ్రారెడ్(ఈవోఐఆర్) పేలోడ్ మిడ్‌వేవ్, లాంగ్‌వేవ్ ఇన్‌ఫ్రా-రెడ్‌లో చిత్రాలను క్యాప్చర్ చేసి పంపిస్తుందన్నారు. విపత్తు నిర్వహణలో ఈ సమాచారం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈవోఎస్-08 ఉపగ్రహం హిమాలయాల్లోని క్రియోస్ఫియర్ అధ్యయనం కోసం ప్రధానంగా పని చేస్తుందన్నారు. భవిష్యత్‌లో బుల్లి ఉపగ్రహాలను తక్కువ ఎత్తులోకి ఈ రాకెట్ ద్వారా పంపేందుకు సులువుగా ఉంటుందన్న ఉద్దేశంతో ఎస్ఎస్ఎల్వీ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టినట్టు తెలిపారు. ఇకపై చిన్న ఉపగ్రహాలు ఎస్ఎస్ఎల్వీ వాహక నౌక ద్వారానే పంపుతామన్నారు. ఈ ఏడాది డిసెంబరులో గగన్‌యాన్ ప్రయోగం కూడా ఉంటుందన్నారు. దీంతో పాటు పీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీ-మార్క్3 ప్రయోగం ఉంటుందని వెల్లడించారు.

శత్రు విధ్వంసక ఆత్మాహుతి డ్రోన్

- వెయ్యి కి.మీ.ల రేంజ్
- స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన ఎన్ఏఎల్



న్యూఢిల్లీ, ఆగస్టు 16: శత్రుదేశాల గుండెల్లో గుబులు పుట్టించగల స్వీయ విధ్వంసక డ్రోన్‌ను 'నేషనల్ ఏరోస్పేస్ ల్యాబొరేటరీస్' (ఎన్ఏఎల్) పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించింది. 30 హెచ్‌పీ సామర్థ్యం గల ఇంజిన్‌తో కూడిన ఈ డ్రోన్ వెయ్యి కి.మీ.ల దూరంలోని లక్ష్యాలను కూడా ఛేదించగలదు. దాదాపు 40 కిలోల బరువైన పేలుడు పదార్థాలను మోసుకెళ్లగలుగుతుంది. కమాండ్ సెంటర్ నుంచి నియంత్రించగలిగే ఈ మానవ రహిత డ్రోన్.. లక్ష్యం వద్దకు చేరుకోగానే పేలిపోయి లక్ష్యాన్ని ధ్వంసం చేస్తుంది. శత్రువుల రాడార్లకు, రక్షణ వ్యవస్థలకు దొరకకుండా ఈ డ్రోన్‌ను ప్రయోగించటానికి వీలవుతుంది. అంతేకాదు, జీపీఎస్ సంకేతాలను శత్రువులు అడ్డుకుంటే కూడా దీనిని నడపవచ్చు. ఇస్రో అభివృద్ధి చేసిన నావిక్ నావిగేషన్ సిస్టమ్ ద్వారా డ్రోన్‌ను ఆపరేట్ చేయవచ్చు. ఎన్ఏఎల్ డ్రోన్‌ను దేశీయ కామకాజీగా వ్యవహరిస్తున్నారు. రెండో ప్రపంచయుద్ధంలో జపాన్ వాయుసేనకు చెందిన ఒక ఆత్మాహుతి దళాన్ని కామకాజీగా పిలిచేవారు. ఈ దళంలోని పైలట్లు పేలుడు పదార్థాలతో నింపిన విమానాలను శత్రువుల నౌకలు, సైన్యాలపైకి తీసుకెళ్లి ఢీకొట్టేవారు.

అమరావతిలో నాలెడ్జి సెంటర్!

హైదరాబాద్‌లోని చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రం తరహాలో..

కేంద్రం నిధులతో 20 ఎకరాల్లో నిర్మాణం!

- కేంద్రం వద్ద భారీగా నాన్ రికరింగ్ నిధులు
- నాలెడ్జి సెంటర్‌కోసం వీటిని వాడుకునే వీలు
- ఐదేళ్లుగా ఆ నిధులు వాడుకోని గత ప్రభుత్వం
- శిక్షణ నిధులు 700 కోట్లూ వదులుకున్న వైనం
- వీటన్నింటిపైనా దృష్టి సారించిన రాష్ట్ర ప్రభుత్వం
- త్వరలో ముఖ్యమంత్రి సమక్షంలో నిర్ణయం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాజధాని అమరావతి నడిబొడ్డున అతి పెద్ద నాలెడ్జి కేంద్రం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది. హైదరాబాద్‌లో ఉన్న మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రం(ఎంసీహెచ్‌ఆర్‌డీ) తరహాలో ఏపీలోనూ శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. ఇందుకు అవసరమైన స్థలాన్ని అమరావతిలో రాష్ట్ర ప్రభుత్వం కేటాయిస్తే, నిర్మాణానికి అవసరమైన నిధులను కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖలోని నాన్ రికరింగ్ నిధుల నుంచి (శాశ్వత భవన నిర్మాణాలకు ఉద్దేశించిన నిధులు) సమీకరించుకోవాలని యోచిస్తున్నారు. పిల్లల నుంచి వృద్ధులదాకా ప్రతిఒక్కరికీ అవసరమైన నాలెడ్జి, చేతివృత్తుల నుంచి రోబోటిక్ టెక్నాలజీ వరకు.. ప్రతిదీ ఈ కేంద్రం అందించేలా సిద్ధం చేయనున్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సహకారంతో కేంద్ర నిధులను సమీకరించి దేశంలోనే అత్యుత్తమైన మానవ వనరుల కేంద్రాన్ని నిర్మించుకునేలా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. అధికారుల బృందం ఒకటి ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సూచనలతో ఇప్పటికే ఏర్పడి దీనిపై పని చేస్తోంది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖకు అనుబంధంగా ఉన్న శిక్షణ కేంద్రం 'ఏపీ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్(ఏపీఎస్‌ఐఆర్‌డీ) గత ఐదేళ్లుగా కేంద్రం నుంచి నిధులు రాబట్టుకోవడంలో పూర్తిగా విఫలమైంది. రెండేళ్లలో రూ.700 కోట్లు కేంద్ర నిధులు కోల్పోయారు.



సీఎం చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు



సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీని సత్కరిస్తున్న సీఎం చంద్రబాబు

20 ఎకరాల్లో భారీ నిర్మాణం..

అమరావతిలో మావన వనరుల కేంద్రం ఏర్పాటుకు 20 ఎకరాల స్థలం కేటాయించాలంటూ ప్రతిపాదించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ యోచిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే ప్రతిపాదనలకు సంబంధించి ముసాయిదాను అధికారులు తయారుచేశారు. దీనిపై పవన్‌కల్యాణ్‌తో చర్చించి ఆయన ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు వద్దకు ఈ ప్రతిపాదనలు తీసుకెళ్లే అవకాశముంది.

నిధులన్నీ కేంద్ర ప్రభుత్వం నుంచే....

కేంద్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖల్లో భారీగా నిధులున్నాయి. గ్రామీణాభివృద్ధిశాఖలో మన రాష్ట్రానికి చెందిన ఎంపీ సహాయ మంత్రిగా ఉండటంతో రాష్ట్రానికి ఆ శాఖ నిధుల సమీకరణ సులభమవుతుందని భావిస్తున్నారు.

అమరావతిలో లా యూనివర్సిటీ

- బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సుముఖత
- తక్షణమే స్థలం ఎంపికకు ముఖ్యమంత్రి ఆదేశం
- ఇందులోనే అంతర్జాతీయ ఆర్బిట్రేషన్ సెంటర్!

రాష్ట్ర రాజధాని అమరావతిలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో లా యూనివర్సిటీ ఏర్పాటు కానుంది. ఈ అంశంపై సీఎం చంద్రబాబు శుక్రవారం సచివాలయంలో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్, సీనియర్ న్యాయవాది మనన్ కుమార్ మిశ్రా నేతృత్వంలోని ప్రతినిధులతో చర్చలు జరిపారు. దేశంలో న్యాయ విద్యను మరింత ఉన్నతీకరించడానికి ముందడుగు వేస్తూ బెంగళూరులోని నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీ (ఎన్ఎల్ఎస్ఐయూ), గోవాలోని ఇండియా ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ లీగల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐఐయూఎల్ఈఆర్) తరహాలో అమరావతిలో న్యూ ప్రీమియర్ యూనివర్సిటీ ఏర్పాటు చేసేందుకు వారు సంసిద్ధత తెలిపారు. దీనిపై ముఖ్యమంత్రి హర్షం వ్యక్తం చేశారు. వర్సిటీ ఏర్పాటుకు తక్షణమే అవసరమైన స్థలాన్ని ఎంపిక చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతిపాదిత వర్సిటీలో అంతర్జాతీయ స్థాయి ఆర్బిట్రేషన్ సెంటర్ కూడా ఏర్పాటు కానుంది. అలాగే ఈ విశ్వవిద్యాలయం ఏర్పాటుతో న్యాయ, అనుబంధ రంగాల్లో నైపుణ్యం, ఉన్నత విద్యావకాశాలు మెరుగవుతాయి.



టాటా గ్రూప్ చైర్మన్ నటరాజన్ చంద్రశేఖర్‌తో సమావేశమైన మంత్రి లోకేశ్

టాటా గ్రూప్ చైర్మన్‌తో మంత్రి లోకేశ్ భేటీ

- ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్ రంగాల్లో పెట్టుబడులకు ఆహ్వానం

అమరావతి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): టాటా గ్రూప్ చైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్‌తో విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ భేటీ అయ్యారు. శుక్రవారం సచివాలయానికి వచ్చిన చంద్రశేఖరన్‌తో లోకేశ్ ప్రత్యేకంగా చర్చించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, ప్రోత్సాహకాలను ఆయనకు వివరించారు. ప్రధానంగా ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్, ఆటోమొబైల్, పునరుత్పాదక ఇంధనం, టెలీ కమ్యూనికేషన్స్, రసాయనాల తయారీ, ఆహార ఉత్పత్తుల రంగాల్లో అభివృద్ధి సాధించడానికి అవసరమైన అన్ని వనరులు ఉన్నాయని తెలిపారు. ఆయా రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని కోరారు. రాష్ట్రంలో రాబోయే ఐదేళ్లలో యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలన్నది తమ లక్ష్యమని, దీనికి సహకరించే అన్ని రకాల పరిశ్రమలకు మెరుగైన ప్రోత్సాహకాలు అందిస్తామని లోకేశ్ చెప్పారు. చంద్రశేఖరన్ భేటీ ముగిసిన అనంతరం మంత్రి లోకేశ్ గన్నవరం ఎయిర్‌పోర్టు వరకు వెళ్లి వీడ్కోలు పలికారు.

విద్యాశాఖలో కుంభకోణాలపై కమిటీ

- మింగేసిన ప్రజాధనాన్ని కక్కించడం మా బాధ్యత : లోకేశ్
- మంగళగిరి, తాడేపల్లిల్లో అన్న క్యాంటీన్లు ప్రారంభం

మంగళగిరి, ఆగస్టు 16: గత వైసీపీ ప్రభుత్వ హయాంలో విద్యాశాఖలో జరిగిన కుంభకోణాలపై విచారణ జరిపేందుకు త్వరలోనే ఓ ప్రత్యేక కమిటీని నియమించనున్నామని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ చెప్పారు. శుక్రవారం ఆయన మంగళగిరి, తాడేపల్లిల్లో అన్నక్యాంటీన్‌లను ప్రారంభించారు. పేదలతో కలిసి భోజనం రుచి చూశారు. అనంతరం మంగళగిరి అన్నక్యాంటీన్ వద్ద విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'అడ్డగోలుగా ప్రజాసంపదను లూటీ చేస్తే చర్యలు తీసుకోకుండా ఎలా ఉండమంటారు? మింగేసిన ప్రజాధనాన్ని కక్కించడం మా బాధ్యత తప్ప, కక్ష సాధింపు కాదు.

త్వరలోనే రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలకు వైస్ చాన్సలర్లను నియమిస్తాం. అంబేడ్కర్ స్మృతివనంలో అంబేడ్కర్ పేరుకన్నా తన పేరునే పెద్దదిగా పెట్టుకోవడంతో కొందరు దళిత యువకులు బాధచెంది జగన్ పేరును పీకేశారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వం విదేశీవిద్యకు అంబేడ్కర్ పేరు పెడితే, జగన్ వచ్చి ఏమాత్రం బిడియపడకుండా అంబేడ్కర్ పేరును తొలగించేసి తన పేరు పెట్టుకున్నారు. ముందు దీనికి ఆయన సమాధానం చెప్పి తీరాలి' అని లోకేశ్ డిమాండ్ చేశారు.

రెడ్‌బుక్ ఓ మాండేట్..

రెడ్‌బుక్ అంటే చట్టాన్ని ఉల్లంఘించిన వారిని చట్టపరిధిలో శిక్షించేదని మంత్రి లోకేశ్ వెల్లడించారు. 'జోగి రమేష్ కుమారుడు నకిలీ పత్రాలు సృష్టించి అగ్రిగోల్డ్ భూములను ఇతరులకు అమ్మేశాడు. ఈ అన్యాయాన్ని గురించి మోసాన్ని గురించి చర్యలు తీసుకోకూడదా? రేపు లిక్కర్‌లో... ఇసుక దందాలో కూడ చర్యలు తీసుకుంటాం. గతంలో నా ప్రతి స్పీచ్‌లో చెప్పాను. ఎవరైతే చట్టాలను ఉల్లంఘించి ప్రజలను, కార్యకర్తలను ఇబ్బందులు పెట్టారో వాళ్లను వదిలిపెట్టనని అనేక సభలలో ప్రజలకు హామీ ఇచ్చాను. రెడ్‌బుక్ ప్రజలకు చూపించి మరీ చెప్పాను. అందుకే ప్రజలు మాకు అద్భుతమైన మాండేట్ ఇచ్చారు. ఇది మా ఒక్కరి వల్ల కాదు. అందరం కలిసికట్టుగా పోరాడాం. దాంట్లో భాగమే రెడ్‌బుక్. రెడ్‌బుక్ కూడా ఓ మాండేట్! అందుకే ప్రజలు మాకు అంత క్లియర్ మాండేట్ ఇచ్చారు. తప్పు చేసిన వాళ్లను వదిలిపెట్టొద్దని ప్రజలు క్లియర్‌గా చెబుతున్నారు' అని లోకేశ్ తేల్చిచెప్పారు.

సెప్టెంబరు 17న అశోక్ లేలాండ్ పునఃప్రారంభం

- మల్లవల్లిలో బస్ బాడీ బిల్డింగ్ యూనిట్ ప్రారంభోత్సవానికి హాజరుకానున్న లోకేశ్

విజయవాడ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లా బాపులపాడు మండలం మల్లవల్లి పారిశ్రామిక వాడలో అశోక్ లేలాండ్ సంస్థ ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేస్తున్న బస్ బాడీ బిల్డింగ్ ప్లాంటు సెప్టెంబరు 17న పునఃప్రారంభం కానుంది. ప్రారంభోత్సవ కార్యక్రమానికి మానవ వనరులు, ఐటీ శాఖ మంత్రి లోకేశ్ హాజరుకానున్నారు. సుమారు 75 ఎకరాల్లో రూ.130 కోట్ల పెట్టుబడితో 2014-19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభమైంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో సరైన సహకారం లేక పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక అశోక్ లేలాండ్ పునఃప్రారంభంపై సీఎం చంద్రబాబు దృష్టి సారించారు. ఆయన సూచనల మేరకు స్థానిక గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పలుమార్లు అశోక్ లేలాండ్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఆ యాజమాన్యం తాజాగా మరో రూ.10 కోట్లతో తుది దశ పనులను శరవేగంగా చేస్తోంది. ఈ నేపథ్యంలో యార్లగడ్డ శుక్రవారం మరోసారి ఆ ప్రతినిధులను కలిశారు.

పెట్టుబడుల సాధనకు.. ప్రత్యేక టాస్క్‌ఫోర్స్!

- చైర్మన్‌గా చంద్రబాబు, కో-చైర్మన్‌గా టాటా గ్రూప్ అధినేత
- దేశ ప్రముఖ పారిశ్రామికవేత్తలకూ చోటు
- అమరావతిలో 'సెంటర్ ఫర్ గ్లోబల్ లీడర్‌షిప్'
- విశాఖలో టీసీఎస్ డెవలప్‌మెంట్ సెంటర్
- టాటా చంద్రశేఖరన్‌తో సీఎం చర్చలు
- సీఐఐ డీజీ చంద్రజిత్ బెనర్జీ నేతృత్వంలోని ప్రతినిధులతోనూ భేటీ
- బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా బృందంతో చర్చలు

అమరావతి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో జగన్ ప్రభుత్వ విధానాలతో ఆంధ్రప్రదేశ్ వైపు చూడాలంటేనే హడలిపోతున్న పారిశ్రామికవేత్తల్లో నమ్మకం పాదుగొల్పి.. రాష్ట్రానికి మళ్లీ పెద్దఎత్తున పెట్టుబడులు తీసుకొచ్చే ప్రయత్నాలను ముఖ్యమంత్రి చంద్రబాబు ముమ్మరం చేశారు. 2047 నాటికి పారిశ్రామిక రంగంలో రాష్ట్రాన్ని నంబర్ వన్‌గా నిలపడమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేయిస్తున్నారు. ఈ క్రమంలోనే పెట్టుబడిదారులను ఆకర్షించి రాష్ట్రంలో పరిశ్రమలను నెలకొల్పేలా ప్రోత్సహించడంతోపాటు రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి తగిన సూచనలు, సలహాలతో ప్రణాళికలు అందించేందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయనుంది. దీనికి స్వయంగా చంద్రబాబే చైర్మన్‌గా, దిగ్గజ పారిశ్రామిక సంస్థ టాటా గ్రూప్ చైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్ కో-చైర్మన్‌గా ఉంటారు. ఇందులో దేశంలో పేరుమోసిన ప్రముఖ పారిశ్రామికవేత్తలు, ఆయా రంగా నిపుణులు కూడా సభ్యులుగా ఉంటారు. రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతిని పరుగులు పెట్టించి, నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చేపట్టాల్సిన చర్యలపై ఈ ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ దృష్టిపెడుతుంది. నటరాజన్ చంద్రశేఖరన్ శుక్రవారమిక్కడ అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధి, స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్-2047 రూపకల్పన, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలతోపాటు ప్రైవేటు పారిశ్రామిక సంస్థల నుంచి పెద్దఎత్తున పెట్టుబడులను సాధించే అంశంపైనా విస్తృతంగా చర్చించారు. విశాఖపట్నంలో టీసీఎస్ డెవలప్‌మెంట్ సెంటర్, రాష్ట్రంలో ఎయిర్ ఇండియా, విస్తారా ఎయిర్‌లైన్స్ విస్తరణ, సోలార్, టెలికమ్యూనికేషన్స్, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల ఏర్పాటుపై చంద్రశేఖరన్ సానుకూలంగా స్పందించారు. రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి లోకేశ్, పరిశ్రమల మంత్రి టీజీ భరత్ కూడా చర్చల్లో పాల్గొన్నారు. చర్చల సారాంశాన్ని చంద్రబాబు ఆ తర్వాత 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ నేతృత్వంలోని ప్రతినిధి బృందంతో, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్, సీనియర్ న్యాయవాది మనన్ కుమార్ మిశ్రా నేతృత్వంలోని ప్రతినిధి బృందంతోనూ భేటీ అయినట్లు తెలిపారు. సీఐఐ భాగస్వామ్యంతో అమరావతిలో 'సెంటర్ ఫర్ గ్లోబల్ లీడర్‌షిప్ ఆన్ కాంపిటీటివ్‌నెస్' సంస్థ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారు. ఈ సంస్థ ఏర్పాటుకు సీఐఐ ముందుకు రాగా.. అందులో టాటా గ్రూప్ కూడా భాగస్వామి కానుంది. 'ఆర్థికాభివృద్ధిపై టాస్క్‌ఫోర్స్ సిఫార్సులను అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం-సీఐఐ కలిసి ఇండస్ట్రీ ఫోరం ఏర్పాటు చేయాలని యోచిస్తున్నాం. అదనంగా మల్టీ స్కిల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (ఎంఎస్‌టీఐ), సీఐఐ మోడల్ కెరీర్ సెంటర్ (ఎంసీసీ) వంటి కార్యక్రమాల ద్వారా ఏపీలో యువత నైపుణ్యాలు, ఉపాధి అవకాశాలను పెంపొందించడంపై దృష్టి సారిస్తాం' అని చంద్రబాబు తెలిపారు.

ఆరోగ్యశాఖ సమస్యలకు
వైసీపీ పాపాలే కారణం

- ప్రత్యేక ఆడిట్ నిర్వహిస్తాం: మంత్రి సత్యకుమార్ యాదవ్

అమరావతి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలకులు చేసిన పాపాలే ఆరోగ్యశాఖను పట్టిపీడిస్తున్నాయని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆరోపించారు. శుక్రవారం సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వాసుపత్రుల పనితీరును మెరుగు పరిచేందుకు 30 అంశాలతో కూడిన కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్యశాఖపై పూర్తిస్థాయిలో ఆడిట్ నిర్వహిస్తామన్నారు. ప్రతి ఆస్పత్రిలో హెల్త్ డెస్కులు ఏర్పాటు చేసి, రోగులకు అందించిన వైద్యంపై ఫీడ్ బ్యాక్ తీసుకుంటామని తెలిపారు. ఆరోగ్యశాఖలో ఎవరు అవినీతికి పాల్పడినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అవినీతి ఆరోపణలపై 104కు ఫోన్ చేయాలని సూచించారు.

దేవినేని అవినాశ్‌కు 'లుక్‌అవుట్' ఝలక్

- దుబాయ్ వెళ్తుండగా శంషాబాద్‌లో అడ్డుకున్న సీఐఎస్ఎఫ్
- టీడీపీ ఆఫీసుపై దాడి కేసులో ఆయనపై లుక్‌అవుట్ నోటీసులు



విజయవాడ/శంషాబాద్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వైసీపీ విజయవాడ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాశ్‌కు చుక్కెదురైంది. టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో నిందితుడిగా ఉన్న ఆయన గురువారం అర్ధరాత్రి దుబాయ్ వెళ్లేందుకు ప్రయత్నించగా.. శంషాబాద్ విమానాశ్రయంలో సీఐఎస్ఎఫ్ బలగాలు అడ్డుకున్నాయి. ఈ కేసులో ఆయనతో పాటు పలువురు నిందితులపై మంగళగిరి పోలీసులు దేశంలోని అన్ని విమానాశ్రయాలకు లుకవుట్ నోటీసులు జారీచేసిన సంగతి తెలిసిందే. శంషాబాద్‌లో సిబ్బంది ఆయనకు ఆ నోటీసు చూపించి దుబాయ్ వెళ్లడానికి వీల్లేదని స్పష్టం చేశారు. అనంతరం మంగళగిరి రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. అవినాశ్‌పై కేసు నమోదై ఉన్నందున్న ఆయన విదేశీ ప్రయాణాలకు అనుమతులు ఇవ్వరాదని పోలీసులు స్పష్టం చేశారు. దీంతో ఆయన్ను వెనక్కి పంపించారు. అయితే ఈ ఘటనను అవినాశ్ ఖండించారు. తాను ఎక్కడికీ పారిపోలేదని, రెండు నెలలుగా విజయవాడలోనే ఉంటున్నానని చెప్పడం గమనార్హం.

జోగి రాజీవ్ బెయిల్ పిటిషన్‌పై విచారణ 20కి వాయిదా

విజయవాడ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): అగ్రిగోల్డ్ భూములను దొడ్డిదారిన రిజిస్ట్రేషన్లు చేయించుకున్న మాజీ మంత్రి జోగి రమేశ్ కుమారుడు జోగి రాజీవ్ బెయిల్ పిటిషన్‌పై విచారణను న్యాయస్థానం ఈనెల 20వ తేదీకి వాయిదా వేసింది. ఏసీబీ కోర్టు న్యాయాధికారి హిమబిందు సెలవులో ఉండడంతో ఈ కేసును 12వ అదనపు జిల్లా కోర్టు శుక్రవారం విచారించింది. బెయిల్ పిటిషన్‌పై కౌంటర్ దాఖలుకు సమయం కావాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోరడంతో విచారణను కోర్టు 20వ తేదీకి వాయిదా వేసింది. అదే రోజున ఏసీబీ కస్టడీ పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలని కూడా రాజీవ్ తరఫు న్యాయవాదులను ఆదేశించింది.

తప్పు చేయకపోతే ఎందుకు పారిపోతున్నారు

- వైసీపీ నేతలకు మంత్రి కొల్లు రవీంద్ర ప్రశ్న

అమరావతి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతలు తప్పులు చేయకపోతే విదేశాలకు పారిపోయే ప్రయత్నం ఎందుకు చేస్తున్నారని మంత్రి కొల్లు రవీంద్ర ప్రశ్నించారు. శుక్రవారం ఆయన ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. "వైసీపీ నేత దేవినేని అవినాశ్ తమ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు టీడీపీ కేంద్ర కార్యాలయంపై జరిగిన దాడి ఘటనలో నిందితునిగా ఉన్నారు. ఆయనపై పోలీసు దర్యాప్తు జరుగుతోంది. శంషాబాద్ విమానాశ్రయం నుంచి దుబాయ్ వెళ్లాలని ఆయన ప్రయత్నం చేస్తే, అక్కడి పోలీసులు అడ్డుకొని వెనక్కి పంపారు. విదేశాలకు వెళ్లి ఆయన దాక్కోవాల్సిన అవసరం ఏమిటి? వైసీపీ మాజీ ఎమ్మెల్యేలు కొండాలి నాని, వల్లభనేని వంశీ వంటివారు వారెక్కడున్నారో తెలియకుండా కలుగుల్లో దాక్కొన్నారు. తప్పు చేయబట్టే వారికి ఈ కర్మ పట్టింది. పార్టీ కేంద్ర కార్యాలయంలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి వాటిని సంబంధిత శాఖలకు పంపి పరిష్కరించే ప్రయత్నంచేస్తున్నాం" అన్నారు.



మంగళగిరిలో అన్నా క్యాంటీన్‌ను ప్రారంభించి అల్పాహారం వడ్డిస్తున్న మంత్రి లోకేశ్



విజయవాడలోని కృష్ణలంకలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్ వద్ద బారులుదీరిన జనం



విజయవాడలోని రాణిగారి తోట వద్ద అన్న క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న మహిళలు, వృద్ధులు

క్యాంటీన్ల కోలాహలం

పేదలు, కూలీలు, భవన కార్మికుల కళ్లలో తిరిగొచ్చిన తృప్తి.. రాష్ట్రవ్యాప్తంగా 99 అన్న క్యాంటీన్లు పునఃప్రారంభం

(ఆంధ్రజ్యోతి - న్యూస్ నెట్‌వర్క్)

పేదలకు పట్టెడన్నం పెట్టి కడుపు నింపిన అన్న క్యాంటీన్లు తిరిగి పునఃప్రారంభమయ్యాయి. ఉదయం నుంచే భారీ ఎత్తున పేదలు, కూలీలు, భవన కార్మికులు బారులు తీరడంతో క్యాంటీన్ల పరిసరాలు కోలాహలంతో నిండిపోయాయి. ఐదేళ్లుగా మూతపడ్డ రూ.ఐదు క్యాంటీన్లను ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం తిరిగి తెరవడంతోపాటు, ప్రభుత్వంలోని మంత్రులు, ఎమ్మెల్యేలు దగ్గరుండి వడ్డించారు. భోజనాలు చేస్తున్న వారి వద్దకు వెళ్లి.. క్యాంటీన్‌లో అల్పాహారం, భోజనంపై ఆరా తీయడం కనిపించింది. కృష్ణా జిల్లా గుడివాడలో గురువారం అన్న క్యాంటీన్లను ముఖ్యమంత్రి చంద్రబాబు లాంఛనంగా ప్రారంభించగా, శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా పలు మునిసిపాలిటీల పరిధిలో 99 క్యాంటీన్లు ప్రారంభమయ్యాయి. ప్రకాశం జిల్లాలోని ఒంగోలులో ఏర్పాటుచేసిన నాలుగు అన్న క్యాంటీన్లను స్థానిక ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌తో కలిసి మంత్రి డీఎస్‌బీవీ స్వామి ప్రారంభించారు. ఎన్టీఆర్ జిల్లాలో 14 అన్న క్యాంటీన్లను ప్రారంభించారు. విజయవాడ నగరంలో 11 అన్న క్యాంటీన్లను ప్రారంభించగా, జగ్గయ్యపేట, నందిగామ, తిరువూరు నియోజకవర్గాల్లో ఒకొక్కటి చొప్పున ప్రారంభించారు. గుంటూరు నగరం పరిధిలోని తాడేపల్లి, మంగళగిరి పాతబస్టాండు సెంటర్లో ఏర్పాటుచేసిన అన్న క్యాంటీన్లను మంత్రి లోకేశ్ ప్రారంభించారు. ఆహార పదార్థాలను రుచి చూశారు. ఇంకా.. పల్నాడు బస్టాండు, చుట్టుగుంట రైతు బజార్ సెంటర్, మిర్చి యార్డుల్లో ఎమ్మెల్యే గళ్లా మాధవి, ఎన్టీఆర్ సర్కిల్, నల్లచెరువుల్లో ఎమ్మెల్యే నసీర్, శ్రీసత్యసాయి జిల్లా హిందూపురంలో అన్న క్యాంటీన్‌ను ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ప్రారంభించారు. తూర్పుగోదావరి జిల్లాలో 5 అన్న క్యాంటీన్లు ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి వాసు, బత్తుల బలరామకృష్ణ, ముప్పిడి వేంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అన్న ఎన్టీఆర్, డొక్కా సీతమ్మ స్ఫూర్తితో..

శ్రీకాకుళంలో ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి మంత్రి అచ్చెన్నాయుడు రెండు అన్నక్యాంటీన్లు, పలాసలో ఎమ్మెల్యే గౌతు శిరీష ఒక క్యాంటీన్‌ను ప్రారంభించారు. నూజివీడు సహా ఏలూరు జిల్లావ్యాప్తంగా ఐదు అన్న క్యాంటీన్లను శుక్రవారం ప్రారంభించారు. విజయనగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్, నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్లను కేంద్రమాజీ మంత్రి అశోక్ గజపతిరాజు..ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజుతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. అన్న క్యాంటీన్ల నిర్వహణకు మంత్రి కొండపల్లి ఒక నెల వేతనాన్ని విరాళంగా ప్రకటించారు. నెల్లూరు జిల్లా కావలిలో అన్న క్యాంటీన్ నిర్వహణకు 'అభయం' అనే స్వచ్ఛంద సేవా సంస్థ రూ.లక్ష విరాళం చెక్కును స్థానిక ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డికి అందజేశారు. ఇదే జిల్లా కందుకూరులో టీడీపీ నాయకులు రూ.2.3 లక్షల విలువైన విరాళాలను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు ఇచ్చారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో అన్న క్యాంటీన్ల నిర్వహణకు శ్రీసరస్వతి విద్యాసంస్థల యజమాని ఏవీ రమణారెడ్డి రూ.లక్ష విరాళం అందించారు.


తినేసి తిరిగి పనిలోకి వెళ్లా...



"కడుపు నిండా భోజనం చేయగలిగితే మాలాంటి కుటుంబాలు ఏ పనికైనా వెళ్లి కష్టపడతాం. ఉపాధి కోసం పల్లెప్రాంతాల నుంచి నగరం కోసం వస్తుంటాం. ప్రభుత్వం ఏర్పాటుచేసిన క్యాంటీన్‌లో రూ.5తో మధ్యాహ్నం భోజనం చేసి తిరిగి పనిలోకి వెళ్లగలిగాను. ఆర్థికంగా పెద్దభారం తప్పింది".

-బొంతు రాములు, యాతపేట, శ్రీకాకుళం

కూలి డబ్బు ఇంటి దగ్గర ఇచ్చా...



"కూలి పనికి వెళ్లి తెచ్చుకునే డబ్బుల్లో సగానికి పైగా టిఫిన్, భోజనానికే సరిపోయేవి. ఇంట్లో ఇవ్వడానికి పెద్దగా డబ్బులు విగిలేవి కావు. ఈ రోజు అన్న క్యాంటీన్‌లో తిన్నాను. ఉదయం, మధ్యాహ్నం రూ. పది ఇచ్చి అక్కడే టిఫిన్, భోజనం చేశాను. పెద్ద ఖర్చు లేకుండానే కడుపు నింపుకొన్నాను. నాకు వచ్చిన కూలి డబ్బులను మొదటిసారి పూర్తిగా ఇంటి దగ్గర ఇచ్చాను"

- మొల్లి అప్పారావు, పోలీసుస్టేషన్ సెంటర్, పిఠాపురం

విజయనగరం జిల్లాలో.. రెవెన్యూ రికార్డుల నిర్వహణ అస్తవ్యస్తం

- రిజిస్ట్రార్ ఆఫీసుల్లోనూ అక్రమాలు: సిసోడియా

విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి/భోగాపురం/శృంగవరపుకోట, ఆగస్టు 16: విజయనగరం జిల్లాలో రెవెన్యూ రికార్డుల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉన్నాయని రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా తెలిపారు. రికార్డుల నిర్వహణలో లోపాలను సవరించాలని అధికారులను ఆదేశించామన్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కూడా చిన్నపాటి అవకతవకలను గుర్తించినట్లు చెప్పారు. అసైన్డ్, ఫ్రీహోల్డ్ భూముల రికార్డులను పరిశీలించి సరిచేయడానికి.. రైతులు, ప్రజల సమస్యలను తెలుసుకునేందుకే తాను రోజుకో జిల్లాలో పర్యటిస్తున్నానని అన్నారు. శుక్రవారం ఆయన విజయనగరం జిల్లాలో ఆయా భూముల రికార్డులను తనిఖీచేశారు. జిల్లాలో సుమారు 5,700 ఎకరాలను ఫ్రీ-హోల్డ్ చేశారని, ఇందులో 191 ఎకరాలకు రిజిస్ట్రేషన్ కూడా పూర్తయిందని తెలిపారు. సిసోడియా ముందుగా భోగాపురం మండలం పోలిపల్లి రెవెన్యూలో మరాడపాలెం ఆర్అండ్ఆర్ కాలనీకి చేరుకున్నారు. పోలిపల్లి రెవెన్యూలో 208 మంది రైతుల వద్ద 378.62 ఎకరాల డీ పట్టా భూములు ఉన్నాయి. వీటిలో 23 మంది రైతులకు చెందిన 20.65 ఎకరాలను ఫ్రీ-హోల్డ్ చేశారు. ఇందులో ఏడుగురు రైతులు 16 ఎకరాలను విక్రయించారు. డీపట్టా, ఫ్రీ-హోల్డ్ చేసిన భూముల పూర్తి వివరాలను సిసోడియా పరిశీలించారు. అనంతరం భోగాపురం తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లి భూరికార్డులు పరిశీలించారు. తర్వాత భోగాపురం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి తనిఖీచేశారు. బసవపాలెం రెవెన్యూలో 75 ఎకరాల డీ పట్టా భూములు ఉండగా 26 ఎకరాలు ఫ్రీ-హోల్డ్ చేశారు. దీనిపై సిసోడియా ఆ గ్రామానికి వెళ్లి అక్కడి రైతులతో మాట్లాడారు. సాయంత్రం విజయనగరం కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. రాత్రి శృంగవరపుకోట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి రికార్డులను తనిఖీ చేశారు. వేపాడ మండలం కొండగంగుబూడి గ్రామ పరిధిలోని ఫ్రీ-హోల్డ్ అసైన్డ్ భూములకు రిజిస్ట్రేషన్లలో అవకతవకలు జరిగినట్లు ప్రాథమికంగా గుర్తించారు. శనివారం విశాఖ జిల్లాలో క్షేత్రస్థాయిలో పర్యటించాక తహశీల్దార్లు, సబ్‌రిజిస్ట్రార్లతో సమావేశమవుతానని.. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తానని వెల్లడించారు.

అందరూ ఎలా కొన్నారో
నేనూ అలానే కొన్నా!

- అగ్రిగోల్డ్ భూములపై నిజం ఒప్పుకొన్న జోగి
- ముందు తెలియదని.. తర్వాత కొన్నామని స్పష్టీకరణ
- పేపర్ ప్రకటన ఇచ్చి మరీ కొనుక్కున్నట్టు వెల్లడి
- టీడీపీ అధినేత బాబు ఇంటిపై దాడి కేసులో
- మంగళగిరి రూరల్ పోలీసుల ముందు హాజరు



మంగళగిరి రూరల్‌స్టేషన్‌లో మాజీమంత్రి జోగి రమేశ్‌ను విచారిస్తున్న పోలీసులు

మంగళగిరి, ఆగస్టు 16: అగ్రిగోల్డ్ భూముల కొనుగోలు వ్యవహారంలో తమకు ఏపాపం తెలియదని, తమపై అక్రమ కేసులు పెట్టారని చెప్పిన వైసీపీ నేత, మాజీ మంత్రి జోగి రమేశ్ అదే నోటితో తాజాగా నిజం చెప్పారు. అగ్రిగోల్డ్ భూములను అందరూ కొన్నట్టే తాము కూడా కొనుగోలు చేశామని వెల్లడించారు. ఈ సందర్భంగా పత్రికా ప్రకటన ఇచ్చిన తర్వాతే కొనుగోలు చేసినట్టు తెలిపారు. తమ నుంచి కొన్నవారు కూడా పత్రికా ప్రకటన ఇచ్చారని అన్నారు. దీంతో జోగిలాగే మరెందరు అక్రమంగా 'అగ్రి' భూములు కొన్నారో అనే చర్చ మొదలైంది. అయితే.. దీనికి ముందు మాత్రం ఆయన తమకు ఏపాపం తెలియదంటూ బుకాయించారు. అగ్రిగోల్డ్ భూముల వివాదంలో తమ కుటుంబసభ్యుల పాత్ర ఎంతమాత్రం లేదన్నారు. "ఆ అగ్రిగోల్డ్ ఏమిటో.. దాని ఆస్తుల గోలేమిటో మాకు తెలియనే తెలియదు" అని చెప్పుకొచ్చారు. అంతేకాదు రిజిస్టర్ అయిన ఆస్తులను తామెలా ఆక్రమించుకుంటామన్నారు. కానీ, ఇంతలోనే ఆయన "అందరూ ఎలా కొన్నారో మేమూ అలానే కొన్నాం" అంటూ అగ్రిగోల్డ్ భూములను కొన్నది వాస్తవమేనని అంగీకరించారు. కాగా, అభశుభం తెలియని తన కుమారుడిపై అక్రమంగా కేసులు పెట్టి సబ్ జైలులో ఉంచారని జోగి రమేశ్ ఆవేదన వ్యక్తం చేశారు.

దాడి కాదు.. నిరసనే!

గత వైసీపీ హయాంలో టీడీపీ అధినేత చంద్రబాబు నివాసంపై దాడి చేసిన కేసులో నిందితునిగా ఉన్న జోగి రమేశ్‌ను మంగళగిరి పోలీసులు శుక్రవారం విచారించారు. మంగళగిరి రూరల్ ఠాణాకు మధ్యాహ్నం 2 గంటల సమయంలో తన న్యాయవాదులతో కలిసి వచ్చిన రమేశ్‌ను డీఎస్పీ ప్రశ్నించారు. ఘటన సమయంలో తాను వాడిన కారు, సెల్‌ఫోన్‌ను ఆయ న తీసుకువచ్చారు. విచారణ అనంతరం జోగి మీడియాతో మాట్లాడుతూ.. అధికారంలో ఉన్న సమయంలో పరుష పదజాలం వాడినందువల్లే తమకు ఈ పరిస్థితి వచ్చిందన్నారు. నాటి సీఎం జగన్‌ను టీడీపీ నేత అయ్యన్నపాత్రుడు అసభ్య పదజాలంతో దూషించారని, దీనికి నిరసన తెలిపేందుకే తాము ఆనాడు చంద్రబాబు నివాసం వద్దకు వచ్చామన్నారు. అంతేతప్ప దాడి చేయడానికి కాదన్నారు. పోలీసు అధికారులు తనను ఎప్పుడు విచారణకు రమ్మన్నా వస్తానని చెప్పారు. కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు మాని సూపర్‌సిక్స్ పథకాల అమలుపై దృష్టి పెట్టాలని జోగి రమేశ్ సూచించారు.

'తొలి' అడుగు సక్సెస్!







రెండు క్రేన్ల సాయంతో స్టాప్‌లాగ్ బ్లాక్‌ను 1675 అడుగులకు తీసుకెళ్లి... అత్యంత జాగ్రత్తగా గాడిలో కూర్చోబెట్టి... 1624 అడుగుల వద్ద నీటిమట్టం వరకు చేర్చిన దృశ్యం

- విజయవంతంగా స్టాప్‌లాగ్ బ్లాక్ అమరిక
- ఫలించిన ఇంజనీర్ల భగీరథ ప్రయత్నం
- వరద ఒత్తిడిని తట్టుకుని సాగిన ప్రయాణం
- అడ్డొచ్చిన హాయిస్ట్ బ్రిడ్జ్, కౌంటర్ వెయిట్ తొలగింపు
- రెండు భారీ క్రేన్లతో స్టాప్‌లాగ్‌ను లేపి.. మెల్లమెల్లగా బెడ్‌లెవెల్ దాకా దించి...
- కీలక విజయంతో ప్రాజెక్టు వద్ద సంబరాలు
- నేడు మిగిలిన బ్లాక్‌లు అమర్చే అవకాశం

(రాయదుర్గం/బళ్లారి/కర్నూలు - ఆంధ్రజ్యోతి)

తుంగభద్ర నీటిని కాపాడుకునేందుకు చేస్తున్న భగీరథ ప్రయత్నంలో తొలి అడుగు విజయవంతంగా పడింది. కొట్టుకుపోయిన 19వ నంబరు క్రస్ట్‌గేటు స్థానంలో స్టాప్‌లాగ్ ఏర్పాటు ప్రక్రియ సాఫీగా ముందుకు పడింది. ఇంజనీర్లు, కార్మికుల నిరంతర శ్రమ ఫలించింది. స్టాప్‌లాగ్‌లోని తొలి ఎలిమెంట్... శుక్రవారం రాత్రి 9.05 గంటలకు భద్రంగా కిందికి దిగి ప్రాజెక్టు బెడ్‌లెవెల్‌పై కూర్చుంది. దీంతో తుంగభద్ర జలాశయం వద్ద సంబరాలు మిన్నంటాయి. ఇంజనీరింగ్ అధికారులు, కార్మికులు, అధికారులు పరస్పరం ఆలింగనం చేసుకున్నారు. ఆనందంతో మిఠాయిలు పంచుకున్నారు.

'తొలి' అడుగు ఇలా...

ఈ నెల 10వ తేదీ రాత్రి 10.30 గంటల సమయంలో తుంగభద్ర జలాశయం 19వ క్రస్టుగేటు కొట్టుకుపోయింది. నీటిమట్టం క్రస్ట్‌గేటుకంటే దిగువకు వచ్చాకే... స్టాప్‌లాగ్ ఏర్పాటు చేయాలని తొలుత భావించారు. కానీ, నీటిని కాపాడుకోవాలనే లక్ష్యంతో గతంలో ఎన్నడూలేని విధంగా సాహసోపేత ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. వరద ఉండగానే స్టాప్‌లాగ్ ఏర్పాటుకు రంగం సిద్ధం చేశారు. 4 అడుగుల ఎత్తు, 60 అడుగుల వెడల్పుతో ఐదు ఎలిమెంట్లను ఒకదాని మీద ఒకటిగా దించాలని నిర్ణయించారు. క్రస్ట్‌గేట్ల నిపుణుడు కన్నయ్య నాయుడు ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ మొదలైంది. గురువారం రాత్రే తొలి ఎలిమెంట్‌ను అమర్చాలని భావించినా... కొలతల్లో తేడా వచ్చింది. 60 అడుగుల వెడల్పున్న భారీ ఇనుప నిర్మాణాన్ని అటూ ఇటూ అంగుళం చొప్పున కరిగించారు. శుక్రవారం ఉదయం దీనిని అమర్చే ప్రక్రియ ప్రారంభించారు. జలాశయం గరిష్ఠ నీటి మట్టం 1633 అడుగులు. దానిపైన సుమారు 40-45 అడుగులు ఎత్తులో హాయిస్ట్ బ్రిడ్జి (క్రస్ట్‌గేట్ల నిర్వహణ కోసం నిర్మించిన ఇనుప వంతెన) ఉంది. స్టాప్‌లాగ్ ఎలిమెంట్‌ను గేటు గాడిలో దింపేందుకు... హాయిస్ట్ బ్రిడ్జితోపాటు కౌంటర్ వెయిట్ (గేటు బరువుకు సమానంగా సమాంతరం ఏర్పాటు చేసిన ఇనుప దిమ్మె) క్రేన్లకు అడ్డుగా నిలిచాయి. దీంతో... ఆ రెండింటినీ తొలగించాల్సి వచ్చింది. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం 5:30 గంటలవరకు తీవ్రస్థాయిలో శ్రమించి వీటిని జాగ్రత్తగా తొలగించారు. సుమారు 1675 అడుగుల ఎత్తు నుంచి గమ్యస్థానం 1613 అడుగుల లెవల్‌లో ఉన్న స్పిల్‌వే బెడ్‌లెవెల్ వరకు... అంటే 65 అడుగుల ప్రయాణం! ఇందులో చివరి 11 అడుగులు వరద జలాల గుండా సాగాలి. ఇదే అత్యంత కీలకం. రాత్రి 7:15 గంటల సమయంలో, ఫ్లడ్‌లైట్ల వెలుగులో స్టాప్‌లాగ్ ఎలిమెంట్ అమరిక మొదలుపెట్టారు. స్టాప్‌లాగ్ ఎలిమెంట్‌ను అటూ ఇటూ రెండు భారీ క్రేన్ల సహాయంతో పైకి లేపారు. క్రేన్ ఆపరేటర్లు దీనిని అత్యంత చాకచక్యంగా 1675 అడుగుల ఎత్తున మొదలయ్యే గైడ్ యాంగిల్ (గాడి)లో అమర్చారు. అక్కడి నుంచి 1624 అడుగుల వరకు ఎలిమెంట్‌ను మెల్లమెల్లగా కిందికి దించుతూ వచ్చారు. ఈ దశలో ఒక నిపుణుడు ఎలిమెంట్‌పైనే నిల్చుని... అది బ్యాలెన్స్ తప్పకుండా అటూ ఇటూ కదులుతూ చాకచక్యంగా వ్యవహరించారు. 1624 అడుగుల వద్ద స్టాప్‌లాగ్ ఎలిమెంట్‌ను వరద జలాలు తాకాయి. ఈ దశలో కన్నయ్య నాయుడు, ఇతర ఇంజనీర్లు పూర్తి అప్రమత్తతతో వ్యవహరించారు. క్రేన్ ఆపరేటర్లకు తగిన సూచనలు చేశారు. కొట్టుకుపోయిన క్రస్ట్‌గేట్ ఖాళీ నుంచి జోరుగా ప్రవహిస్తున్న జలాల చీల్చుకుంటూ ఎలిమెంట్‌ను నెమ్మదిగా కిందికి దించారు. అలా ఒక్కో సెంటీమీటరు చొప్పున 11 అడుగులు నీటిలో కిందికి దించుతూ... 1613 అడుగుల వద్ద స్పిల్‌వే బెడ్‌పై భద్రంగా కూర్చోబెట్టారు. అత్యంత కీలకమైన, సంక్లిష్టమైన ఈ 11 అడుగుల ప్రయాణం గంటన్నరపాటు సాగింది. చివరకు అనుకున్న స్థానంలో ఎలిమెంట్ స్థిరపడింది. దీంతో... 60 అడుగుల వెడల్పు, 4 అడుగుల ఎత్తు, 13 టన్నుల బరువున్న స్టాప్‌లాగ్ తొలి ఎలిమెంట్‌ను అమర్చే పని విజయవంతంగా పూర్తయింది. ఆ వెంటనే కార్మికులు, ఇంజనీర్లు పరస్పరం ఆలింగనం చేసుకుని మిఠాయిలు పంచుకున్నారు.

మరో నాలుగు...

తుంగభద్ర జలాశయం నీటిని కాపాడేందుకు చేపట్టిన స్టాప్‌లాగ్ గేట్ ఏర్పాటు దేశ చరిత్రలో అద్భుత ఘట్టంగా నిలిచిపోతుందని ఇంజనీరింగ్ నిపుణులు పేర్కొన్నారు. దాదాపు 11 అడుగులు వేగంగా ప్రవహించే వరద నీటి ఉధృతి, ఒత్తిడిని అధిగమించి స్టాప్‌లాగ్ అమర్చడం ఓ రికార్డు అని తెలిపారు. ఏపీ మంత్రులు పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు నిపుణులను, సిబ్బందిని అభినందించారు. జలాశయం వద్ద మరో రెండు ఎలిమెంట్లు సిద్ధంగా ఉన్నాయి. మిగిలిన రెండు శనివారం ఉదయానికి ప్రాజెక్టుకు చేరుకుంటాయి. వాటిని ఒకదాని మీద ఒకటి ఏర్పాటు చేస్తూ రావాలి. అప్పుడు... 60 అడుగుల వెడల్పు... 20 అడుగుల ఎత్తుతో 'స్టాప్‌లాగ్‌'ను పూర్తిగా అమర్చినట్లవుతుంది. శనివారం రాత్రికి ఈ ప్రక్రియ పూర్తయ్యే అవకాశముందని ఇంజనీర్లు చెబుతున్నారు. ఇది విజయవంతంగా పూర్తయితే... ఇప్పటికిప్పుడు 25 టీఎంసీల నీటిని కాపాడుకున్నట్లవుతుంది. ఈ సీజన్‌లో ముందు వచ్చే వరద జలాలనూ పట్టి నిలిపినట్లే!



హాయిస్ట్ బ్రిడ్జి, కౌంటర్ వెయిట్‌ను తొలగించిన అనంతరం స్టాప్‌లాగ్‌ను అమర్చారు

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● శనివారం 17 ఆగస్టు 2024
diksuchi@andhrajyothy.co

ఆంధ్ర యూనివర్సిటీలో

డిస్టెన్స్, ఆన్‌లైన్ కోర్సులు

విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీకి చెందిన సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్(ఏయూ-సీడీఓఈ) ఆధ్వర్యంలోని స్కూల్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్(ఎస్‌డీఈ)- ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్, ఆన్‌లైన్ మోడ్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. అడ్మిషన్ తీసుకున్న అభ్యర్థులకు సంబంధిత స్టడీ మెటీరియల్ అందిస్తారు. ప్రోగ్రామ్‌లకు నిర్దేశించిన సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.



అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులు

- బీఏ, బీకాం, బీఎస్సీ డిగ్రీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు, ఆరు సెమిస్టర్లు ఉంటాయి. బీఎస్సీ ప్రోగ్రామ్‌ను ఇంగ్లీష్ మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది. మిగిలినవాటిని ఇంగ్లీష్, తెలుగు మాధ్యమాల్లో చదువుకోవచ్చు.
- **బీఎస్సీ గ్రూప్ సబ్జెక్టులు:** మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, స్టాటిస్టిక్స్, బోటనీ, జువాలజీ
- **అర్హత:** బీఏ, బీకాం కోర్సులకు ఏదేని గ్రూప్‌తో ఇంటర్/రెండేళ్ల ఐటీఐ/పాలిటెక్నిక్ డిప్లొమా ఉత్తీర్ణులు; వెటర్నరీ/అగ్రికల్చర్ డిప్లొమా పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఏపీఓఎస్/ఎన్ఐఓఎస్ అభ్యర్థులు కూడా అర్హులే. బీఎస్సీ(ఎంపీసీ/ఎంపీసీఎస్/ఎంస్టాట్‌సీఎస్) కోర్సులకు పాలిటెక్నిక్ డిప్లొమా/ఇంటర్(ఎంపీసీ)ఉత్తీర్ణులు; మేథమెటిక్స్‌లో బ్రిడ్జ్ కోర్సు పూర్తిచేసిన ఒకేషనల్ అభ్యర్థులు అర్హులు. బీఎస్సీ(సీబీజడ్) కోర్సుకు ఇంటర్(బైపీసీ)/డిప్లొమా(వెటర్నరీ/అగ్రికల్చర్) ఉత్తీర్ణులు; సైన్స్‌లో బ్రిడ్జ్ కోర్సు పూర్తిచేసిన ఒకేషనల్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులు

- ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఎంబీఏ, ఎంసీఏ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ఈ ప్రోగ్రామ్‌లను ఇంగ్లీష్ మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది.
- **ఎంఏ స్పెషలైజేషన్‌లు:** తెలుగు, ఇంగ్లీష్, ఎకనామిక్స్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, హిస్టరీ, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్స్, ఫిలాసఫీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, మేథమెటిక్స్
- **ఎమ్మెస్సీ స్పెషలైజేషన్‌లు:** సైకాలజీ, మేథమెటిక్స్, బోటనీ, ఫిజిక్స్, ఆర్గానిక్ కెమిస్ట్రీ, జువాలజీ
- **ఎంబీఏ స్పెషలైజేషన్‌లు:** హెచ్‌ఆర్‌ఎం, ఫైనాన్స్, మార్కెటింగ్
- **అర్హత:** ఎంసీఏలో ప్రవేశానికి బీటెక్(సీఎస్ఈ)/బీసీఏ ఉత్తీర్ణులు; ఇంటర్ స్థాయిలో మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా చదివి బీఎస్సీ/బీకాం/బీఏ పూర్తిచేసినవారు; బీఏ/బీకాం ఉత్తీర్ణతతోపాటు ఏయూ నుంచి పీజీడీసీపీఏ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. మిగిలిన ప్రోగ్రామ్‌లకు ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. (ఎంఏ/ఎమ్మెస్సీ)(మేథమెటిక్స్), ఎమ్మెస్సీ(బోటనీ/ఫిజిక్స్/ఆర్గానిక్ కెమిస్ట్రీ/జువాలజీ), ఎంఏ(హిందీ) ప్రోగ్రామ్‌లకు మాత్రం డిగ్రీ స్థాయిలో సంబంధిత స్పెషలైజేషన్ సబ్జెక్ట్ చదివి ఉండాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **ప్రింట్ మెటీరియల్ కోసం చెల్లించాల్సిన ఫీజు:** సెమిస్టర్‌కు రూ.600
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 31
- **వెబ్‌సైట్:** www.andhrauniversity-sde.com

రిమైండర్స్

సెస్‌లో పీహెచ్‌డీ



బేగంపేట(హైదరాబాద్)లోని సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్(సెస్)- పీహెచ్‌డీ ప్రోగ్రామ్ ఇన్ డెవలప్‌మెంట్ స్టడీస్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ ప్రోగ్రామ్‌నకు నిజామాబాద్‌లోని తెలంగాణ యూనివర్సిటీ సహకారం అందిస్తోంది. మొత్తం 12 సీట్లు ఉన్నాయి. రీసెర్చ్ ప్రపోజల్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. తెలంగాణ ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్లు వర్తిస్తాయి. స్థానికేతరులకు హాస్టల్ సౌకర్యం ఉంది. అర్హులైన అభ్యర్థులకు ఫైనాన్షియల్ అసిస్టెన్స్/ఫెలోషిప్స్ అందిస్తారు.

ప్రోగ్రామ్ వివరాలు: ప్రోగ్రామ్ వ్యవధి ఆరేళ్లు. మొదటి ఏడాది రెండు సెమిస్టర్లు ఉంటాయి. వీటిలో కోర్సు వర్క్‌లు ఉంటాయి. మొదటి సెమిస్టర్‌లో రీసెర్చ్ మెథడాలజీ, పర్‌స్పెక్టివ్స్ అండ్ పారాడైమ్స్ ఆఫ్ డెవలప్‌మెంట్, ఫండమెంటల్స్ ఆఫ్ ఎకనామెట్రిక్స్/డెవలప్‌మెంట్ స్టాటిస్టిక్స్ పేపర్లు; రెండో సెమిస్టర్‌లో ఇండియాస్ డెవలప్‌మెంట్ డిబేట్, అప్లయిడ్ ఎకనామెట్రిక్స్/అప్లయిడ్ స్టాటిస్టిక్స్, పారాడైమ్స్ ఇన్ సోషల్ సైన్సెస్ పేపర్లు ఉంటాయి. ఈ రెండు సెమిస్టర్లు పూర్తయిన తరవాత అభ్యర్థులు ప్రీ పీహెచ్‌డీ టెస్ట్ రాయాల్సి ఉంటుంది. ఇందులో కనీసం 50 శాతం మార్కులు సాధించినవారిని మాత్రమే పీహెచ్‌డీ రిజిస్ట్రేషన్‌కు అనుమతిస్తారు. పీహెచ్‌డీలో చేరినవారు అయిదేళ్లపాటు రీసెర్చ్/థీసిస్ వర్క్ చేయాల్సి ఉంటుంది.

విభాగాలు: ఎకనామిక్స్ సోషియాలజీ/ఆంత్రోపాలజీ/సోషల్ వర్క్, డెవలప్‌మెంట్ స్టాటిస్టిక్స్ పొలిటికల్ సైన్స్/పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, కామర్స్/బిజినెస్ మేనేజ్‌మెంట్

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సంబంధిత స్పెషలైజేషన్‌తో పీజీ పూర్తిచేసి ఉండాలి. కనీసం 55 శాతం మార్కులు ఉండాలి. యూజీసీ జేఆర్ఎఫ్/యూజీసీ నెట్ అర్హత తప్పనిసరి.

ఎంపిక: అభ్యర్థులు దరఖాస్తుతో పాటు కనీసం 1500 పదాలతో రీసెర్చ్ ప్రపోజల్ సబ్మిట్ చేయాలి. దీని ఆధారంగానే అభ్యర్థులను షార్ట్‌లిస్ట్‌చేసి పర్సనల్ ఇంటర్వ్యూకి పిలుస్తారు. రీసెర్చ్ ప్రపోజల్ సబ్మిట్ చేయనివారి దరఖాస్తులను పరిశీలించరు.

- యూజీసీ జేఆర్ఎఫ్ అర్హత ఉన్నవారికి పర్సనల్ ఇంటర్వ్యూలో సాధించిన స్కోర్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. యూజీసీ నెట్ అర్హత ఉన్నవారికి నెట్ స్కోర్‌కు 70 శాతం, ఇంటర్వ్యూ స్కోర్‌కు 30 శాతం వెయిటేజీ ఉంటుంది.

ముఖ్యసమాచారం

- **దరఖాస్తు:** రూ.1000
- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** ఆగస్టు 20
- **పర్సనల్ ఇంటర్వ్యూలు:** ఆగస్టు 30
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** సెప్టెంబరు రెండో వారంలో
- **చిరునామా:** డీన్, డివిజన్ ఆఫ్ గ్రాడ్యుయేట్ స్టడీస్, సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్, నిజామియా అబ్జర్వేటరీ క్యాంపస్, బేగంపేట్, హైదరాబాద్-500016.
- **వెబ్‌సైట్:** www.cess.ac.in

నార్త్ రైల్వేలో అప్రెంటిస్‌లు

ఖాళీలు: 4,096

న్యూఢిల్లీలోని రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్(ఆర్ఆర్‌సీ)-నార్త్ రైల్వే... ఎన్ఆర్ పరిధిలోని డివిజన్/వర్క్‌షాప్/యూనిట్లలో అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

ఆర్ఆర్‌సీ వర్క్‌షాప్‌లు: క్లస్టర్ లఖ్‌నవూ, క్లస్టర్ అంబాలా, క్లస్టర్ మొరాదాబాద్, క్లస్టర్ ఢిల్లీ, క్లస్టర్ ఫిరోజ్‌పూర్

పోస్టు: యాక్ట్ అప్రెంటిస్

అర్హత: పదో తరగతితోపాటు సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.

ట్రేడ్‌లు: మెకానికల్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, కార్పెంటర్, ఎంఎంవీ, ఫోర్జర్ అండ్ హీట్ ట్రీటర్, వెల్డర్, పెయింటర్, మెషినిస్ట్, టర్నర్, ట్రిమ్మర్, రిఫ్రిజిరేటర్ అండ్ ఏసీ మెకానిక్, డేటా ఎంట్రీ ఆపరేటర్, హేమర్‌మన్, టర్నర్, క్రేన్ ఆపరేటర్, స్టెనోగ్రాఫర్ తదితరాలు.

వయోపరిమితి: 2024 సెప్టెంబరు 16 నాటికి 15 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.

ఎంపిక విధానం: మెట్రిక్యులేషన్, ఐటీఐ మార్కులు, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపిక చేస్తారు.

దరఖాస్తు రుసుము: రూ.100. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళా అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 16

వెబ్‌సైట్: https//www.rrcnr.org/

బిలాస్‌పూర్ ఎయిమ్స్‌లో టెక్నీషియన్స్

ఖాళీలు: 68

బిలాస్‌పూర్‌లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్)... ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు

1. ల్యాబ్ టెక్నీషియన్: **36 పోస్టులు**
2. టెక్నీషియన్(ఓటీ/పెర్ఫ్యూజన్ టెక్నాలజీ): **32 పోస్టులు**

అర్హత: ఇంటర్మీడియట్, పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఎస్సీ(మెడికల్ ల్యాబొరేటరీ టెక్నాలజీ/మెడికల్ ల్యాబొరేటరీ సైన్స్) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

జీతం: నెలకు రూ.35,400

వయోపరిమితి: 18 - 35 ఏళ్ల మించకూడదు

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ దరఖాస్తులను ప్రాజెక్ట్ మేనేజర్(హెచ్ఆర్), బ్రాడ్‌కాస్ట్ ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్(బీఈసీఐఎల్), బీఈసీఐఎల్ భవన్, సీ-56/ఏ-17, సెక్టార్-62, నోయిడా చిరునామాకు పంపాలి.

ఆఫ్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: ఆగస్టు 19

వెబ్‌సైట్: https://www.becil.com/vacancies

ఇన్‌స్పేస్‌లో డైరెక్టర్ పోస్టులు

ఖాళీలు: 16

అహ్మదాబాద్‌లోని ఇండియన్ నేషనల్ స్పేస్ ప్రమోషన్ అండ్ ఆథరైజేషన్ సెంటర్(ఇన్‌స్పేస్)... కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. డిప్యూటీ డైరెక్టర్: **5 పోస్టులు**
2. అసిస్టెంట్ డైరెక్టర్: **9 పోస్టులు**
3. సెక్షన్ ఆఫీసర్: **2 పోస్టులు**

విభాగాలు: ఇండస్ట్రీ ఔట్‌రీచ్, కో ఆర్డినేషన్, లీగల్, ఎర్త్ అబ్జర్వేషన్ అప్లికేషన్, శాటిలైట్ ఎర్త్ స్టేషన్ అండ్ గ్రౌండ్ సెగ్మెంట్, అడ్మినిస్ట్రేషన్ తదితరాలు.

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో కనీసం 65 శాతం మార్కులతో డిప్లొమా, డిగ్రీ(లా), బీఈ/బీటెక్(ఐటీ/కంప్యూటర్ సైన్స్), ఎంబీఏ(మార్కెటింగ్/బిజినెస్/ఎకనామిక్స్/కామర్స్), పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: డిప్యూటీ డైరెక్టర్ పోస్టుకు 45 ఏళ్లు, అసిస్టెంట్ డైరెక్టర్ పోస్టుకు 40 ఏళ్లు, డిప్యూటీ డైరెక్టర్(లీగల్) పోస్టుకు 50 ఏళ్లు, సెక్షన్ ఆఫీసర్ పోస్టుకు 30 ఏళ్లు, సెక్షన్ ఆఫీసర్(అడ్మినిస్ట్రేషన్) పోస్టుకు 38 ఏళ్లు మించకూడదు.

పని ప్రదేశాలు: బెంగళూరు, అహ్మదాబాద్

ఎంపిక ప్రక్రియ: ఇంటర్వ్యూ, మెడికల్ టెస్ట్ తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 2

వెబ్‌సైట్: www.inspace.gov.in/inspace

ఆన్‌లైన్ మెటీరియల్ కంటే పాఠ్య పుస్తకాలే బెటర్..!

దశాబ్దకాలంగా విద్యారంగంలో చోటు చేసుకుంటున్న భారీ మార్పులు నిపుణులను ఆందోళనలకు గురిచేస్తున్నాయి. ఇందుకు రోజురోజుకూ విస్తరిస్తున్న ఆన్‌లైన్ విధానమే ప్రధాన కారణం. విద్యార్థులు పాఠ్యపుస్తకాల కంటే ఆన్‌లైన్ మెటీరియల్ వైపే ఎక్కువగా ఆసక్తి కనబరుస్తున్నారు. అయితే.. ఆన్‌లైన్ మెటీరియల్ ఏ మేరకు ప్రామాణికమో ప్రతి ఒక్కరూ గమనించాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు.



ఆన్‌లైన్‌లో కావాల్సినంత మెటీరియల్ లభిస్తుండగా, పాఠ్యపుస్తకాల అవసరం ఏమిటనేది కొంత మంది అభిప్రాయం. పుస్తకాలు కొనడం ఖర్చుతో కూడిన వ్యవహారం. అదే ఆన్‌లైన్ మెటీరియల్ అయితే ఉచితంగా లభిస్తుంది. కొన్ని పదాలు టైప్ చేస్తే చాలు మనకు కావాల్సిన సమాచారం క్షణాల్లో కళ్ల ముందే కనిపిస్తుంది. అయితే ఇదంతా సులువైన వ్యవహారం కాదని, పాఠ్య పుస్తకాల మాదిరిగా ఇంటర్నెట్‌లో లభించేదంతా ప్రామాణికమైన సమాచారం కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అలాగే విద్యార్థుల దృష్టి మరల్చే పలు విషయాలు అక్కడ ఉంటాయి. దీంతో అసలుకే మోసం వస్తుందని వారు చెబుతున్నారు.

ప్రామాణికత: సాధారణంగా పాఠ్య పుస్తకాలను నిపుణులు రాస్తారు. దాన్ని అనేకసార్లు సమీక్షిస్తారు. ఆ తరవాతే ప్రచురణకు పంపిస్తారు. కాబట్టి వీరు రాసే పాఠ్య పుస్తకాలకు ప్రామాణికత ఎక్కువ. అదే ఇంటర్నెట్‌లో ఎవరైనా ఆర్టికల్స్ లేదా మెటీరియల్ అప్‌లోడ్ చేయవచ్చు. ఇలాంటి సమాచారంతో విద్యార్థులు మిస్ గైడ్ అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

క్షుణ్ణంగా, విస్తృతంగా: పాఠ్య పుస్తకాల్లో సమాచారం చాలా క్షుణ్ణంగా, విస్తృతంగా ఉంటుంది. ప్రతి టాపిక్‌ని క్రమపద్ధతిలో, సవివరమైన ఉదాహరణలతో, బ్యాక్ గ్రౌండ్ సమాచారంతో వివరిస్తారు. ఈ విధమైన నిర్మాణాత్మక విధానం వలన విద్యార్థులు పాఠ్యాంశాలను సమగ్రంగా అవగాహన చేసుకుంటారు.

ప్రణాళికాయుత అభ్యసన - పాఠ్యంశాల అమరిక: సాధారణంగా తరగతి గదిలో బోధించే ఉపాధ్యాయులే పాఠ్య పుస్తకాలను రచిస్తారు. వారినే ప్రచురణకర్తలు సంబంధిత సబ్జెక్టుల పుస్తకాల ప్రచురణ కోసం సంప్రదిస్తారు. అందువల్ల వారు రాసే పాఠ్య పుస్తకాలు నిర్దేశించిన పాఠ్యప్రణాళిక ప్రమాణాల మేరకు ఉంటాయి. అదే ఇంటర్నెట్‌లో లభించే మెటీరియల్ దీనికి భిన్నంగా ఉండే అవకాశాలే ఎక్కువగా ఉంటాయి.

పరధ్యానాన్ని తగ్గించడం: బ్రౌజింగ్, ఆవలించడం, మరో ట్యాబ్‌ను ఓపెన్ చేయడం, సోషల్ మీడియా పేజీని సందర్శించడం ఇంటర్నెట్‌లో సర్వసాధారణం. దీని బారిన పడిన విద్యార్థులు క్రమంగా అభ్యసన సామర్థ్యాలు కోల్పోతున్నారు. ఫలితంగా తరచుగా తమ దృష్టిని చదువు మీద నుంచి ఇతర వ్యాపకాలవైపు మళ్లిస్తున్నారు. ఇంటర్నెట్‌కు దూరంగా ఉండే విద్యార్థులే చదువుపై శ్రద్ధ వహిస్తుంటారు.

స్థిరమైనది-శాశ్వతమైనది: పాఠ్యపుస్తకాల్లో ఉండే సమాచారమే స్థిరమైనది, శాశ్వతమైనది. ఆన్‌లైన్ సమాచారం స్థిరంగా ఉండదు. నమ్మశక్యమైనదీ కాదు. ఏదైనా సమాచారం కోసం బ్రౌజింగ్ చేస్తుండగా పేజీ ఎర్రర్ అని వచ్చినప్పుడు, సంబంధిత కంటెంట్ కూడా మారిపోయి కన్పిస్తుంది. కరెక్ట్ వెర్షన్ ఏదో తెలియక విద్యార్థులు అయోమయానికి లోనయ్యే అవకాశం ఉంది. కాబట్టి ఆన్‌లైన్ మెటీరియల్‌తో పోల్చితే పాఠ్యపుస్తకాల్లోని సమాచారమే స్థిరమైనది, శాశ్వతమైనదని నిస్సందేహంగా చెప్పొచ్చు. ఎందుకంటే ఒకసారి పుస్తకం ప్రచురణ అయిన తరవాత అందులోని సమాచారాన్ని ఆన్‌లైన్‌లో మార్చినట్లుగా మార్చడం కుదరదు. అందువల్ల విద్యార్థుల పటిష్ఠమైన జ్ఞాన సముపార్జనలో ఈ స్థిరత్వమే అత్యంత క్రియాశీల పాత్రను పోషిస్తుంది. త్వరగా సెర్చ్ చేయడం, ప్రత్యామ్నాయ సమాచార సేకరణలో ఇంటర్నెట్ అమూల్య వనరు అయితే... ప్రభావశీల అధ్యయనంలో పాఠ్య పుస్తకమే మూల స్తంభం. ప్రామాణికత, విస్తృత సమాచారం, నిర్మాణాత్మక విధానం, పరధ్యానానికి లోనుగాకపోవడం వంటివి కేవలం పాఠ్యపుస్తకాల ద్వారానే సాధ్యమవుతుంది. ఇవే విద్యలో మూల సాధనాలు.

చిట్టీల్

చావు తెచ్చిన మామిడి పండ్లు

తెనాలి రామలింగ కవి ఒక రోజు కృష్ణ దేవరాయల కొలువుకు వెళుతూ ఉండగా భటుడు ఒకరు బంగారు పళ్లెం నిండా మామిడిపండ్లను వాటితో పాటు ఒక లేఖను లోపలికి తీసుకెళ్లడం చూసాడు. ఆ మామిడి పండ్ల తియ్యని వాసనకు తెనాలి రామలింగ కవికి నోరు ఊరింది. ఆ పండ్లలో ఒక పండైనా తింటే బాగుండు అనుకున్నాడు. రాజు గారికి ఆ పండ్లు అందగానే ఒక పండును తీసి కొంచెం కొరికాడు. అది చూసిన రాజుగారు 'నీకెంత ధైర్యం? నా కోసమని పొరుగు దేశపు రాజు కానుకగా పంపిన పండ్లను, అది కూడా నా అనుమతి లేకుండా తింటావా? నీ తల తీయిస్తాను' అని కోపంగా అన్నాడు. వెంటనే రామలింగ కవి గట్టిగా ఇలా అరవసాగాడు' ఇవేమి పండ్లురా బాబోయ్; ఒక్కపండు కొంచెం తిన్నందుకే నాకు చావు మూడింది.



ఇక మొత్తం పండ్లు తిన్న మహారాజు గారికి ఏ గతి పట్టనుందో' అని కేకలు వేసాడు. ఆ చేష్టలకు నవ్వుకున్న రాయలు కవికి వేసిన శిక్షను రద్దు చేయడమే కాకుండా అతనికి కొన్ని మామిడి పండ్లను కూడా ఇచ్చి పంపాడు. తన చమత్కారంతో పండ్లను సాధించిన విధానం చూసి సభలో అందరూ రాజుగారితో పాటే వికటకవి తెలివికి నవ్వుకున్నారు.

దారి కనుక్కోండి



6 తేడాలు గుర్తించండి





సరైన నీడ కనుక్కోండి



డైలీ సుడోకు - 386

3					
		1	3	6	
1			6		
		6			2
	5	2	1		
					6

సుడోకు - 385 సమాధానం

4	6	7	2	3	5	1	8	9
1	2	3	6	9	8	7	4	5
8	9	5	7	1	4	2	6	3
6	8	1	5	2	9	4	3	7
2	3	4	8	7	1	5	9	6
5	7	9	3	4	6	8	2	1
9	5	6	1	8	2	3	7	4
3	4	8	9	5	7	6	1	2
7	1	2	4	6	3	9	5	8

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.